తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం 28.03.2026 | సంపుటి : 12 | సంచిక : 248 | పేజీలు : 12 | వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370
హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698




# యుద్ధం వేళ ఏం చేద్దాం?

## రాష్ట్రాల సన్నద్ధతపై ముఖ్యమంత్రులతో ప్రధాని వీడియో కాన్ఫరెన్స్





- పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో అత్యవసర ప్రణాళికలపై చర్చ
- నిత్యావసర సరుకుల సరఫరాకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సూచన
- సమావేశానికి దూరంగా ఎన్నికలు జరిగే రాష్ట్రాల ముఖ్యమంత్రులు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధం ఐదో వారంలోకి ప్రవేశించిన నేపథ్యంలో దేశంలో ఇంధన, నిత్యావసర వస్తువుల సరఫరాకు ఆటంకం లేకుండా చేసేందుకు కేంద్రం సిద్ధమైంది. ఈ మేరకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాష్ట్రాల సీఎంలతో వర్చువల్‌గా సమావేశమయ్యారు. ప్రస్తుత భౌగోళిక రాజకీయ అనిశ్చితి మధ్య దేశీయ ఇంధన భద్రతను కాపాడటమే ప్రధాన లక్ష్యంగా ఈ సమావేశం జరిగింది నిత్యావసర వస్తువుల సరఫరాకు విఘాతం కలగకుండా రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, ప్రజల అవసరాలను తీర్చడంలో టీమ్ ఇండియాగా కలిసికట్టుగా పోరాడాలని ప్రధాని మోదీ ఇప్పటికే సూచించారు. ఈ సంక్షోభం దీర్ఘకాలం కొనసాగే అవకాశం ఉందని ప్రధాని హెచ్చరించారు. ఈ క్రమంలో కొవిడ్-19 తరహాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరాన్ని ప్రధాని మోదీ ఈ సమావేశంలో వివరించనున్నారు. సమష్టి కృషితో పనిచేసి ప్రస్తుతం నెలకొన్న సవాళ్లను అధిగమించేలా ప్రధాని దిశానిర్దేశం చేయనున్నారు. ఈ సంక్షోభ సమయంలో ఆర్థిక వ్యవస్థను సుస్థిరంగా ఉంచేందుకు రాష్ట్రాలు ఇచ్చే సూచనల ఆధారంగానే తదుపరి మిగతా 2లో..

## చమురు సంస్థలను ఆదుకునేందుకు సుంకాలు తగ్గించిన కేంద్రం

- పెట్రోల్, డీజిల్‌పై అదనపు ఎక్సైజ్ డ్యూటీని రూ.10చొప్పున తగ్గింపు
- పెట్రోల్, డీజిల్ ధరలను 15 రోజులకోసారి సమీక్షిస్తామని ప్రకటన
- ఇంధన సరఫరాలో సమస్యల పరిష్కారానికి
- రక్షణ మంత్రి రాజ్‌నాథ్ నేతృత్వంలో కమిటీ



**న్యూఢిల్లీ(జనంసాక్షి):** దేశంలో ఇంధన కొరతను అధిగమించేందుకు ప్రయత్నాలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వం.. ఆ దిశగా చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలో పెట్రోల్, డీజిల్‌పై అదనపు ఎక్సైజ్ డ్యూటీని రూ.10చొప్పున తగ్గించింది. డీజిల్, ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయెల్ ల ఎగుమతిపై సుంకాన్ని విధించింది. అయితే, వీటి ధరలను ప్రతి 15 రోజులకు ఒకసారి సమీక్షిస్తామని తెలిపింది. ఈ మేరకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇండైరెక్ట్ టాక్సెస్ అండ్ కస్టమ్స్ ఛైర్మన్ వివేక్ చతుర్వేది మిగతా 2లో..

### తెలంగాణలో సమృద్ధిగా పెట్రో నిల్వలు
గణాంకాలు విడుదల చేసిన ప్రభుత్వం
2లో..

### దేశంలో సరిపడా ఎరువుల నిల్వలు
కంగారుపడొద్దు
- లోక్‌సభలో కేంద్ర మంత్రి జేపీ నడ్డా
2లో..

### వాణిజ్య గ్యాస్ సరఫరా పెంపు
కొరతను అధిగమించేందుకు కేంద్రం కీలక నిర్ణయం .. 70 % పెంపు



## సజావుగా పెట్రో ఉత్పత్తుల సరఫరా

- రాష్ట్ర, జిల్లాల్లోనూ కమిటీల ఏర్పాటు
- నోడల్ ఆఫీసర్ల నియామకం
- పీఎం సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్(జనంసాక్షి):**పెట్రోల్, డీజిల్, గ్యాస్ సరఫరాకు సంబంధించి సమీక్షకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో ఒక కమిటీని నియమించి పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల మిగతా 2లో..



## భద్రాచలంలో ఘనంగా రాములోరి పెళ్లి

పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించిన సీఎం దంపతులు
- మిథిలా మండపంలో కన్నుల పండువగా కళ్యాణోత్సవం
- భారీగా హాజరైన ప్రజలు.. పలువురు మంత్రులు, ప్రముఖుల రాక

**భద్రాద్రి కొత్తగూడెం (జనంసాక్షి):** దక్షిణ అయోధ్యగా బాసిల్లుతున్న భద్రాచల సీతారామచంద్రస్వామి వారి కల్యాణం కమనీయంగా అంగరంగ వైభవంగా జరిగింది. భద్రాచల క్షేత్రంలోని మిథిలా స్టేడియం ప్రాంగణంలో శిల్పకళా శోభితమైన శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కళ్యాణ మండపంలో శుక్రవారం భక్తుల రామ నామ జపంతో భక్తులు పరవశించిపోతుండగా, వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య శ్రీ సీతారాముల కల్యాణం చూడముచ్చటగా కొనసాగింది... శ్రీరామ నవమి సందర్భంగా తెల్లవారుజామున 2 గంటలకు స్వామివారికి సుప్రభాత సేవ, అనంతరం తిరువారాధన, ఆరగింపు, మంగళా శాసనం, అభిషేకం నిర్వహించారు. తదుపరి ధ్రువమూర్తులకు కల్యాణం, అదేవిధంగా మూలమూర్తులకు తిరువారాధన, మంగళా శాసనం, అభిషేకం, ధృవమూర్తులకు కల్యాణం నిర్వహించి స్వామివారిని అందంగా అలంకరించి, వేద పండితుల మంత్రోచ్చరణ నడుమ రామాలయ ప్రాంగణం నుండి మిథిలా స్టేడియంలోని కళ్యాణ మండపానికి స్వామివారిని అమ్మవార్ల ఉత్సవ మూర్తులను స్వర్ణ సింహాసనంపై ఆశీనులను చేశారు. అదేవిధంగా భక్త రామదాసు చేయించిన నగలను సీతారాములకు ధరింపజేసి వంశ గోత్రాలకు సంబంధించి ప్రవరలు చదివారు. అదే సమయంలో ఆశీర్వచనం పాదప్రక్షాళన పస్పోదక స్నానం జరిపి వరపూజ నిర్వహించారు. కళ్యాణ మండపం మీద ఆసీనులను చేసిన స్వామివారిని స్వర్ణ సింహాసనంపై మిగతా 2లో..

## తెలంగాణ ఆడబిడ్డ పార్టీ సత్తా ఏంటో చూపిస్తా

- ఏప్రిల్ 25న పేరు, జెండా, ఎజెండాను ప్రకటిస్తా
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత వెల్లడి

**నిజామాబాద్ బ్యూరో (జనంసాక్షి):** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత కీలక ప్రకటన చేశారు. ఏప్రిల్ 25న ఉదయం 10గంటలకు నూతన రాజకీయ పార్టీ స్థాపించబోతున్నట్లు వెల్లడించారు. మేడ్చల్ జిల్లా మునీరాబాద్‌లోని అధ్వయ కన్వెన్షన్‌లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి పార్టీ ప్రకటన చేయబోతున్నట్లు చెప్పారు. అదే రోజు పార్టీ పేరు, జెండాను ప్రకటిస్తామన్నారు. శ్రీరామనవ మి మంచి రోజు కాబట్టి ఇవాళ ప్రకటన చేస్తున్నట్లు చెప్పారు. యువత, మహిళలకు మా పార్టీలో మంచి స్థానం ఉంటుంది. ఇన్నాళ్లూ మగవాళ్లు ఏర్పాటు చేసిన పార్టీలను చూశారు. తెలంగాణ ఆడబిడ్డగా నేను పార్టీ పెడితే ఎలా ఉంటుందో మీరే చూస్తారని అన్నారు. ఈ మేరకు నూతన రాజకీయ పార్టీపై గతకొంతకాలంగా వస్తున్న ఊహాగానాలకు తెరదించుతూ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత కీలక ప్రకటన చేశారు. ఏప్రిల్ 25న ఉదయం 10 గంటలకు కొత్త పార్టీని స్థాపించనున్నట్లు తెలిపారు. మిగతా 2లో..





## నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు..

## తెలంగాణ నుంచి కాంగ్రెస్ స్టార్ క్యాంపెయినర్లు

సీఎం రేవంత్, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్‌లు ఎంపిక

ఒక్కో రాష్ట్రానికి 40 మంది చొప్పున నియామకం

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ ప్రచారాన్ని విస్తృతం చేస్తోంది. మూడు రాష్ట్రాలకు సంబంధించి స్టార్ క్యాంపెయినర్ల జాబితాను ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విడుదల చేశారు. ఒక్కో రాష్ట్రానికి 40 మంది చొప్పున నియమించారు. కేరళ, అస్సాం, పుదుచ్చేరితో పాటు గోవాలోని పోండా ఉప ఎన్నికల స్టార్ క్యాంపెయినర్‌గా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యవహరించనున్నారు. మరోవైపు పుదుచ్చేరి స్టార్ క్యాంపెయినర్లుగా తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ నియమితులయ్యారు.

# ఇరాన్‌తో కాళ్ల బేరానికి ట్రంప్

మరో 10 రోజుల గడువు పొడగింపు • హర్మూజ్ జలసంధిపైనా చర్చలకు సిద్ధమని వెల్లడి

## గడువు పెంచినా స్పందించని ఇరాన్

ఇరాన్‌పై దాడులు ఉధృతం చేస్తాం : ఇజ్రాయెల్ రక్షణ మంత్రి

తాను,మోదీ చేతల మనుషులమన్న అమెరికా అధ్యక్షుడు

**వాషింగ్టన్(జనంసాక్షి):**యుద్ధం ముగింపునకు సంబంధించి అమెరికా- ఇరాన్ మధ్య చర్చలపై అనిశ్చితి కొనసాగుతోంది. ఈ క్రమంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఓ కీలక ప్రకటన చేశారు. ఇరాన్ ఇంధన మౌలిక సదుపాయాలపై దాడులను మరో 10 రోజుల పాటు నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. టెహ్రాన్ ప్రభుత్వం అభ్యర్థ న మేరకే తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు ట్రూత్ సోషల్‌లో ఆయన పోస్టు పెట్టారు. యుద్ధం నేప థ్యంలో మూసివేసిన హర్మూజ్ జలసంధిని 48 గంటల్లోగా తిరిగి తెరవాలని ఇరాన్‌కు ట్రంప్ ఇటీవల అల్టిమేటం జారీచేసిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత ఈ విషయంలో వెనక్కితగ్గిన ట్రంప్ ఇరాన్‌తో చర్చలు కొనసాగుతున్నాయని, ఆ దేశ ఇంధన మౌలిక సదుపాయాలు, విద్యుత్ కేంద్రాలపై దాడులను ఐదు రోజుల వరకు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. తాజాగా ఈ దాడుల నిలిపివేతను మరో 10 రోజుల వరకు అంటే.. ఏప్రిల్ 6 వరకు పొడిగిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇక, యుద్ధం ముగింపునకు సంబంధించి ఇరాన్ తో చర్చలు అద్భుతంగా కొనసాగుతున్నాయని తెలిపారు. పురోగతి సంకేతాలు కూడా కన్పిస్తు న్నాయన్నారు. వీటిపై మీడియాలో వస్తున్న తప్పుడు ప్రచారాలను నమ్మవద్దన్నారు. ఈ 10 రోజుల విరామం.. కాల్పుల విరమణకు దారితీస్తుందా లేక తాత్కాలిక ఉద్రిక్తతలను మాత్ర మే తగ్గిస్తుందా అనేది అస్పష్టం. హర్మూజ్ జల సంధిని తెరిపించడానికి చర్యలు తీసుకుంటు న్నట్లు ట్రంప్ సంకేతాలు ఇచ్చారు. మిత్ర దేశాల మద్దతు ఉన్నా, లేకపోయినా కీలకమైన ప్రపంచ నౌకా రవాణా మార్గమైన హర్మూజ్‌ను తిరిగి తెరిపించడానికి అమెరికా కట్టుబడి ఉందని తెలిపారు. ఈ మేరకు ఆ దేశ ప్రభుత్వంతో చర్చలు జరుగుతున్నాయన్నా రు.ఇరాన్‌పై యుద్ధ తీవ్రతను తగ్గిస్తామంటూనే.. అమెరికా మిగతా 2లో..



### పశ్చిమాసియా ఉద్రిక్తతలతో మనవాళికి పెనుముప్పు

గ్లోబల్ సౌత్‌లో ఇంధనం, ఎరువులు, ఆహార భద్రతపై ఫ్రాన్స్ వేదికగా జీ7 విదేశాంగ మంత్రుల సమావేశంలో జైశంకర్ ఆందోళన


2లో..

# ముదురుతున్న ఎండలు

- రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ
- ఉత్తర, దక్షిణ తెలంగాణ జిల్లాల్లో పెరుగుతున్న ఎండల తీవ్రత
- 40 నుంచి 44 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం
- పలు జిల్లాల్లో జల్లులు కూడా కురవొచ్చన్న వాతావరణ శాఖ

**హైదరాబాద్(జనంసాక్షి):**ఉపరితల ద్రోణి ప్రభావం కారణంగా గత కొన్ని రోజులుగా రాష్ట్రంలో వర్షాలు కురవడంలో గరిష్ఠ ఉష్ణోగ్రతల నుంచి కాస్త ఉపశమనం లభించినా, మళ్లీ రెండు రోజుల నుంచి భానుడు భగభగమంటున్నాడు. పలు ప్రాంతాల్లో ఎండతో పాటు ఉక్కపోత కూడా పోస్తోంది. ఎండల తీవ్రతపై హైదరాబాద్?లోని భారత వాతావరణ కేంద్రం పలు జిల్లాల్లో ఆరెంజ్, ఎల్లో అలర్ట్‌లు జారీ చేసింది. ప్రధానంగా ఉత్తర, దక్షిణ తెలంగాణలోని కొన్ని ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని వాతావరణ శాఖ వెల్లడించింది. అయితే, కొన్ని జిల్లాల్లో ఈదురు గాలులతో పాటు తేలికపాటి వర్షాలు కూడా కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారి ధర్మరాజు తెలియజేశారు.రెండు, మూడు రోజుల నుంచి భానుడి ప్రతాపంతో రాష్ట్రవ్యాప్తంగా ఎండలు దంచికొడుతుండటంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. సాధారణం కంటే ఒకటి నుంచి రెండు డిగ్రీల



ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నాయి. ప్రధానంగా ఇవాళ, రేపు ఉత్తర తెలంగాణలో ఈ ప్రభావం ఎక్కువగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, మిగతా 2లో..

## దశాబ్దాల కఠోర శ్రమతోనే భారత్, చైనా అభివృద్ధి

అంతేగానీ విదేశాల దయతో ఏమాత్రం కాదు..!

చైనా రాయబారి షు ఫీహాంగ్ ఆసక్తికర వ్యాఖ్యలు



**బీజింగ్(జనంసాక్షి):**భారత అభివృద్ధిని కొనియాడుతూ.. చైనా రాయబారి షు ఫీహాంగ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కఠోర శ్రమ వల్లే కొన్ని దశాబ్దాలుగా భారత్, చైనా దేశాలు అభివృద్ధి సాధించాయి తప్ప.. విదేశాల దయతో కాదని అన్నారు. చైనాను ఉద్దేశిస్తూ అమెరికా ఉప విదేశాంగ కార్యదర్శి క్రిస్టోఫర్ లాండౌ అన్న మాటలకు కౌంటర్‌గానే షు ఫీహాంగ్ తాజాగా ఈ వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తోంది. గతంలో చైనా విషయంలో తాము చేసిన తప్పు.. భారత్ విషయంలో చేయమని లాండౌ అన్నారు. భారత్- చైనా యువజన చర్చల కార్యక్రమంలో చైనా రాయబారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'ఇటీవల కాలంలో భారత్- చైనా అద్భుతమైన అభివృద్ధిని సాధించాయి. ఈ విజయాలు ఇరుదేశాల ప్రజల శ్రమ ఫలితమే తప్ప ఇందులో ఇతర దేశాల దయ ఏమీ లేదు' అని పేర్కొన్నారు. ఇరుదేశాల మధ్య బలమైన ద్వైపాక్షిక సంబంధాల కోసం ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. పొరుగు దేశాల మిత్రులుగా.. భారత్- చైనా కొనసాగాలని, పరస్పర విజయం కోసం కలిసి పనిచేయాలన్నారు. అయితే, తమ మధ్య సంబంధాలు బలపడటం కొందరికి ఇష్టం లేదన్నారు. ఉద్దేశపూర్వకంగానే మిగతా 2లో..

## హెచ్-1బీలో కొత్త నిబంధనలు

కనీస వేతనం రూ.14వేల డాలర్లు పెంచే యోచనలో అమెరికా



**వాషింగ్టన్(జనంసాక్షి):**టెక్ కంపెనీల్లో విదేశీయులను తగ్గించి అమెరికన్లకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా అగ్రరాజ్యం మరో కీలక చర్యకు సిద్ధమైంది. ఇందులో భాగంగానే హెచ్-1బీ వీసాదారుల వేతనాలను పెంచేలా అమెరికా కార్మిక శాఖ కీలక ప్రతిపాదనలు చేసింది. ఇవి అమల్లోకి వస్తే విదేశీ ఉద్యోగుల వార్షిక వేతనం 14వేల డాలర్ల మేర పెరిగే అవకాశం ఉంది. అమెరికన్లతో పోలిస్తే విదేశీ ఉద్యోగులకు వేతనం విషయంలో భారీ వ్యత్యాసం ఉంటోందని, దీనివల్ల చౌకగా లభించే ఉద్యోగులకే కంపెనీలు మొగ్గుచూపుతున్నాయని మిగతా 2లో..

### పెళ్లైన వ్యక్తి మరో మహిళతో సహజీవనం నేరం కాదు

అలహాబాద్ హైకోర్టు సంచలన తీర్పు
- అది ఇద్దరి మధ్య పరస్పర సమ్మతితోనే జరుగుందని వెల్లడి
- భార్యాభర్తల మధ్య అసహజ లైంగిక చర్యలు నేరం కాదన్న మధ్యప్రదేశ్ హైకోర్టు

9లో..

### 'పారాక్వాట్'తో ప్రాణాలు పోతున్నాయ్

- వెంటనే గడ్డి మందును నిషేధించండి
- పొలాలు, నీరు కలుషితం అవుతున్నాయి
- లోక్‌సభలో ఎంపీ కావ్య డిమాండ్

2లో..

### 30 బీహార్ సీఎంగా నితీశ్ రాజీనామా

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
28.03.2026



# భద్రాచలంలో ఘనంగా రాములోరి పెళ్లి

ఆశీనులను చేసి ఎదురుగా అమ్మవారిని ఆసీనులను చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం తరుపున చైర్మన్ బీఆర్ నాయుడు, శృంగేరి శారదా పీఠం, చినజీయర్ స్వామి తరపున, భక్తరామదాసు వారసులు కంచర్ల శ్రీనివాసరావు, తూము నరసింహదాసు వంశీకులు స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించారు. దేవస్థానం స్థానాచార్యులు కేఈ స్థల సాయి రాముని కల్యాణ వైభవాన్ని, అలనాడు భక్త రామదాసు చేయించిన బంగారు ఆభరణాల విశిష్టతను వివరించారు. అర్చక స్వాములు మధుపర్కం ప్రాసాసన అనంతరం తేనె పెరుగు కలిపిన మిశ్రమాన్ని స్వామివారికి నివేదించి నూతన వస్త్రాలంకరణ చేశారు. విశ్వ సృష్టిని, దానిలో ఉన్న కాలాన్ని లోక పర్యంతాన్ని దేశాన్ని తెలుపుతూ సంకల్పం చెప్పి కన్యాదానం కరిష్యే అంటూ ముగించారు. ఈ సమయంలో కన్యావరణలు కొబ్బరిబొండం, తాంబూలం, దక్షిణ స్వామి వారికి సమర్పించి కన్యాదానంతో పాటు గోదానం, భూదాన కార్యక్రమాలను సంప్రదాయబద్ధంగా నిర్వ హించారు. రామ భద్రుడికి, సీతామాతకు వేర్వేరుగా మంగళాష్టకం చదివారు. సరిగ్గా అభిజిత్ లగ్నం మధ్యాహ్నం 12 గంటలకు జీలకర్ర, బెల్లం మిశ్రమాన్ని ఉత్సవమూర్తుల శిరస్సుపై ఉంచారు. ఈ సమయంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి ఎనముల రేవంత్ రెడ్డి దంపతులు స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. అనంతరం దశరధుడు, జనకమహారాజు తరపున, భక్తుల తరపున భక్తరామదాసు చేయించిన మూడు మంగ శసూత్రాలతో కూడిన సూత్రధారణను కన్నుల పండువగా నిర్వహించారు. అనంతరం ముత్యాలు, రతనాల తలంబ్రాల ప్రాశస్త్యం వివరిస్తూ తలంబ్రాల కార్యక్రమం అర్చకస్వాములు సంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. అనంతరం భాగవోత్తముల ఆశీర్వచనంతో కళ్యాణం ముగిసింది.

## దేశంలో సరిపడా ఎరువుల నిల్వలు

న్యూఢిల్లీ(జనంసాక్షి):పశ్చిమాసియా యుద్ధం కారణంగా ప్రపంచ మార్కెట్‌లో యూరియా కొరత ఏర్పడే అవకాశం ఉందని వ్యవసాయ ఆధారిత దేశాల్లో ఆందోళన నెలకొంది. దీనిపై కేంద్ర మంత్రి జేపీ నడ్డా లోక్‌సభలో స్పందించారు. ఎరువులపై యుద్ధ ప్రభావం పడకుండా రైతుల అవసరాలకు తగ్గట్టు సరఫరా చేస్తాం అని మంత్రి హామీ ఇచ్చారు."ముడిసరకుల దిగుమతి విషయంలో ఒక్క దేశం పైనే ఆధారపడకుండా పలు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నాం. ఈ విషయంలో ఇప్పటికే అనేక దేశాలతో భారత్ సుదీర్ఘకాలానికి ఒప్పందాలు చేసుకుంది. ఔషధాల తయారీ కోసం ఇతర దేశాల నుంచి ముడిసరకు దిగుమతిపై ఆధారపడటాన్ని తగ్గించుకునేందుకు చర్యలు తీసుకుంటున్నాం" అంటూ జేపీ నడ్డా లోక్‌సభలో వివరించారు.పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో ఇటీవల కేంద్ర మంత్రివర్గం సమావేశమైంది. ఇందులో నిత్యావసరాలు, ఎరువుల సరఫరా గురించి చర్చించినట్లు సమాచారం. ప్రస్తుతానికి ఖరీఫ్ సీజన్ వరకూ ఎరువులకు కొరత ఉండదు. కానీ ఉద్రిక్తతలు ఇలాగే కొనసాగితే.. ఎరువుల ఉత్పత్తి 0.6 నుంచి 0.9 మిలియన్ టన్నుల మేరకు తగ్గే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి.ప్రపంచవ్యాప్తంగా ఎరువుల వాడకంలో భారత్ రెండో అతిపెద్ద దేశం. ఫెర్టిలైజర్స్ ఉత్పత్తిలో మూడో స్థానంలో ఉంది. ఎల్ఎన్‌జీ ధరల పెరుగదల కారణంగా యూరియా ఉత్పత్తి వ్యయాలపై ప్రత్యక్ష ప్రభావం పడుతోంది. అదే సమయంలో, ఎరువులు, ముడి పదార్థాల రవాణా ఆలస్యం అవడం వల్ల కొన్ని ప్రాంతాల్లో రైతులు ఇబ్బందులు పడుతున్నట్లు వార్తలు వస్తున్నాయి.

ఇంధన ఆందోళనల వేళ.. 'లాక్‌డౌన్'పై క్లారిటీ ఇచ్చిన కేంద్రం

పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో దేశీయంగా ఇంధన కొరత ఆందోళనలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఇప్పటికే పలు ప్రాంతాల్లో పెట్రోల్, డీజిల్ కోసం వాహనదారులు బారులు తీరుతున్నారు. మరోవైపు 'లాక్‌డౌన్' భయాలు వెంటాడుతున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురీ దీనిపై స్పష్టతనిచ్చారు. 'లాక్‌డౌన్ వార్తలను కొట్టిపారేసిన కేంద్ర మంత్రి.. ఇంధన లభ్యతకు కేంద్రం చర్యలను వివరిస్తూ వరుస ట్వీట్లు చేశారు. "అంతర్జాతీయంగా అనిశ్చిత పరిస్థితులు నెలకొన్నాయి. ఎనర్జీ, సరఫరా గొలుసు, అత్యవసర సరకు రవాణా వంటి అంశాలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నాం. దేశంలో ఇంధన సరఫరాకు అంతరాయం కలగకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోంది. ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొనేందుకు కేంద్రం సిద్ధంగా ఉంది. అయితే 'లాక్‌డౌన్'పై వినిపిస్తోన్న ఊహాగానాలు పూర్తిగా అవాస్తవం. అలాంటి ప్రతిపాదనేదీ కేంద్ర ప్రభుత్వం వద్ద లేదు. ఇలాంటి వదంతులు సమాజానికి హాని చేస్తాయి. గందరగోళం సృష్టిస్తాయి. ఈ సమయంలో మనమంతా ప్రశాంతంగా, బాధ్యతాయుతంగా, ఐకమత్యంగా ఉండాలి" అని కేంద్రమంత్రి స్పష్టం చేశారు.

ఇంధన ఎగుమతులపై పన్ను..

"గత నెల రోజుల్లో అంతర్జాతీయంగా ముడి చమురు బ్యారెల్ ధర 70 డాలర్ల నుంచి 122 డాలర్ల వరకు వెళ్లొచ్చింది. దీంతో ప్రపంచవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయి. ఆగ్నేయాసియా దేశాల్లో 30-50శాతం, ఉత్తర అమెరికాలో 30శాతం, ఐరోపాలో 20శాతం, ఆఫ్రికా దేశాల్లో 50శాతం మేర ఇంధన ధరలు పెరిగాయి. కానీ, మన దేశంలో పౌరుల ప్రయోజనాలకు ప్రాధాన్యమిస్తూ వీటిని పెంచలేదు. అంతేగాక, చమురు కంపెనీల అధిక నష్టాలను తగ్గించేందుకు ప్రభుత్వ పన్ను ఆదాయాన్ని తగ్గించుకున్నాం (ఎక్సైజ్ సుంకం తగ్గింపును ఉద్దేశిస్తూ). అదే సమయంలో విదేశాలకు ఎగుమతి చేసే ఇంధనంపై ఎగుమతి పన్ను విధించాం" అని పురీ వెల్లడించారు.

డీజిల్‌పై రూ.21.5శాతం

విదేశాలకు ఎగుమతి చేసే డీజిల్‌పై లీటర్‌కు రూ.21.5 చొప్పున పన్ను విధించినట్లు కేంద్రం ప్రకటన విడుదల చేసింది. ఇక, ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయెల్ లీటర్‌కు రూ.29.5శాతం పన్ను విధిస్తున్నట్లు తెలిపింది. వాస్తవానికి 2024లో కేంద్రం ఇంధన ఎగుమతులపై పన్నులను తొలగించింది. అయితే, ప్రస్తుతం పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో వీటిని మళ్లీ ప్రవేశపెట్టింది.ఇదిలాఉండగా పెట్రోల్ పై అదనపు ఎక్సైజ్ సుంకాన్ని రూ.13 నుంచి రూ.3కు తగ్గిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఇక, డీజిల్‌పై రూ.10 ఉన్న సుంకాన్ని పూర్తిగా ఎత్తేసింది. దీంతో చమురు మార్కెటింగ్ కంపెనీలకు భారీ ఊరట లభించనుంది.

# యుద్ధం వేళ ఏం చేద్దాం?

చర్యలు ఉంటాయని కేంద్రం తెలిపింది. తమిళనాడు, బంగాల్, అసోం, కేరళ, పుదుచ్చేరిలో ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున ఆయా రాష్ట్రాల సీఎంలకు బదులు సీఎస్‌లు సమావేశంలో పాల్గొన్నారు.మరోవైపు పశ్చిమ ఆసియాలో నెలకొన్న ఉద్రిక్త తల వల్ల ఉత్పన్నమవుతున్న సమస్యలను పరిష్కరించేందుకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం అనధికారిక మంత్రుల బృందాన్ని ఏర్పాటు చేసింది. ఈ కీలక బృందంలో కేంద్ర మంత్రులు అమిత్ షా, నిర్మలా సీతారామన్, హర్దీప్ సింగ్ పురి సభ్యులుగా ఉన్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఇరాన్ యుద్ధం ఇప్పట్లో ముగిసే సూచనలు కనిపించడం లేదు. ఫలితంగా అంతర్జాతీయంగా చమురు, గ్యాస్ ధరలు పెరగడమే కాకుండా ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా పౌరుల జీవితాలపై పడుతున్న ప్రతికూల ప్రభావాలను పర్యవేక్షించేందుకు, తగిన చర్యలు తీసుకునేందుకు ఈ ప్రత్యేక మంత్రుల బృందం పనిచేయనుంది. పశ్చిమ ఆసియా సంక్షోభం వల్ల తలెత్తే పరిణామాలను ఎప్పటికప్పుడు సమీక్షించి, దేశీయంగా తలెత్తే ఇబ్బందులను ఎదుర్కోవడమే ఈ మంత్రుల బృందం ఏర్పాటు వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశమని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

## సజావుగా పెట్రో ఉత్పత్తుల సరఫరా

పరిస్థితుల నేపథ్యంలో అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం సాయంత్రం నిర్వహించిన వర్చువల్ వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పలు అంశాలను ప్రధానమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి సీఎస్ ఆధ్వర్యంలోని కమిటీ పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తోందని ప్రధానమంత్రి మోదీ దృష్టికి తీసుకెళ్లారు. 33 జిల్లాల్లోనూ గ్యాస్ సరఫరా, పెట్రోల్, డీజిల్ విక్రయాలు.. బ్లాక్ మార్కెట్ నిరోధానికి కమిటీలు ఏర్పాటు చేసి నోడల్ అధికారులను నియమించినట్లు సీఎం తెలిపారు. ప్రాధాన్య క్రమంలో ఆసుపత్రులు, పాఠశాలలు, అనాథాశ్రమాలు, వృద్ధాశ్రమాలకు కమర్షియల్ గ్యాస్ సిలిండర్లను పంపుతున్నట్లు సీఎం వెల్లడించారు. ప్రతి బంక్‌లో స్టాక్ ఎంత ఉంది.. ఎంత వినియోగిస్తున్నారనే దానిపై అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నారని సీఎం తెలిపారు. తెలంగాణలో సాధారణ రోజుల్లో రోజుకు 36,189 కిలో లీటర్ల పెట్రోల్, డీజిల్ వినియోగం జరుగుతుందని, ప్రస్తుతం 1,88,210 కిలోలీటర్ల నిల్వలు ఉన్నట్లు సీఎం వివరించారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ కొరతపై సోషల్ మీడియాలో అపోహలు, భయాందోళనలు కలిగేలా పోస్టులు పెడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు సీఎం తెలిపారు. తెలంగాణలో శిలాజ ఇంధనాలపై (బొగ్గు, చమురు, గ్యాస్) ఆధారపడడం తగ్గించి ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నామని.. పునరుత్పాక విద్యుత్ ఉత్పత్తి పెంచుతున్నామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా తెలంగాణలో ఈవీలపై వంద శాతం రోడ్డు పన్ను, రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయించామన్నారు. ఈవీల తయారీ, బ్యాటరీ ఎకోసిస్టమ్ ను పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి పీఎం మోదీ దృష్టికి తీసుకెళ్లారు. హైదరాబాద్ నగరంలో 1.20 లక్షకుపైగా ఉన్న పెట్రోల్, డీజిల్ ఆటోలను రెట్రోఫిట్టింగ్ ద్వారా ఈవీలుగా మార్చే ప్రక్రియ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఆర్టీసీలో ఇక ముందు అన్ని ఈవీ బస్సులనే వినియోగించనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి ప్రధానమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ వి.శేషాద్రి పాల్గొన్నారు.

## వాణిజ్య గ్యాస్ సరఫరా పెంచిన కేంద్రం

**కొరతను అధిగమించేందుకు కేంద్రం కీలక నిర్ణయం - 70 శాతానికి మార్పు**

న్యూఢిల్లీ(జనంసాక్షి):పశ్చిమాసియాలో యుద్ధ ప్రభావం దేశంలో కమర్షియల్ గ్యాస్ సిలిండర్ సరఫరాపై పడింది. తాజాగా వీటి కొరతను అధిగమించేందుకు కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ఇందులోభాగంగా కమర్షియల్ ఎల్పీజీ సరఫరాను 70 శాతానికి పెంచింది. ఈ మేరకు అన్ని రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులకు కేంద్ర పెట్రోలియం శాఖ కార్యదర్శి నీరజ్ మిట్టల్ లేఖ రాశారు.ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో కమర్షియల్ ఎల్పీజీ సరఫరా కోటాను కేంద్రం ఇటీవల తగ్గించిన సంగతి తెలిసిందే. తాజాగా పరిస్థితులు మెరుగుపడుతుండటంతో క్రమంగా వాటిని పెంచుతూ వస్తోంది. గతవారం 50 శాతంగా ఉన్న ఈ వాణిజ్య సిలిండర్ల సరఫరాను.. తాజాగా మరో 20 శాతం పెంచింది. అయితే, వీటిల్లో ఉక్కు, ఆటోమొబైల్స్, వస్త్రాలు, రంగులు, రసాయనాలు, ప్లాస్టిక్ వంటి కీలక పరిశ్రమలకు ప్రాధాన్యం ఇవ్వాలని కేంద్రం సూచించింది. ఇక, ఫ్రీ క్రైసిస్ కోటా కింద రాష్ట్రాలకు 40 శాతంగా ఉన్న కేటాయింపులను మరో 10 శాతం పెంచింది.

## చమురు సంస్థలను ఆదుకునేందుకు సుంకాల తగ్గించిన కేంద్రం

ప్రకటన చేశారు.యుద్ధం కారణంగా ఇంధన సరఫరాలో అంతరాయం, ముడి చమురు ధరలు పెరుగుదలతో ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు నష్టాలను ఎదుర్కొంటున్నాయని వివేక్ చతుర్వేది పేర్కొన్నారు. వీటిని పూడ్చడానికే పెట్రోల్, డీజిల్‌లపై ఎక్సైజ్ డ్యూటీల్లో కోత విధించామన్నారు. వీటివల్ల వినియోగదారులకు నేరుగా ప్రయోజనం చేకూరనప్పటికీ.. చమురు మార్కెటింగ్ కంపెనీలకు ఊరట లభించనుందన్నారు. ఈ చర్యల వల్ల వచ్చే పదిహేను రోజుల్లో రూ. ఏడు వేల కోట్ల ఆదాయాన్ని ప్రభుత్వం కోల్పోతుందన్నారు.మరోవైపు, ఎగుమతులను అరికట్టడానికి డీజిల్, ఏటీఎఫ్‌లపై అదనపు సుంకాలను విధించామని సీబీఐటీ ఛైర్మన్ పేర్కొన్నారు. వీటి వల్ల వచ్చే పదిహేను రోజుల్లో ప్రభుత్వానికి రూ.1500 కోట్ల ఆదాయం వస్తుందన్నారు. దేశీయంగా డీజిల్, ఏటీఫ్‌లు అందుబాటులో ఉంచడానికే ఈ చర్యలు తీసుకున్నామన్నారు.

**ఇంధన సరఫరాలో సమస్యల పరిష్కారానికి కమిటీ**

పశ్చిమాసియాలో యుద్ధంతో దేశంలో గ్యాస్, క్రూడ్ ఆయిల్ సరఫరాలో సమస్యలు తలెత్తుతున్న నేపథ్యంలో కేంద్ర కీలక నిర్ణయం తీసుకుంది. సమస్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు కేంద్ర మంత్రులతో ఒక కమిటీని ఏర్పాటు చేసింది. రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ ఈ కమిటీకి నేతృత్వం వహిస్తారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, పెట్రోలియం మంత్రి హర్దీప్ సింగ్ పురి ఇందులో సభ్యులుగా ఉంటారు. మరోవైపు సామాన్య, మధ్యతరగతి ప్రజలపై ఎలాంటి భారం పడకుండా పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాలను కేంద్రం తగ్గించింది. పెట్రోల్‌పై సుంకాన్ని లీటరుకు రూ.13 నుంచి రూ.3కు తగ్గించింది. లీటరుకు రూ.10గా ఉన్న డీజిల్ ఎక్సైజ్ సుంకాన్ని పూర్తిగా రద్దు చేసింది. హోర్ముజ్ జలసంధి మూసివేత భయాలు, మధ్యప్రాచ్య దేశాల మధ్య కొనసాగు తున్న యుద్ధంతో అంతర్జాతీయంగా చమురు సరఫరాకు అవాంతరాలు తలెత్తుతున్నాయి.

## తెలంగాణలో సమృద్ధిగా పెట్రో నిల్వలు

హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణ రాష్ట్రంలో ఇంధన సరఫరాకు సంబంధించి ప్రజల్లో నెలకొన్న సందేహాలను నివృత్తి చేస్తూ ప్రభుత్వం తాజా నివేదికను విడుదల చేసింది. మార్చి 27నాటి అధికారిక గణాంకాల ప్రకారం, రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ నిల్వలు డిమాండ్ కంటే అత్యధికంగా అందుబాటులో ఉన్నాయని స్పష్టమైంది. సాధారణంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రతిరోజూ అవసరమయ్యే ఇంధన పరిమాణం కంటే మార్చి 26వ తేదీన జరిగిన సరఫరా దాదాపు రెండింతలు ఎక్కువగా ఉండటం గమనార్హం. ఇది రవాణా రంగం, సామాన్య వినియోగదారులకు పెద్ద ఊరటనిచ్చే అంశం.రాష్ట్రంలో రోజువారీ సగటు సరఫరా 5,883 కిలో లీటర్లుగా ఉంటుంది. అయితే, మార్చి 26 నాటికి ఏకంగా 16,609 కిలో లీటర్ల పెట్రోల్‌ను సరఫరా చేశారు.




పెరిగిన దిగుమతి వ్యయాన్ని తట్టుకుని చమురు సంస్థల రికవరీకి తాజాగా కేంద్రం తీసుకున్న చర్య ఉపయోగపడుతుంది. మరోవైపు, దేశవ్యాప్తంగా రిటైల్ ఔట్‌లెట్స్ యథాప్రకారం పనిచేస్తున్నాయని, అన్ని పంపుల్లోనూ తగినన్ని పెట్రోల్, డీజిల్ స్టాక్‌లు ఉన్నాయని పెట్రోలియం, నేచురల్ గ్యాస్ మంత్రిత్వ శాఖ ఒక అధికారిక ప్రకటనలో పేర్కొంది. వదంతులు నమ్మవద్దని, ప్యానిక్ కొనుగోళ్లకు పాల్పడవద్దని వినియోగదారులను కోరింది. దేశంలో ఇంధన కొరతను అధిగమించేందుకు ప్రయత్నాలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వం.. ఆ దిశగా చర్యలు తీసుకుంటోంది. డీజిల్, ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయెల్ ల ఎగుమతిపై సుంకాన్ని విధించింది. అయితే, వీటి ధరలను ప్రతి 15 రోజులకు ఒకసారి సమీక్షిస్తామని తెలిపింది. ఈ మేరకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇండైరెక్ట్ టాక్సెస్ అండ్ కస్టమ్స్ ఛైర్మన్ వివేక్ చతుర్వేది ప్రకటన చేశారు. యుద్ధం కారణంగా ఇంధన సరఫరాలో అంతరాయం, ముడి చమురు ధరలు పెరుగుదలతో ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు నష్టాలను ఎదుర్కొంటున్నాయని వివేక్ చతుర్వేది పేర్కొన్నారు. వీటిని పూడ్చడానికే పెట్రోల్, డీజిల్‌లపై ఎక్సైజ్ డ్యూటీల్లో కోత విధించామన్నారు. వీటివల్ల వినియోగదారులకు నేరుగా ప్రయోజనం చేకూరనప్పటికీ.. చమురు మార్కెటింగ్ కంపెనీలకు ఊరట లభించనుందన్నారు. ఈ చర్యల వల్ల వచ్చే పదిహేను రోజుల్లో రూ. ఏడు వేల కోట్ల ఆదాయాన్ని ప్రభుత్వం కోల్పోతుందన్నారు. మరోవైపు, ఎగుమతులను అరికట్టడానికి డీజిల్, ఏటీఎఫ్‌లపై అదనపు సుంకాలను విధించామని సీబీఐటీ ఛైర్మన్ పేర్కొన్నారు. వీటి వల్ల వచ్చే పదిహేను రోజుల్లో ప్రభుత్వానికి రూ.1500 కోట్ల ఆదాయం వస్తుందన్నారు. దేశీయంగా డీజిల్, ఏటీఫ్‌లు అందుబాటులో ఉంచడానికే ఈ చర్యలు తీసుకున్నామన్నారు.

## దశాబ్దాల కఠోన శ్రమతోనే భారత్, చైనా అభివృద్ధి

ఇరుదేశాల మధ్య విభేదాలను పెంచి, వారు లాభం పొందాలని చూస్తున్నారన్నారు. అయితే, వారు ఎవరనే విషయాన్ని ఆయన ప్రస్తావించలేదు.

## పశ్చిమాసియా ఉద్రిక్తతలతో మనవాళికి పెనుముప్పు

పారిస్(జనంసాక్షి):

పశ్చిమాసియా సంక్షోభంపై కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. అక్కడ ఘర్షణల వల్ల గ్లోబల్ సౌత్‌లో తలెత్తుతున్న ఇంధనం, ఎరువులు, ఆహార భద్రత వంటి అనిశ్చితులపై ఆందోళన వ్యక్తం చేశారు. మరింత పటిష్టమైన వాణిజ్య మార్గాలు, సరఫరా గొలుసుల కోసం పిలుపునిచ్చారు. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో సంస్కరణలు, శాంతి పరిరక్షక కార్యకలాపాలను క్రమబద్ధీకరించడం, మానవతా సహాయ సరఫరా గొలుసులను బలోపేతం చేయడం వంటి వాటి ఆవశ్యకతను నొక్కి చెప్పారు. ఫ్రాన్స్‌లో జరిగిన జీ7 విదేశాంగ మంత్రుల సమావేశంలో జైశంకర్ ఈ మేరకు మాట్లాడారు.పశ్చిమాసియాలో సంఘర్షణల వల్ల తలెత్తుతున్న అనిశ్చితులు, మరింత పటిష్టమైన సరఫరా గొలుసుల ఆవశ్యకతను బలపరుస్తున్నాయని జైశంకర్ పేర్కొన్నారు. జీ7 విదేశాంగ మంత్రుల సమావేశం రెండో సెషన్‌లో ఆహ్వానిత భాగస్వాములతో భారత్ -పశ్చిమాసియా- ఐరోపా ఎకనామిక్ కారిడార్ గురించి అభిప్రాయాలను పంచుకున్నానని వెల్లడించారు. ఈ మేరకు సమావేశం అనంతరం ఎక్స్‌లో జైశంకర్ పోస్టు పెట్టారు."యూరోపియన్ యూనియన్, ఈఎఫ్‌టీఏ సభ్య దేశాలు, యూకేతో భారత్ కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు భారత్ -పశ్చిమాసియా- ఐరోపా ఎకనామిక్ కారిడార్ ప్రయోజనాన్ని పెంచాయి. ఈ ముఖ్యమైన కనెక్టివిటీ కార్యక్రమాన్ని సాకారం చేయడానికి లభిస్తున్న విస్తృత మద్దతు, ఉత్సాహాన్ని అభినందిస్తున్నాను. ప్రపంచ పాలనా సంస్కరణలపై జీ7 విదేశాంగ మంత్రుల సమావేశంలో మాట్లాడాను. యూఎన్ఎస్‌సీ సంస్కరణల ఆవశ్యకత, శాంతి పరిరక్షక కార్యకలాపాలను క్రమబద్ధీకరించడం, మానవతా సహాయ సరఫరా గొలుసులను బలోపేతం చేయడం వంటి అంశాలను ప్రస్తావించాను. ముఖ్యంగా గ్లోబల్ సౌత్‌లో ఇంధన సవాళ్లు, ఎరువుల సరఫరా, ఆహార భద్రతపై ఉన్న ఆందోళనలను ప్రస్తావించాను." అని జైశంకర్ పేర్కొన్నారు.

# ఇరాన్‌తో కాళ్ల బేరానికి ట్రంప్

అధ్యక్షుడు ట్రంప్ భారీగా సైన్యాన్ని పశ్చిమాసియాకు తరలిస్తున్నా రు. ఓ వైపు ఇరాన్‌తో చర్చలు జరుపుతూనే మరోవైపు అత్యాధునిక ఫైటర్ జెట్లను, విమాన వాహక నౌకలను పశ్చిమాసియాకు తరలిస్తున్నారు. తాజాగా మరో 10,000 మంది అమెరికా పదాతిదళ సైనికులను మోహరిం చడానికి అమెరికా రక్షణ శాఖ(పెంటగాన్) సమగ్ర వ్యూహాలను రూపొందించినట్లు వాల్‌స్ట్రీట్ జర్నల్ కథనం వెలువరించింది. ఆ కథనం ప్రకారం.. పదాతి దళాలతో పాటు పెద్ద మొత్తంలో సాయుధ వాహనాలను కూడా తరలిస్తున్నారు. ఇప్పటికే పశ్చిమాసియాలో మోహరించి ఉన్న 5,000 మంది మెరైన్ ఎక్స్‌పీడిషనరీ యూనిట్(ఎంఈయూ) సభ్యులు, వెయ్యి మంది పారాట్రూపర్లతో కలిసి ఈ సిబ్బంది రంగంలోకి దిగనున్నట్లు తెలుస్తోంది. గగనతలంలోనే ఫ్యూయల్ నింపుకొనే యుద్ధ విమానాలు, గైడెడ్ క్షిపణి డిస్ట్రాయర్‌లు పశ్చిమాసియా వైపునకు మళ్లాయి. ఈ దళాలను ఇరాన్‌తో పాటు పర్షియన్ గల్ఫ్‌లోని కీలకమైన ఖర్గ్ ద్వీపం సమీపంలో మోహరించేందుకు అమెరికా సిద్ధమవుతోంది.



ప్రధాని మోదీ, నేనూ చేతల మనుషులం: ట్రంప్

భారత ప్రధాని నరేంద్రమోదీపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రశంసలు కురిపించారు మోదీ, తానూ చేతల మనుషులమంటూ వ్యాఖ్యానించారు. అయితే ఈ మాట చాలామందికి వర్తించదన్నారు. భారత్‌తో బంధం రానున్న రోజుల్లో మరింత బలపడుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. ఈ ట్రంప్ మాటలను భారత్‌లోని యూఎస్ ఎంబసీ ఎక్స్ వేదికగా షేర్ చేసింది. పశ్చిమాసియా ఉద్రిక్తతలు ప్రపంచ దేశాలపై ప్రభావం చూపుతోన్న తరుణంలో అమెరికా నుంచి ఈ స్పందన వచ్చింది.ఇదిలాఉంటే.. రెండురోజుల క్రితం మోదీకి ట్రంప్ ఫోన్ చేసిన సంగతి తెలిసిందే. పశ్చిమాసియాలో కొనసాగుతున్న పరిస్థితులపై ఇరువురు నేతలు చర్చించారు. హర్మూజ్ జలసంధిని తెరిచిఉంచాల్సిన ఆవశ్యకత పైనా చర్చించినట్లు భారత్‌లో అమెరికా రాయబారి సెర్గియో గోర్ 'ఎక్స్' వేదికగా వెల్లడించిన సంగతి తెలిసిందే. ఆ సంభాషణ గురించి మోదీ కూడా స్పందించారు. వీలైనంత త్వరగా ఉద్రిక్తతలను తగ్గించి, శాంతిని పునరుద్ధరించేందుకు భారత్ మద్దతు ఉంటుందని స్పష్టం చేసినట్లు పేర్కొన్నారు.

**10 లక్షల మందిని సిద్ధం చేసిన ఇరాన్**

ఇరాన్‌లో భూతల దాడులకు అమెరికా సన్నద్ధమవుతుందంటూ వస్తున్న వార్తలు ఆందోళనలు రేకెత్తిస్తున్నాయి. ఈ దాడులను అడ్డుకొనేందుకు ఇరాన్ కూడా సన్నాహాలు మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. అందులోభాగంగా 10 లక్షల మందికి పైగా సైన్యాన్ని సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. సైనికాధికారులను ఉటంకిస్తూ ఆ దేశ మీడియా ఈ విషయాన్ని వెల్లడించింది.ఓ వైపు చర్చలు కొనసాగుతున్నాయంటూనే.. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పశ్చిమాసియాలో తన సైనిక ఉనికిని విస్తరిస్తున్నారు. ఈ క్రమంలోనే బసిజ్ ఫోర్స్, ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్‌తో సహ అనేక విభాగాలు తక్షణమే కదనరంగంలోకి వచ్చేవిధంగా దళాలను బలోపేతం చేస్తున్నట్లు ఇరాన్ సైనిక వర్గాలు పేర్కొన్నాయి. ఇరాన్ నేలపై అమెరికా సైన్యం అడుగుపెడితే.. వారికి నరకం చూపించేందుకు తమ యోధులు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించాయి. స్వచ్ఛందంగా సైన్యంలో చేరతామని బసిజ్ ఫోర్స్, ఐఆర్‌జీసీలకు యువకుల నుంచి పెద్దఎత్తున అభ్యర్థనలు వస్తున్నట్లు వెల్లడించాయి.

## హెచ్-1బీలో కొత్త నిబంధనలు

సుదీర్ఘంగా ఆందోళనలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే అగ్రరాజ్య అధికారులు తాజా ప్రతిపాదనలు తీసుకొచ్చారు.ప్రస్తుతం అమెరికాలో స్థానిక ఉద్యోగులతో పోలిస్తే హెచ్-1బీ వీసాదారులు సగటున 10,191 డాలర్లు తక్కువగా వార్షిక వేతనం అందుకుంటున్నారు. కంప్యూటర్ ఆధారిత వృత్తుల్లో ఈ వ్యత్యాసం మరింత ఎక్కువగా ఉంటోంది. వాస్తవానికి ప్రత్యేక నైపుణ్యాలు కలిగిన ప్రతిభావంతుల కోసం హెచ్-1బీ వీసా ప్రోగ్రామ్‌ను తీసుకొచ్చారు. కానీ, అందుకు భిన్నంగా కొన్ని కంపెనీలు ఈ వీసాను దుర్వినియోగం చేసి తక్కువ వేతనం తీసుకునే ఉద్యోగులను విదేశాల నుంచి నియమించుకుంటున్నాయనే ఆరోపణలున్నాయి. 2024 ఆర్థిక సంవత్సరంలో జారీ అయిన హెచ్-1బీల్లో 63శాతం ఎంట్రీ లెవల్ ఉద్యోగులే ఉన్నట్లు కార్మికశాఖ గణాంకాలు తెలిపాయి. ఈ నేపథ్యంలోనే వేతన పెంపు ప్రతిపాదనలు చేసినట్లు అమెరికా అధికారులు వెల్లడించారు.

## 'పారాక్వాట్'తో ప్రాణాలు పోతున్నాయ్

న్యూఢిల్లీ(జనంసాక్షి):

పారాక్వాట్ డైక్లోరైడ్ (గడ్డి మందు)పై పూర్తి నిషేధం విధించాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య లోక్‌సభలో డిమాండ్ చేశారు. శుక్రవారం పార్లమెంట్ జీరో అవర్‌లో ఆమె ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ.. ఈ రసాయనం వల్ల పర్యావరణం , మానవ ఆరోగ్యంపై పడుతున్న దుష్ప్రభావాలను వివరించారు. పారాక్వాట్ డైక్లోరైడ్ కేవలం కలుపు మొక్కలను నివారించే రసాయనం మాత్రమే కాదని, ఇది నేల, నీరు, గాలిని తీవ్రంగా కలుషితం చేస్తోందని ఎంపీ స్పష్టం చేశారు. వ్యవసాయ క్షేత్రాల్లో దీని మితిమీరిన వాడకం వల్ల భూసారం దెబ్బతినడమే కాకుండా.. భూగర్భ జలాలు కూడా విషతుల్యంభూగర్భ జలాలు కూడా విషతుల్యం అవుతున్నాయని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఇది పరోక్షంగా ఆహారపు గొలుసులోకి చేరి ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తోందని హెచ్చరించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ గడ్డి మందు ఆత్మహత్యలకు ప్రధాన సాధనంగా మారడం అత్యంత కీలకమైన అంశం అని అన్నారు. చిన్నపాటి మనస్పర్థలు లేదా క్షణి కావేశంలో ఈ రసాయనాన్ని సేవించిన వారు ప్రాణాలు కోల్పోతున్నారని ఆమె పేర్కొన్నారు.

## తెలంగాణ ఆడబిడ్డ పార్టీ సత్తా ఏంటో చూపిస్తా

మేడ్చల్‌లోని మునీరాబాద్ వద్ద అద్వయ ఫంక్షన్ హాలులో జెండా ఆవిష్కరణ చేస్తామని ప్రకటించారు. ఆ సమయంలోనే పార్టీ పేరును కూడా ప్రకటించనున్నట్లు తెలిపారు. కార్యకర్తలంతా సమయానికి చేరుకోవాలని, ప్రతి గ్రామం నుంచి తరలి రావాలని కవిత పిలుపునిచ్చారు. జయశంకర్ పేరు పెట్టుకుంటామని చెప్పారు. యువతకు, మహిళలకు ప్రాధాన్యం ఇస్తామని వెల్లడించారు. ఆడబిడ్డల్లో మార్పు తేవడానికి ఒక ఆడబిడ్డగా ఈ పార్టీని పెడుతున్నానని తెలిపారు. బీసీ బిల్లు సాధించడం తమ వల్లనే సాధ్యమవుతుందని అన్నారు. బీసీలు, దళితులు, గిరిజనులు, మైనారిటీలు తరలిరావాలని కవిత పిలుపునిచ్చారు. తెలంగాణ రాజకీయాలను శ్రీరాముడి స్ఫూర్తితో గమనించాలని కవిత అన్నారు. 'నేను నిజామాబాద్ బిడ్డను.. నిజామాబాద్ మట్టి మంచిది.. ఇక్కడ తీసుకునే ఏ నిర్ణయమైనా సక్సెస్ అయింది' అని తెలిపారు. నీళ్లు, నిధులు, నియామకాలు సంపూర్ణంగా సాధించలేకపోయామన్నారు. రోజూ ప్రజల అవస్థలు చూస్తున్నామని కవిత వ్యాఖ్యానించారు. కచ్చితంగా ఒక కొత్త రాజకీయ పార్టీ రావాల్సిన అవసరం ఉందన్నారు. అందరూ మెచ్చేలా ఆ పార్టీ ఉండాలని అభిప్రాయపడ్డారు.

## 30 బీహార్ సిఎంగా నితీశ్ రాజీనామా

పాట్నా:బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ మార్చి 30న సీఎం పదవికి రాజీనామా చేయనున్నారు. అలాగే ఎమ్మెల్సీ పదవులకు రాజీనామా చేసే అవకాశం ఉంది. ఈనెల 16న రాజ్యసభకు నితీశ్ ఎన్నికయ్యారు. రాజ్యాంగ ప్రకారం ఒక వ్యక్తి ఒకేసారి రెండు సభల్లో పదవులు నిర్వహించరాదు. ఒక పదవిని 14 రోజుల్లోపు వదులుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం బిహార్ శాసనసభ, శాసన మండలికి మార్చి 29 వరకూ విరామం ఇచ్చారు. తిరిగి ఉభయసభలు ఈనెల 30న సమావేశమవుతాయి. అదే రోజు నితీశ్ ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయనుండటం దాదాపు ఖారారైందని చెబుతున్నారు. మార్చి 16న బిహార్ నుంచి రాజ్యసభకు నితీశ్ ఎన్నికయ్యారు. మొత్తం 37 రాజ్యసభ స్థానాలకు ఖాళీ ఏర్పడగా, బిహార్, ఒడిశా, హర్యానాలోని 11 సీట్లకు మాత్రమే ఎన్నికలు జరిగాయి. తక్కిన స్థానాలకు ఎన్నికలకు ముందే పోటీలేకుండా అభ్యర్థులు ఏకగ్రీవం గా ఎన్నికయ్యారు. కాగా, జేడీయూ అధ్యక్ష పదవికి నితీశ్ కుమార్ ఈనెల 24న ఏకగ్రీవంగా ఎన్నికయ్యా రు. నితీశ్ మినహా ఎవరూ ఈ పదవికి నామినేషన్ వేయలేదు. అధ్యక్ష పదవికి లలన్ సింగ్ రాజీనామా చేయడంతో అప్పటి నుంచి ఆ పదవిని నితీశ్ నిర్వహిస్తున్నారు.

## ముదురుతున్న ఎండలు

మంచిర్యాల జిల్లాల్లో 41 నుంచి 44 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని, దీంతో ఆయా ప్రాంతాలకు అధికారులు ఆరెంజ్ అలర్ట్ హెచ్చరికలు జారీ చేశారు. మిగిలిన జిల్లాలకు ఎల్లో అలర్ట్ ప్రకటించారు. ఈ ప్రాంతాల్లో 36 నుంచి 40 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదు కావచ్చని వాతావరణ శాఖ వెల్లడించింది.శనివారం నుంచి ఉత్తర తెలంగాణతో పాటు దక్షిణ తెలంగాణలోనూ క్రమంగా ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదయ్యే అవకాశముందని అధికారులు తెలిపారు. ముఖ్యంగా ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో ఎండలు దంచికొట్టే వీలుందని హెచ్చరించారు. దీంతో వికారాబాద్, నారాయణపేట, మహబూబ్‌నగర్, జోగులాంబ గద్వాల, నాగర్‌కర్నూల్, వనపర్తి, సంగారెడ్డి జిల్లాల్లో కూడా 41 నుంచి 44 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు కావొచ్చని, ఈ ప్రాంతాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. మిగిలిన ప్రాంతాల్లో ఎల్లో అలర్ట్ ప్రకటించింది.ఈ నెల 28 నుంచి రాష్ట్రంలో క్రమంగా ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉందని దీంతో ఉక్కపోతతో అసౌకర్యమైన వాతావరణం ఏర్పడుతుందని ఐఎమ్‌డీ అధికారులు తెలియజేస్తున్నారు. గరిష్ఠ ఉష్ణోగ్రతలతో భూ ఉపరితలం వేడెక్కడంతో గాలి తేలికపడి సుడిగాలులు వీయడం, దట్టమైన మేఘాలు ఏర్పడి ఉరుములు, మెరుపులతో పాటు పిడుగులు పడే అవకాశముందని చెబుతున్నారు. పిడుగు అనేది మేఘాలు ఒకదానిని ఒకటి ఢీ కొన్నప్పుడు పుట్టే అధిక విద్యుత్?శక్తి అని, ఎత్తైన చెట్లు, విద్యుత్ స్తంభాలు పిడుగును ఆకర్షించే అవకాశముందని వివరించారు. అందుకే ఈ సమయంలో ప్రజలు ఎత్తైన ప్రదేశాల్లో, చెట్ల కింద, కరెంట్ పోల్స్ దగ్గర ఉంటే పిడుగుపాటుకు గురయ్యే అవకాశం ఉందని తెలియజేస్తున్నారు. ఈ

# గుడిని మరో భద్రాచలంగా చేస్తా


- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



నల్లగొండ ప్రతినిధి (జనంసాక్షి) : నల్గొండలోని రామగిరి శ్రీ సీతారామ చంద్రస్వామి దేవాలయాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసి వచ్చే సంవత్సరం శ్రీరామనవమి నాటికి మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. శ్రీరామనవమిని పురస్కరించుకొని శుక్రవారం నల్గొండ పట్టణంలోని రామగిరి దేవాలయంలో నిర్వహించిన శ్రీ సీతారాముల కళ్యాణోత్సవంలో మంత్రి పాల్గొని స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రామగిరి దేవాలయానికి ప్రతి సంవత్సరం వేలాది మంది భక్తులు తరలివస్తారని చెప్పారు. దేవాలయ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించామని, వైకుంఠ దర్శనం, ఉత్తర ద్వార దర్శనం వంటి సౌకర్యాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. దర్శన మార్గాల విస్తరణ కోసం అవసరమైన స్థల సేకరణకై ఇప్పటికే చర్చలు జరుపుతున్నామని, నెల రోజుల్లో రిజిస్ట్రేషన్ పూర్తి చేసి పనులు ప్రారంభిస్తామని చెప్పారు. రామగిరి రామాలయానికి గొప్ప చరిత్ర ఉందని గుర్తుచేస్తూ, భక్తులకు మరింత సౌకర్యాలు కల్పించేలా అభివృద్ధి చేస్తామని తెలిపారు. అలాగే, దేవాలయ భూములకు ఇబ్బంది కాకుండా నేషనల్ హైవే మార్గాన్ని బైపాస్ ద్వారా మళ్లించామని పేర్కొన్నారు. నల్గొండ పట్టణ ప్రజలు శ్రీరాముని కృపతో సుఖ : సంతోషాలతో ఉండాలని మంత్రి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి సహకారంతో రామగిరి రామాలయాన్ని మరింత అభివృద్ధి చేస్తానని ఉత్తర ద్వార దర్శనానికి కృషి చేస్తానని చెప్పారు. స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై .అశోక్ రెడ్డి, జిల్లా పరిషత్ సీఈవో ప్రేమ్ కరణ్ రెడ్డి ,మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి ,మాజీ జెడ్పిటిసి పాశం రామ్ రెడ్డి, కార్పొరేటర్లు, భక్తులు ,ప్రజలు పాల్గొన్నారు.

# నాలుగేండ్లుగా నలుగుతున్న మామిడి రైతులు

- 90 శాతం రాలిపోయిన పూత
- మామిడిని వదలని నల్ల తామర తెగులు
- మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి







చిన్నంబావి మార్చి 25 (జనంసాక్షి) : వేసవికాలం అంటేనే గుర్తుకు వచ్చేది మామిడి అలాంటి తీపి ఫలాలు పండించే మామిడి రైతులకు నాలుగేళ్లుగా చేదు ఫలాలు ఎదురవుతున్నాయి. ప్రతికూల వాతావరణం, పలు రకాల తెగుళ్ల కారణంగా దిగుబడి గణనీయంగా తగ్గుతోంది. కాయలతో నిండుగా కనిపించాల్సిన మామిడి చెట్లు వాడిపోయిన పూతలతో దర్శనమిస్తున్నాయి. ఎకరాలకు ఎకరాలలో పూత బాగా వచ్చింది. చివరి వరకు పూత నిలబడక 90 శాతం వరకు పూత నల్లగా మారి రాలిపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనలో మునిగిపోయారు. మిగిలిన పూత కూడా పిందెలు కాకపోవడంతో లక్షలు ఖర్చు చేసి ఏడాదంతా సాగుచేస్తే చివరకు చీడ, పీడలతో కూడిన చెట్లే మిగిలాయని ఆవేదన చెందుతున్నారు. దేశంలోనే కొల్లాపూర్/చిన్నంబావి మామిడికి ప్రతి ఏటా ఫుల్ డిమాండ్ ఉంటుంది. ఇక్కడ సారవంతమైన నేలలో పండే మామిడి అమృతం వంటి రుచి, శ్రేష్ఠమైన రంగు, వాసనతో ప్రత్యేక గుర్తింపు ఉంటుంది. సీజన్ లోనే అన్ని ప్రాంతాల్లో కంటే ముందే ఇక్కడ మామిడి దిగుబడి జరుగుతుంది. దీంతో మార్కెట్లకు మొదటగా చెరుకునేది సైతం ఈ ప్రాంతంలో పండిన మామిడే. రైతులు ఈ మామిడి పంటను నమ్ముకొని జీవనం సాగిస్తున్నారు. నూజీవీడు, బంగినపల్లి బేనిషాన్, రసాలు, తోతాబరి, మల్ గూబ, రాణిపసంద్ తదితర రకాల పండ్లు పండిస్తారు. ఇక్కడి నేల స్వభావం, నీటి లక్షణాల కారణంగా మామిడికి ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి. దేశీయంగా ఎంతో గుర్తింపు ఉన్న ఇక్కడి మామిడి అమెరికా, మలేషియా, అరబ్, యూరప్ దేశాలకు ఎగుమతి అవుతుంది.

## నాలుగేళ్లుగా వదలని నల్లతామర తెగులు

గడిచిన నాలుగేళ్లు గా కొల్లాపూర్ మామిడి రైతులను కష్టాలు వెంటాడుతున్నాయి. నల్లతామర, తేనేమంచు, బుడిద తెగుళ్ల మామిడి పూతను పట్టిపీడిస్తున్నాయి. దీనికి తోడు వాతావరణ పరిస్థితులు సైతం అనుకూలించడం లేదు. పూత, లేక దిగుబడులు సగానికి పైగా పడిపోయాయి. చూస్తే పచ్చగా, తెల్లని పూతతో కనిపిస్తున్న తోటలు. కాయలే లేక వెలవెలబోతున్నాయి. ఈ సమయానికి కాయలతో మార్కెట్ కు తరలాల్సిన ప్రాంతం నిర్మానుష్యంగా మారింది. ఎన్నిరకాల మందులు వాడినా తెగుళ్ల నియంత్రణలోకి రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక ఎకరం మామిడితోట ఉంటే లక్షాధికారిగా జీవించే రైతులు ఇప్పుడు ఎన్ని ఎకరాలు ఉన్నా ఆశించిన స్థాయిలో దిగుబడి రాక ఆర్థికంగా నష్టపోతున్నారు. ఒక్కో ఎకరాకు సుమారుగా రూ.లక్ష వరకు ఖర్చు చేసి ఏడాదంత కష్టపడితే వాతావరణం, తెగుళ్ల కారణంగా అప్పుల పాలయ్యే పరిస్థితులు వచ్చాయని వాపోతున్నారు. ఇక కాస్తో కూస్తో వచ్చిన మామిడి పిందెలను కాపాడుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. తెగుళ్ల నుంచి రక్షణగా ఉద్యానవన శాఖ అందజేస్తున్న కవర్లను మామిడి కాయలకు కడుతున్నారు. ఏడాది మొత్తం కష్టపడితే మూడు నెలల పాటు వచ్చే మామిడి దిగుబడి అమ్ముకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. కోల్డ్ స్టోరేజీ, గ్రేడింగ్, ప్యాకింగ్ వసతులు కల్పిస్తామన్న ప్రభుత్వాల హామీలు అమలు కావడం లేదు. దీంతో దళారులు, వ్యాపారుల మోసాలకు మామిడి రైతులు బలవుతున్నారు. చిన్నంబావి మండలంలో మామిడి చెట్లను ప్రధానంగా నల్లతామర తెగుళ్లు పీడిస్తోంది. కీలకమైన దశలో ఈ మహమ్మారి మామిడి పూతను ఎదగనివ్వకుండా చేస్తోందని ఉద్యానవన శాఖ అధికారులు చెబుతున్నారు. ఎన్ని రకాల కెమికల్స్ ఉపయోగించిన నల్లతామర తెగుళును నియంత్రించలేకపోతున్నామని రైతులు చెప్పారు. ఏది ఏమైనా ఈ ఏడాది సైతం మామిడి రైతులకు కలిసిరాలేదు.

### రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

ఎన్నో ఏళ్లుగా మామిడి తోటలను పెంచుతున్నాం కానీ గత నాలుగు సంవత్సరాల నుంచి మామిడి పండ్ల దిగుమతి చాలా తగ్గిపోయింది. పూత బాగా వచ్చిన మొత్తం రాలిపోయింది. ముఖ్యంగా తోటలకు నల్ల తామర తెగులు, మంచు తెగులు వల్ల పూత నల్లగా మారి మొత్తం రాలిపోతుంది, పిందేలు పట్టకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

**శివారెడ్డి, రైతు అమ్మాయిపల్లి**

# శ్రీరాముడు పాటించిన ధర్మం, అందించిన సుపరిపాలన అందరికీ ఆదర్శం





- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త

హైదరాబాద్ (జనంసాక్షి) : శ్రీరాముడు పాటించిన ధర్మం, అందించిన సుపరిపాలన అందరికీ ఆదర్శమని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు. శ్రీ రామ నవమి సందర్భంగా పలు దేవాలయాల్లో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. నాగోల్ డివిజన్ జై పూరి కాలనీ సాయి బాబా దేవాలయం, బండ్లగూడ రామాలయం, అనంతుల జంగారెడ్డి కాలనీలో, నాగోల్ డివిజన్ నర్సింహా స్వామి కాలనీలో, అనిల్ కుమార్, కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు అనంతుల జంగారెడ్డి కాలనీ గ్రేటర్ కమ్యూనిటీలో, నాగోల్ కో ఆపరేటివ్ బ్యాంక్ కాలనీలో శరత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన స్వామి వారి కళ్యాణంలో పాల్గొని వొడి బియ్యం పోశారు.

రామ్ నగర్ ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో రాంనగర్ గుండు వద్ద ఆంజనేయ స్వామి గుడి వద్ద అలాగే రాంనగర్ లో పలు ఆలయాల్లో మనికొండ ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు సీత రామ కళ్యాణంలో అలాగే గ్రేటర్ హైదరాబాద్ లో పలు ఆలయాల్లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధర్మాన్ని కాపాడేందుకు జీవితాన్నే త్యాగం చేసిన మహోన్నత ప్రజా పాలకుడు శ్రీరాముడని, లోకకల్యాణం కోసం ఎన్నో త్యాగాలకోర్చిన సీతారాముల పవిత్ర బంధం అజరామరమైనది, భవిష్యత్ తరాలకు ఆదర్శనీయమైనది అని ఆయన అన్నారు.

# శ్రీరామ నవమి వేడుకల్లో గవర్నర్



హైదరాబాద్ (జనంసాక్షి) : తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా వారి సతీమణి జానకి శుక్లాతో కలిసి, శ్రీ రామనవమి సందర్భంగా శుక్రవారం లోక్ భవన్ కమ్యూనిటీ హాల్ (సంస్కృతి) లో లోక్ భవన్ ఉద్యోగుల ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవంలో పాల్గొని భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అనం తరం అక్కడి అధికారులకు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. తరువాత, భాగ్యన గర్ శ్రీరామ నవమి ఉత్సవ సమితి ఆధ్వ ర్యంలో నిర్వహించిన శ్రీరామనవమి వేడు కల్లో పాల్గొని రథయాత్రను ప్రారంభించారు.




# 31న రామన్నపేటలో మహిళా రైతు రాష్ట్ర సదస్సు



హైదరాబాద్ (జనంసాక్షి) : మార్చి 31న యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేటలో జరుగు మహిళా రైతుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు పోతినేని సుదర్శన్ రావు, టి సాగర్, కేంద్ర కమిటీ సభ్యులు జూలకంటి రంగారెడ్డి పిలుపునిచ్చారు. హైదరాబాద్ లోని ఆర్ టి సి క్రాస్ రోడ్ లోని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యాలయంలో మహిళా రైతుల రాష్ట్ర సదస్సుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో మహిళా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమగ్రంగా చర్చించి భవిష్యత్ కార్యాచరణను రూపొందించేందుకు వివిధ జిల్లాల నుండి మహిళా రైతులు హాజరౌతున్నారు. వ్యవసాయంలో యాంత్రీకరణ పెరుగుతున్న కొద్ది పురుషుల సంఖ్య తగ్గి మహిళల సంఖ్య పెరుగుతున్నది. వ్యవసాయాన్ని మహిళలే కొనసాగిస్తున్న పరిస్థితి ఉన్నది. వ్యవసాయంలో మహిళల సంఖ్య పెరుగుతున్నప్పటికి వారికి తగిన ప్రాధాన్యత ఇవ్వడంలో ప్రభుత్వాలు తీవ్ర అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నాయి. వ్యవసాయాన్ని । విదేశీ, స్వదేశీ కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు పాలకులు ప్రయత్నిస్తున్నారు. అందులో భాగంగానే విత్తనబిల్లు, మార్కెట్ ముసాయిదా బిల్లు, విద్యుత్ సవరణ బిల్లులు తీసుకొచ్చారు. గతంలో రైతాంగానికి రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను నెరవేర్చకపోగా ఉన్న అవకాశాలను కూడా నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారు. మహిళలకు భూమిపై ఎలాంటి హక్కులు లేవు. జాయింట్ పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నప్పటికి ఎన్నికలకు ముందు పాలకులు వాగ్ధానాలు చేస్తున్నారే తప్ప ఆచరణలో అమలు కావడంలేదు. రాష్ట్ర ప్రభుత్వం భూభారతి సందర్భంగా నైనా ఈ అంశం ఉండే విధంగా చూసుకుంటే ఉపయోగకరంగా ఉండేది. మరో । వైపు పెట్టుబడి సహాయం అందకపోవడం వలన మహిళా రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కౌలు రైతులలో కూడా మహిళలు గణనీయంగా ఉన్నారు. వీరికి పెట్టుబడి కోసం జాయింట్ లయబుల్ గ్రూపులను ఏర్పాటు చేసి వీటి ద్వారా రుణాలు ఇవ్వాల్సిన అవసరం ఉంది. మరో వైపు వ్యవసాయ అనుబంధ రంగాలలో కూడా మహిళల సంఖ్య గణనీయంగా పెరుగుతున్నది. పాలు, పండ్లు, కూరగాయలు, చేపల పెంపకం, కోళ్ళపెంపకంలో వీరి పాత్ర కీలకంగా మారింది. వీటిలోకూడా మహిళలను ప్రోత్సాహిం చేందుకు ప్రత్యేకమైన ప్రణాళికలు రూపొం దించి అమలు చేయాల్సిన అవసరం ఉంది. యాంత్రీకరణ పెరుగుతున్నప్పటికీ మహిళలకు పని భారాన్ని తగ్గించే యంత్రాల రూపకల్పనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇవ్వాల్సిన అవసరం ఉంది. రైతుల ఆత్మహత్యలలో మహిళా రైతుల ఆత్మహత్యలు కూడా గణనీయంగా నమోదు అవుతున్నాయి. కుటుంబ యజమాని చనిపోయిన సందర్భం లో భారాన్నంతా మహిళలే మోస్తున్నారు. వీరి సమస్యల పరిష్కారానికి జరుగు సదస్సు జయప్రదం చేయాలని కోరారు. ఈ పోస్టర్ ఆవిష్కరణలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ అరిబండి ప్రసాద రావు, పెసరగాయల జంగారెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ పాల్గొన్నారు.



# శ్యాంగడ్ హత్య కేసు ఛేదన

ఇద్దరు అరెస్ట్

నిర్మల్ బ్యూరో, మార్చి27 (జనంసాక్షి) : నిర్మల్ పట్టణంలోని శ్యామ్ గడ్ సమీపంలో ఈనెల24 న జరిగిన హత్య కేసును నిర్మల్ టౌన్ పోలీసులు సీసీ కెమెరా దృశ్యాల ఆధారంగా త్వరితగతిన ఛేదించారు. ఈ కేసులో ఏ-1 తిరుమల, ఏ-2 గుపాల్వాడ్ శ్రీనివాస్‌లను అరెస్ట్ చేయగా, మిగతా నిందితులు వెంకటేష్, రాజు పరారీలో ఉన్నారు. అక్రమ సంబంధాల నేపథ్యంలో ఏర్పడిన వివాదం కారణంగా నిందితులు మృతుడు గజానంద్‌ను మద్యం తాగించి, కట్టెలతో దాడి చేసి హత్య చేసి శవాన్ని నీటి గుంతలో పడవేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ కేసు దర్యాప్తు జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ఆదేశాల మేరకు, ఏఎస్పీ సాయి కిరణ్ పర్యవేక్షణలో జరిగింది. హత్య వంటి నేరాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్ష ఉండదని, పరారీలో ఉన్న నిందితులను త్వరలోనే అరెస్ట్ చేస్తామని పోలీసులు తెలిపారు. కేసు ఛేదనలో కృషి చేసిన పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

# డ్రోన్ కెమెరాలతో ఎస్పీ నిఘా

- 300ల మంది పోలీసులతో భారీ బందోబస్తు.
- జిల్లా ఎస్పి అఖిల్ మహాజన్



ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి) : జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన శ్రీరామనవమి ర్యాలీ సందర్భంగా ర్యాలీని స్వయంగా జిల్లా ఎస్పీ డ్రోన్ కెమెరాలో ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షించారు. ఆదిలాబాద్ పట్టణంలో నిర్వహించిన ర్యాలీకి జిల్లా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. స్థానిక టీఎస్జీవో గార్డెన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ హాజరై సిబ్బందికి పలు సూచనలు చేయడం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పట్టణంలోని ప్రధాన కూడళ్ళు, ముఖ్య మార్గాల వెంట ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ర్యాలీ సజావుగా, శాంతియుతంగా కొనసాగేందుకు సుమారు 300 మంది పోలీసు సిబ్బంది బందోబస్తులో పాల్గొననున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలుగా డ్రోన్ కెమెరాలు, సీసీటీవీ కెమెరాల ద్వారా నిరంతరం నిఘా పెట్టడం జరుగు తుందన్నారు. పోలీసులు విధుల్లో అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని, ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ర్యాలీలో పాల్గొనే భక్తులు, నిర్వాహకులు పోలీ సులకు సహకరించాలని కోరారు. పోలీసు శాఖ తరఫున ప్రజల భద్రతకు అన్ని విధాల చర్యలు తీసుకు న్నామని, ప్రజలు నిబంధనలు పాటిస్తూ శాంతియుతంగా పండుగను జరుపుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి బి సురేందర్రావు, శిక్షణ ఎస్పి రాహుల్ కాంత్, డీఎస్పీ పోతారం శ్రీనివాస్, ఎల్ జీవన్ రెడ్డి, కమతం ఇంద్ర వర్ధన్, సిఐలు ఎస్ఐలు ఆర్ఐలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పెళ్లికి వెళ్లి తుంగభద్ర నదిలో నలుగురు జల సమాధి

అమరావతి (జనంసాక్షి) : ఏపీలోని కర్నూలు జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. తుంగభద్ర నదిలో స్నానానికి దిగి నలుగురు మృతి చెందారు. కోసిగి మండలం ఆర్టీఎస్ ఆనకట్ట వద్ద స్నానానికి దిగగా నీటి ప్రవాహానికి నలుగురు ఘల్లంతై మృతి చెందారు. మృతుల్లో ఇద్దరు మహిళలు, ఇద్దరు పురుషులున్నారు. కందుకూరులో బంధువుల పెళ్లికి వచ్చిన 15 మంది తుంగభద్ర నదిలో స్నానాలకు దిగారు. మృతి చెందిన వారు కర్ణాటకలోని మాన్వి పరిధి కురిడి గ్రామస్థులుగా గుర్తించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు.

# ఎల్‌బి స్టేడియంలో శాసనసభ్యుల క్రీడోత్సవాలు

- ఏర్పాట్లను పరిశీలించిన స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి



హైదరాబాద్, మార్చి 27 (జనంసాక్షి) : ఎల్బీ స్టేడియంలో ప్రారంభం కాబోతున్న శాసనసభ్యుల క్రీడోత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి అన్నారు. 28 నుంచి ఎల్ బి స్టేడియంలో ప్రారంభం కానున్న ఫస్ట్ ఎడిషన్ లెజిస్లేటివ్ స్పోర్ట్స్ మీట్ 2026 ఏర్పాట్లను ఆయన స్పోర్ట్స్ అథారిటీ ఎండి డాక్టర్ సోనీ బాలాదేవి తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో అన్ని వర్గాల్లో క్రీడల పట్ల అవగాహన తీసుకురావడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న శాసనసభ్యుల క్రీడోత్సవ పోటీలను ఘనంగా నిర్వహించబోతున్నామని, తద్వారా రాష్ట్రంలో క్రీడల పట్ల అవగాహన ఆసక్తి పెంచేందుకు ఈ కార్యక్రమాన్ని వినియోగించ బోతున్నామని తెలిపారు. దాదాపు 14 సంవత్సరాల తర్వాత తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొట్టమొదటిసారిగా నిర్వహించబోతున్న ఈ క్రీడా పోటీలలో పార్టీల భేద భావాలు లేకుండా, అన్ని పక్షాల శాసనసభ్యులు శాసనమండలి సభ్యులు భాగస్వామ్యం కావడం సంతోషకరమని అన్నారు. ఈ ప్రారంభోత్సవ వేడుకల్లో టగ్ ఆఫ్ వార్, ఫుట్బాల్, క్రికెట్ , అథ్లెటిక్స్, కబడ్డీ,వాలీబాల్ బాడ్మింటన్,టేబుల్ టెన్నిస్, తోపాటు కొన్ని రిక్రియేషనల్ క్రీడా పోటీలు నిర్వహించబోతున్నయని తెలిపారు. ఈ పోటీలు వీక్షించడానికి అందరికీ ఉచిత ప్రవేశం కల్పించబోతున్నామని, అందరికీ అవసరమైన సౌకర్యాలను సమకూర్చామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# భారత విదేశాంగ విధానంలో లెక్కకు మించిన తప్పిదాలు

అంతర్జాతీయ రాజకీయాల్లో మౌనం అనేది కేవలం నిశ్శబ్దం కాదు. అది కూడా ఒక బలమైన సంకేతం. ఇటీవల అమెరికా-ఇజ్రాయిల్ సంయుక్తంగా ఇరాన్ పై చేసిన దాడికి భారత ప్రభుత్వం చూపిన స్పందనలేమిటన్న ప్రశ్న, దేశ విదేశాంగ విధానం యొక్క దిశానిర్దేశంపై తీవ్రమైన చర్చకు దారితీసింది. ఈ ఘటన, ముఖ్యంగా ఇరాన్ సుప్రీం కమాండర్ అయతుల్లా అలీ ఖమేనీ హత్య వంటి సంఘటనపై భారత్ అధికారికంగా ఖండించకపోవడమే కాకుండా, సంతాపం కూడా తెలియపరచకపోవడం, విదేశాంగ విధానంలో ఒక క్రమబద్ధమైన బలహీనమైన, స్వతంత్రలేని, పరాధీన పరిణామాన్ని స్పష్టం చేస్తుంది.

ఈ స్పందనను కేవలం ఒక ఒంటరి సంఘటనగా చూడలేము. 2014 నుండి భారత విదేశాంగ విధానం స్వాతంత్ర్యానంతరం నుండి కొనసాగుతున్న స్వతంత్ర, అలీన స్వభావం నుండి స్పష్టమైన మార్పును సంతరించుకుంది. ఈ మార్పు వాస్తవాలను, డేటాను పరిశీలిస్తే అర్థమవుతుంది. భారత్, అమెరికాతో కుదుర్చుకున్న నాలుగు ప్రాథమిక రక్షణ ఒప్పందాలు (ఎల్ఈఎంఓఏ, సీఓఎంసీఏఎస్ఏ, జీఎస్ఓఎంఐఏ, బీఈసీఏ.) దేశాన్ని అమెరికా యొక్క ప్రధాన 'మేజర్ డిఫెన్స్ పార్ట్నర్'గా మార్చాయి. ఇంతకుముందు ఇటువంటి ఒప్పందాలకు భారత్ దూరంగా ఉండేది. స్టాక్హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ (ఎస్ఐపీఆర్ఐ) డేటా ప్రకారం, 2009-2013 మధ్య రష్యా నుండి భారత ఆయుధ దిగుమతులు 76 శాతం ఉంటే, 2014-2018 మధ్య అవి 58 శాతానికి తగ్గగా, అదే సమయంలో అమెరికా, ఇజ్రాయిల్ నుండి వచ్చే రక్షణ సహకారం మరియు సాంకేతిక బదలాయింపు నాటకీయంగా పెరిగాయి. ఇది కేవలం ఆయుధ కొనుగోలు మాత్రమే కాదు, వ్యూహాత్మక ఆధారపడేలా చేసే ఒక నిర్మాణాత్మక మార్పు.

"పెగాసస్ స్పైవేర్" కుంభకోణం నుండి ఇజ్రాయిల్‌తో భారత్ యొక్క సన్నిహిత సహకారం బహిర్గతమైంది. అంతర్గత భద్రత మరియు నిఘా వ్యవస్థల్లో ఇజ్రాయిల్ పాత్ర ఎంతగా పెరిగిందంటే, ఇది ఇకపై కేవలం ద్వైపాక్షిక సంబంధం కాకుండా, భారత అంతర్గత వ్యవహారాల్లో ఒక భాగస్వామిగా మారింది. అంతర్జాతీయంగా గాజాపై ఇజ్రాయిల్ దాడులు, వెస్ట్బ్యాంక్లో మానవ హక్కుల ఉల్లంఘనలు జరుగుతున్న సమయంలో ప్రధాని మోడీ ఫిబ్రవరి 2026లో ఇజ్రాయిల్ పార్లమెంటును ఉద్దేశించి చేసిన ప్రసంగం, అక్కడ పాలస్తీనా సమస్యను ప్రస్తావించకుండా (ఐ2యు2) కూటమిని బలోపేతం చేసుకోవడంపై దృష్టి పెట్టడం, భారత్ యొక్క ప్రాధాన్యతలను తేటతెల్లం చేస్తుంది.

అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ ఉన్న కాలంలో ఇరాన్ నుండి చమురు దిగుమతులను నిలిపివేయాలన్న ఆదేశాలను భారత్ అమలు చేసింది. భారత్ తన ఇంధన అవసరాల కోసం ఇరాన్ పై ఆధారపడేది కాబట్టి, ఈ నిర్ణయం భారత్ యొక్క ఆర్థిక మరియు వ్యూహాత్మక స్వయంప్రతిపత్తికి ఎంతటి త్యాగం చేస్తుందో అర్థం చేసుకోవాలి. ఇది కేవలం ఒక దేశం యొక్క విదేశాంగ విధానం కాదు, అది ఒక సామ్రాజ్యవాద శక్తి యొక్క ప్రాంతీయ ఆధిపత్య ప్రణాళికకు భారత్ తనను తాను అనుసంధానించుకోవడమేనని విమర్శకులు అంటున్నారు.

చారిత్రకంగా భారత్ యొక్క అతిపెద్ద బలం దాని స్వతంత్ర విదేశాంగ విధానమే. 2003లో ఇరాక్పై అమెరికా దాడి జరిగినప్పుడు, అప్పటి వాజ్పేయి ప్రభుత్వం ఉన్నప్పటికీ, లోక్సభ ఏకగ్రీవ తీర్మానం ద్వారా ఆ దాడిని ఖండించింది. అదే భారత్ నేడు ఇరాన్పై దాడి జరిగినప్పుడు, ముఖ్యంగా ఒక దేశ నాయకుడిని లక్ష్యంగా చేసుకుని చేసిన దాడిని ఖండించలేకపోయింది. ఈ వైరుధ్యం విదేశాంగ విధానంలో వచ్చిన గుణాత్మక మార్పును సూచిస్తుంది.

విశాఖపట్నంలో జరిగిన నౌకా విన్యాసాల నుండి తిరిగి వెళ్తున్న ఇరాన్ నౌక 'ఐరిస్ దేనా'ను శ్రీలంక సమీపంలో అమెరికా జలాంతర్గామి ధ్వంసం చేసిన ఘటన, భారత్ ను ఒక సున్నితమైన స్థితిలో నిలిపింది. భారత్ కు అతిథులుగా వచ్చిన 150 మంది ఇరాన్ నావికుల మృతిపై కూడా భారత్ అధికారికంగా స్పందించకపోవడం, విదేశాంగ విధానం యొక్క ప్రాథమిక విలువలైన మానవతా విలువలు కూడా ఎలా రాజీపడ్డాయో చూపిస్తుంది.



ఈ విధానం వల్ల భారత్ అంతర్జాతీయ వేదికపై ఒక సంక్లిష్టమైన స్థితిని ఎదుర్కొంటుంది. (బ్రిక్స్) వేదికపై బ్రెజిల్ మరియు దక్షిణాఫ్రికా వంటి దేశాలు అమెరికా-ఇజ్రాయిల్ చర్యలను బహిరంగంగా విమర్శించినప్పటికీ, భారత్ మాత్రం మౌనంగా ఉండిపోయింది. వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురోను అమెరికన్ సైన్యం అపహరించిన సందర్భంలోనూ భారత్ స్పందించకపోవడం, దక్షిణ అర్ధగోళ దేశాల నాయకత్వానికి భారత్ ఎంత దూరంగా వెళ్తోందో సూచిస్తుంది. ఇది భారత్ యొక్క వ్యూహాత్మక సార్వభౌమత్వంపైనే ప్రశ్నలు లేవనెత్తుతోంది. అమెరికాతో కుదుర్చుకున్న అసమ వాణిజ్య ఒప్పందాలు, ప్రైవేటీకరణ మరియు అంతర్జాతీయ పెట్టుబడిదారులకు అనుకూలంగా ఉండే విధానాలు, భారత రైతాంగం, చిన్న తరహా పరిశ్రమలు మరియు కార్మికులపై తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయి. ఇది ఇంధన ధరల పెరుగుదల, వంటగ్యాస్ మరియు ఎరువుల కొరత వంటి రూపాల్లో ప్రజలను నేరుగా ప్రభావితం చేస్తోంది.

చివరిగా, ఇరాన్ పై జరిగిన దాడికి భారత్ చూపిన మౌనం, ఒక ఆకస్మిక నిర్ణయం కాకుండా, సుదీర్ఘకాలంగా అనుసరిస్తున్న ఒక విధానపరమైన నిర్ణయానికి సంకేతం. ఇది 'ఆత్మనిర్భర్ భారత్' అనే నినాదానికి, అమెరికాకు అనుకూలంగా ఉండే విదేశాంగ విధానానికి మధ్య ఉన్న వైరుధ్యాన్ని బయటపెడుతుంది. నిజమైన 'ఆత్మనిర్భరత' అంటే ఆర్థికంగా మాత్రమే కాదు, వ్యూహాత్మక నిర్ణయాల్లో స్వతంత్రంగా నిలబడే శక్తి కూడా. ప్రస్తుత పరిస్థితిలో భారత్, అమెరికా యొక్క ప్రపంచ వ్యూహంలో ఒక భాగస్వామిగా మారడం, దాని స్వంత ప్రాంతీయ మరియు ప్రపంచ ప్రయోజనాలకు, చారిత్రక భాగస్వాములతో ఉన్న సంబంధాలకు భంగం కలిగించే ప్రమాదం ఉంది. ఈ విదేశాంగ విధానం దేశంలోని కార్పొరేట్ మరియు హిందూత్వ శక్తుల సమ్మేళనం యొక్క వర్గ ప్రయోజనాలను సమర్థించేలా ఉందనే విమర్శ బలపడుతోంది. అంతర్జాతీయంగా సార్వభౌమత్వం, మానవ హక్కులు, దేశాల స్వేచ్ఛా నిర్ణయాలకు మద్దతుగా నిలిచిన భారత్ యొక్క చారిత్రక ఖ్యాతిని కాపాడుకోవాలంటే, ఈ మౌనాన్ని విచ్ఛిన్నం చేసి, స్వతంత్ర, సమతుల్య విదేశాంగ విధానం వైపు ఒక స్పష్టమైన మార్పు అవసరం. ఈ మార్పు కోసం ప్రజల్లో అవగాహన పెంచడం, సామ్రాజ్యవాద వ్యతిరేక చైతన్యాన్ని పెంపొందించడం నేటి అవసరం.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

# ప్రజాస్వామ్యంలో ధర్మపాలనకు రామరాజ్యం సాధ్యమేనా?

రాచరికమైనా, ప్రజాస్వామ్యమైనా - పాలకులు కొన్ని ప్రత్యేక లక్షణాలు కలిగి ఉండాలి. ధర్మపరిపాలన చేయాలి. ప్రజోపయోగ పనులు చేపట్టాలి. అప్పుడే ప్రజలు సుఖసంతోషాలతో ఉంటారు. దేశమైనా, రాష్ట్రమైనా సుభిక్షంగా ఉంటాయి. ఈ ప్రాథమిక సూత్రాలనే శ్రీ రాముడు తన సోదరుడు భరతునికి బోధించిన రాజనీతిలో స్పష్టంగా వివరించాడు. ఆ ఉపదేశాలు కేవలం ఆ కాలానికి పరిమితం కాలేదు. 2026 నాటికీ ప్రజాస్వామ్య పాలనకు మార్గదర్శకాలుగా నిలుస్తున్నాయి. ఇదే నేపథ్యంలో "ప్రస్తుత ప్రజాస్వామ్య వ్యవస్థలో రామరాజ్యం సాధ్యమేనా?" అనే ప్రశ్న ప్రాధాన్యం సంతరించుకుంది.

రామరాజ్యం - ఒక ధర్మపరిపాలనా నమూనా

రామాయణంలో వర్ణించిన రామరాజ్యం ఒక సమగ్ర పరిపాలనా నమూనా. ఇందులో పాలకుడు కేవలం అధికారాన్ని వినియోగించే వ్యక్తి కాదు; బాధ్యతను నెరవేర్చే ధర్మనిరతుడు. శ్రీరాముడు భరతునికి ఇచ్చిన బోధనలను విశ్లేషిస్తే - సమర్థులైన మంత్రులను నియమించడం, కీలక నిర్ణయాలను గోప్యంగా నిర్వహించడం, నిపుణుల సలహాను ప్రాముఖ్యంగా తీసుకోవడం, ప్రజలపై అధిక పన్నుల భారాన్ని మోపకూడదని హెచ్చరించడం వంటి అంశాలు కనిపిస్తాయి. ఇవి పరిశీలిస్తే, రామరాజ్యం ఒక విలువల ఆధారిత పరిపాలన అని స్పష్టమవుతుంది.

ప్రస్తుత ప్రజాస్వామ్య వ్యవస్థలో కూడా ఈ విలువలు ప్రాముఖ్యతను కోల్పోలేదు. భారతదేశం వంటి దేశంలో 1950లో రాజ్యాంగం అమల్లోకి వచ్చినప్పటి నుండి ప్రజాస్వామ్య వ్యవస్థ బలపడింది. 2024 సాధారణ ఎన్నికల్లో సుమారు 67 శాతం ఓటింగ్ నమోదైంది. ఇది ప్రజల భాగస్వామ్యాన్ని సూచించే ముఖ్యమైన సూచిక. అయితే ఈ వ్యవస్థలో ఉన్న లోపాలు కూడా గమనించాల్సిన అవసరం ఉంది. వివిధ అధ్యయనాల ప్రకారం ప్రభుత్వ వ్యవస్థల్లో అవినీతి ప్రభావం 20 శాతం నుండి 40 శాతం మధ్య ఉన్నట్లు అంచనాలు వెల్లడిస్తున్నాయి. ఇది ప్రజాస్వామ్య నాణ్యతపై ప్రశ్నలు లేవనెత్తుతుంది.

**రామరాజ్యం X ప్రజాస్వామ్యం**

రామరాజ్యంలో ధర్మం ప్రధాన సూత్రం కాగా, ప్రజాస్వామ్యంలో రాజ్యాంగం అదే పాత్రను పోషిస్తుంది. ధర్మం అంటే న్యాయం, సమానత్వం, బాధ్యత అనే విస్తృత భావన. అదే విధంగా రాజ్యాంగం కూడా ఈ విలువలను పరిరక్షించడానికి రూపొందించబడింది. కాబట్టి ఈ రెండు వ్యవస్థలు పరస్పర విరుద్ధాలు కావు; పరస్పర అనుసంధానాలు కలిగినవే.

అయితే ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజాస్వామ్య పాలనలో అనేక సవాళ్లు కనిపిస్తున్నాయి. ఎన్నికల సమయంలో ఇచ్చే హామీల్లో సుమారు 30 శాతం మాత్రమే పూర్తిగా అమలవుతున్నాయని వివిధ విశ్లేషణలు సూచిస్తున్నాయి. ప్రభుత్వ ఖర్చుల్లో సంక్షేమ పథకాల వాటా సగటున 25 శాతం నుండి 35 శాతం మధ్య ఉంటుంది. ఇది ప్రజల సంక్షేమంపై దృష్టి ఉన్నప్పటికీ, అమలు సామర్థ్యంలో లోపాలు ఉన్నాయని తెలియజేస్తుంది. మరోవైపు, ప్రభుత్వ రంగంలో జీతభత్యాల ఆలస్యం, పరిపాలనా నిర్లక్ష్యం వంటి సమస్యలు కూడా కొన్నిచోట్ల కనిపిస్తున్నాయి.

రామరాజ్యం సాధ్యమేనా?రామరాజ్యం సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తే, అది అసాధ్యం కాదు.

**నైతిక నాయకత్వం:** పాలకులు వ్యక్తిగత ప్రయోజనాల కంటే ప్రజల సంక్షేమాన్ని ముందుకు పెట్టాలి.

**పారదర్శక పరిపాలన:** నిర్ణయాల ప్రక్రియలో స్పష్టత ఉండాలి.

**ప్రజల చైతన్యం:** ప్రజలు తమ హక్కులను మాత్రమే కాకుండా బాధ్యతలను కూడా గుర్తించాలి.

న్యాయ వ్యవస్థ బలోపేతం: నేరస్తులకు శిక్ష తప్పక అమలవ్వాలి.రామరాజ్యం ఒక వ్యక్తి ఆధారిత వ్యవస్థ. కానీ ప్రజాస్వామ్యం ఒక సమూహ వ్యవస్థ. కాబట్టి ప్రజాస్వామ్యంలో రామరాజ్యం సాధనకు పాలకులు మాత్రమే కాదు; ప్రజలు, అధికారులు, సంస్థలు అన్నీ సమానంగా బాధ్యత వహించాలి. ప్రజలు అవినీతిని సహించకుండా, మంచి నాయకత్వాన్ని ఎన్నుకుంటే వ్యవస్థలో మార్పు తప్పనిసరిగా



వస్తుంది.

**వ్యక్తిగత మార్పు.. అత్యంత కీలకం**

రామరాజ్యం ఒక నైతిక స్థితి. అది చట్టాల ద్వారా మాత్రమే సాధ్యం కాదు; విలువల ద్వారా సాధ్యం. ఒక సమాజంలో 70 శాతం నుండి 80 శాతం ప్రజలు నైతిక విలువలను పాటిస్తే, ఆ సమాజం సహజంగానే ధర్మపరమైన మార్గంలో నడుస్తుంది. అదే రామరాజ్యం యొక్క మూల భావన.

**మూడు దశల క్షీణత**

**తెలుగు క్షీణతను మూడు దశలుగా చూడవచ్చు:**

1991-2005: ఆంగ్లం ఉద్యోగ భాషగా ఎదిగి, తెలుగు మీడియం విద్య "వెనుకబడిన ఎంపిక"గా చిత్రీకరించబడింది. **2005-2020:** కార్పొరేట్ పాఠశాలలు, ఐటి సంస్కృతి, గ్లోబల్ వలసల ఆశ, ప్రైవేట్ విద్యా మార్కెట్ కలిసి ఆంగ్ల మాధ్యమాన్ని మధ్యతరగతి కుటుంబాల ప్రధాన అభిలాషగా మార్చాయి. **2020 తర్వాత:** ప్రభుత్వ పాఠశాలలకు కూడా ఆంగ్ల మాధ్యమ ఒత్తిడి చేరింది. ద్విభాషా పాఠ్యపుస్తకాలు, ఆంగ్ల శిక్షణ, పరిపాలనా స్థాయిలో ఆంగ్ల ఆధిపత్యం మరింత సాధారణమయ్యాయి. ఈ మూడు దశలు కలిపి చూస్తే 2030 నాటికి తెలుగు లో చదవడం-రాయడం వచ్చినా తెలుగులో ఆలోచించే విద్యార్థుల శాతం గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. 2040 నాటికి పట్టణ మధ్యతరగతి కుటుంబాల్లో తెలుగు పూర్తి ప్రాథమిక గృహభాష స్థానాన్ని కోల్పోయే ప్రమాదం ఉంటుంది. 2050 నాటికి ప్రభుత్వ పరిరక్షణ బలహీనంగా ఉంటే తెలుగు "సంఖ్యలో బలమైనా వ్యవస్థలో బలహీనమైన భాష"గా మారవచ్చు.

**ప్రభుత్వ కార్యాలయాల భాష**

ఒక భాషను నిజంగా గౌరవించేది పండుగలలో సత్కారం కాదు; రోజువారీ అధికార వినియోగం. రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల్లో దరఖాస్తులు, ఉత్తర్వులు, సేవల మార్గదర్శకాలు, పౌర ఫారాలు, భూసంబంధ పత్రాలు, పురపాలక సేవలు, ఆరోగ్య సూచనలు, వ్యవసాయ విభాగ సమాచార పత్రాలు అన్నీ తెలుగులో అందుబాటులో ఉంటే భాషకు పరిపాలనా జీవం వస్తుంది. లేకపోతే తెలుగు ఇంటి మాటగా మిగిలి, అధికార భాషగా ఆంగ్లం స్థిరపడుతుంది. దీని అంత ర్భావం స్పష్టం: ఆంగ్లాన్ని నేర్పాలి, కానీ మాతృభాషను బలహీనపరచకుండా నేర్పాలి. రామరాజ్యం ఒక దూర స్వప్నం కాదు; సాధ్యమైన లక్ష్యం. ప్రజాస్వామ్యం దానికి అడ్డంకి కాదు; ఒక సాధన. ధర్మం ఆధారంగా పనిచేసే ప్రజాస్వామ్యం - అదే ఆధునిక రామరాజ్యం. ఇది ఒక్కరోజులో సాధ్యం కాదు; కానీ నిరంతర సంస్కరణల ద్వారా, ప్రజల చైతన్యంతో, నైతిక నాయకత్వంతో సాధ్యమవుతుంది. రామరాజ్యం బయట నుంచి రాదు; అది మనలోనే పుడుతుంది. మన ఆలోచనల్లో ధర్మం ఉంటే, మన నిర్ణయాల్లో న్యాయం ఉంటే, మన చర్యల్లో బాధ్యత ఉంటే - ఆ సమాజమే రామరాజ్యం. ప్రజాస్వా మ్యం ఆ లక్ష్యాన్ని చేరుకునే మార్గం మాత్రమే. ఆ మార్గంలో నడవాలా లేదా అన్నది మనందరి చేతుల్లోనే ఉంది.



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

## అడగకే అడగకు..



తర తరాల
అణచివేతల్లో
మగ్గిన దీనుల
పక్షాన నిలిచి..
ఆ జనాదేశమై..
జాగృతమైన
నా చేతుల్లో
నీ అంతం
తప్పదని..
ఏ పీడనకు
సవాల్ విసిరానో..
దేని వళ్ళంతా
ప్రకంపనలు
పుట్టించానో..
అదివ్వాళ
బందూకెత్తిన
నా భుజమ్మీద..
నెత్తుటి నాల్కల
తడి ఆరని
మరకలు మాయని
సాయుధ చెయ్యేసి
ఎదకు హత్తుకుని..
ముల్లెగట్టిన
నజరానా గంటు
పబ్బతి గట్టిన
చేతుల బట్టించి..
క్షమాభిక్ష
పెడుతున్నానంటుంటే..
కలిసి నడుద్దాం
రారమ్మంటుంటే..
నేను వీరుడిగా
నేల తల్లి బిడ్డగా
నిజంగా ఔను.. నిజంగా
మిగిలున్నట్లా..!!
కుళ్ళి కంపుగొట్టే
శవాన్నైనట్లా..??
అడగకే అడగకు
అడుగు సాగిన దారీ
దూప దీర్చిన చెలిమా
కన్నులెర్రగ జేసి సూటిగ...

డా. ఇక్బాల్ పాషా
9440775732

## సుందర విశ్వం

ఇంధన రణం
విశ్వం హాహాకారాలు
ప్రగతి శూన్యం
పెద్దన్న రణం
చిన్నన్న పద్మవ్యూహం
ఓటమి ఖాయం
పన్నుల మోత
కలసిరాని నేస్తాలు
ఒంటరి ట్రంపు
ఇరాన్ కు బలి
మేకలుతిన్నపులి
చీమలకాలం
పెద్దన్న పేను
విశ్వం నెత్తిన పుండు
చావు తప్పదు
పెద్దల మాట
నీల్గుట ఈల్గుటకే
నిత్యసత్యాలు
రక్తపాతాలు
ఆర్థిక పతనాలు
యుద్ధమూలాలు
జనం క్షేమాలు
నాయక లక్షణాలు
ఉత్తమ నేత
శాంతి మార్గాలు
ప్రపంచ
సౌభాగ్యాలు
సుందర విశ్వం

రేడియమ్
9291527757




# మామిడాల శైలజ"అంతరంగ కవిత్వం

ప్రాచీన కాలం నుండి ఆధునిక సాంకేతిక యుగం వరకు సమాజం ఎంత పరిణామం చెందినప్పటికీ, స్త్రీ జీవితం మాత్రం ఇంకా అనేక సంకెళ్ల మధ్యే కొట్టుమిట్టాడుతోంది. శైలజ గారి కవిత్వం కేవలం భావోద్వేగాల వ్యక్తీకరణ మాత్రమే కాదు, అది ఒక సామాజిక దర్పణం. పుట్టినప్పటి నుండి మరణం వరకు స్త్రీ పోషించే వివిధ పాత్రల వెనుక ఉన్న నిశ్శబ్ద రోదనను, అణిచివేతను ఆమె అక్షరబద్ధం చేశారు.అడుగడుగునా జీవన్మరణ పోరాటమే / అనుక్షణం అవమానాల పరంపరే / బతుకమ్మ జాలి దయ లేని / సజీవ కళేబరాలతో సహజీవనమే. కవయిత్రి తన కవితలో స్త్రీ జీవితాన్ని "జీవన్మరణ పోరాటం"గా అభివర్ణించారు. స్త్రీకి బయటి ప్రపంచంలోనే కాదు, కుటుంబం అనే వ్యవస్థలో కూడా అవమానాలు ఎదురవుతూనే ఉన్నాయి. చైతన్యం ఉన్న మనిషిని "సజీవ కళేబరం"గా మార్చేసే సామాజిక పరిస్థితులపై ఆమె ఎక్కుపెట్టిన విమర్శ ఇది. సమాజం ఆమెను ఒక వ్యక్తిగా కంటే, ఒక వస్తువుగా లేదా బాధ్యతల మోతగా మాత్రమే చూస్తోందనే ఆవేదన ఇక్కడ స్పష్టంగా కనిపిస్తుంది.ప్రకృతికి నేనంటే పరిహాసమే/ పురుష సంతానం పట్ల పక్షపాకమే/ నా సర్వస్వాన్ని అర్పించి/ నన్ను తనకు సమర్పించు కోమంటుంది. ఈ పంక్తులు పితృస్వామ్య వ్యవస్థలోని లోతైన వివక్షను వేలెత్తి చూపుతున్నాయి. జీవ గమనానికి స్త్రీ మూలమైనప్పటికీ, సమాజం పురుష సంతానానికి ఇచ్చే ప్రాధాన్యతను, స్త్రీ పట్ల చూపే చిన్నచూపును కవయిత్రి నిలదీశారు. తన సర్వస్వాన్ని ధారపోసినా, తిరిగి ఆమెకు దక్కేది పరిహాసమే కావడం గమనార్హం.నేను పెట్టిన బిక్షే/ పాలు తాగి రొమ్ము గుద్దే/ పైశాచిక ప్రవృత్తి ఎందుకు నీకు?/ వడ్ల గింజతో ఊపిరి తీస్తావు / జిల్లేడు పాలతో జీవన్ముక్తి కలిగిస్తావు / ఆధునిక యంత్ర పరికరాలతో/ వెతికి మరియు ఉరితీస్తావు.పాత రోజుల్లో "వడ్ల గింజ" లేదా "జిల్లేడు పాలతో" ఆడపిల్లల ప్రాణాలు తీసే అనాగరిక పద్ధతులు ఉండేవని, కానీ నేడు ఆధునిక యంత్రాలతో (Scanning/Feticide) గర్భంలోనే ఆమెను ఉరితీస్తున్నారని చెప్పడం కవయిత్రి సామాజిక స్పృహకు నిదర్శనం.స్త్రీ పెట్టిన భిక్ష (జన్మ) వల్లే మనుగడ సాగిస్తున్న పురుషుడు, తిరిగి ఆమెనే హతమార్చడం లోని వైరుధ్యాన్ని "పాలు తాగి రొమ్ము గుద్దే" నైజంగా అభివర్ణించారు. తలంబ్రాలతోనే బతుకు తెల్లారిందని/ సప్తపది పేరుతో సర్వం సమసి పోయిందని / అతని ఆశల యజ్ఞానికి/ బలి పశువును నేనయ్యానని/ బాధ్యత లేని బంధం మధ్య / డొల్లగా మారానని, వివాహ వ్యవస్థలో స్త్రీ తనను తాను ఎలా కోల్పోతుందో శైలజ గారు కవిత్వీకరించారు. ఏడు అడుగుల బంధం ఆమె సర్వస్వాన్ని దహించివేసే "ఆశల యజ్ఞం"గా మారిందని, ఆమె ఆ యజ్ఞంలో కేవలం ఒక "బలి పశువు" మాత్రమేనని చెప్పడం అత్యంత బాధాకరం. బాధ్యత లేని బంధాల మధ్య స్త్రీ ఒక "డొల్ల"గా మిగిలిపోవడం అనేది నేటికీ అనేక కుటుంబాలలో కనిపిస్తున్న చేదు నిజం."నిన్న నేను లేను, రేపు ఉండను" అనే మాటల్లో ఒక అస్థిరత కనిపిస్తుంది. గడియ గడియకు మృత్యువు తొంగిచూస్తుండటం అంటే, అది శారీరక మరణం మాత్రమే కాదు, ఆత్మగౌరవం చనిపోవడం కూడా కావచ్చు. సమాజం ఆమెకు ఇచ్చే గుర్తింపు లేకపోవడమే "ఉన్నా లేనట్లే" అనే భావనను కలిగిస్తోంది.మామిడాల శైలజ గారి కవిత్వం కేవలం కన్నీటి గాథ కాదు, అది ఒక హెచ్చరిక. స్త్రీ హృదయంలోని అంతర్లీన వేదనను సమాజానికి వినిపించే ప్రయత్నం. ఈ కవితా వికాసం నేటి మహిళలకు తమ హక్కుల పట్ల, అస్తిత్వం పట్ల చైతన్యాన్ని కలిగిస్తుందని ఆశిద్దాం. స్త్రీని కేవలం ఒక పాత్రగా కాకుండా, ఒక మనిషిగా గౌరవించే రోజు రావాలని శైలజ కవిత్వం ఆకాంక్షిస్తోంది.



డా.పూసపాటి వేదాద్రి
9912197694

# వీధి కుక్కల బెడదతో.. ప్రజా భద్రతకు ముప్పు!



మన దేశ వ్యాప్తంగా,ముఖ్యంగా పట్టణాలు-పల్లెల్లో వీధి కుక్కల సమస్య రోజురోజుకు తీవ్రమవుతోంది. వీధుల్లో గుంపులుగా తిరిగే ఈ శునకాలు చిన్నా--పెద్దా అనే తేడా లేకుండా ప్రజలపై దాడులు చేయడం వల్ల భయం, ప్రాణ రక్షణ భావం పెరుగుతోంది. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు ఈ బెడదకు అత్యంత బలహీన వర్గాలుగా మారుతున్నారు. పాఠశాలలకు వెళ్లే పిల్లలు, సాయంత్రం ఆడుకునే బాలలు, ఉదయం వాకింగ్‌కు వెళ్లే పెద్దలు-అందరూ వీధి కుక్కల భయంతో బయటకు రావడానికి సంకోచించే పరిస్థితి ఏర్పడుతోంది.

ఇటీవలి కాలంలో చోటుచేసుకున్న కొన్ని సంఘటనలు ఈ సమస్య తీవ్రతను మరింత స్పష్టంగా చూపిస్తున్నాయి. తెలంగాణలోని భువనగిరిలో ఇంటి బయట ఆడుకుంటున్న నాలుగేళ్ల బాలుడిపై వీధి కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ఘటన ప్రజలను కలచివేసింది. అలాగే గుంటూరు, మెదక్, హనుమకొండ వంటి ప్రాంతాల్లో కూడా కుక్కల దాడులు వరుసగా జరుగు తున్నాయి. కొన్ని చోట్ల ఒకేసారి పలువురిపై దాడులు జరగడం పరిస్థితి ఎంత ప్రమాదకరంగా మారిందో సూచిస్తోంది.

వీధి కుక్కల గుంపులు రాత్రిపూట మాత్రమే కాకుండా పగటిపూట కూడా రోడ్లపై తిరుగుతూ వాహనదారులను వెంబడించడం వల్ల రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయి.వీధుల్లో అకస్మాత్తుగా కుక్కలు దూసుకొచ్చి వాహనాలను వెంబడించడం వల్ల డ్రైవర్లు నియంత్రణ కోల్పోయే ప్రమాదం ఉంది.ఇది కేవలం వ్యక్తిగత ప్రమాదమే కాకుండా సామూహిక భద్రతకు ముప్పుగా మారుతోంది.

ఈ సమస్య ప్రజారోగ్యంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతోంది. కుక్క కాట్ల ద్వారా వ్యాపించే రేబిస్ వ్యాధి అత్యంత ప్రాణాంతకమైనది. ఒకసారి రేబిస్ లక్షణాలు కనిపిస్తే ప్రాణాపాయం తప్పదు. ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏడాది సుమారు 60 వేల మంది రేబిస్ వల్ల ప్రాణాలు కోల్పోతుండగా, అందులో గణనీయమైన శాతం భారతదేశానిదే కావడం ఆందోళనకరం. దేశంలో 2030 నాటికి రేబిస్ నిర్మూలన లక్ష్యంగా ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, నేలస్థాయిలో చర్యలు వలన ఆశించినంతగా అమలవడం లేదు.

పశుసంవర్ధక శాఖ గణాంకాల ప్రకారం దేశవ్యాప్తంగా కోట్ల సంఖ్యలో వీధి కుక్కలు ఉన్నట్లు అంచనా. అధికారిక లెక్కలు ఒకటి చెబితే, వాస్తవ పరిస్థితి మరింత తీవ్రమై ఉండొచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. నగరాల్లో చెత్త నిర్వహణలో లోపాలు, ఎక్కడపడితే అక్కడ ఆహార వ్యర్థాలు పారవేయడం, మాంసపు మిగులు భాగాలు రోడ్లపై పడేయడం వంటి కారణాలు వీధి కుక్కల సంఖ్య పెరగడానికి దోహదపడుతున్నాయి.

ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు కూడా కీలక మార్గదర్శకాలు జారీ చేసింది. జనసాంద్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాల నుంచి వీధి కుక్కలను రక్షణ కేంద్రాలకు తరలించడం, వాటికి సంతాన నియంత్రణ శస్త్రచికిత్సలు చేయడం, రేబిస్ టీకాలు వేయడం వంటి చర్యలు తీసుకోవాలని స్పష్టంగా ఆదేశించింది. అయితే స్థానిక సంస్థలు, మున్సిపాలిటీలు ఈ చర్యలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమవుతున్నాయి. సిబ్బంది కొరత, నిధుల లేమి, సమన్వయాభావం వంటి కారణాలు ఈ సమస్యను మరింత క్లిష్టంగా మారుస్తున్నాయి.

వీధి కుక్కల సమస్యను కేవలం ఒక జంతు సమస్యగా కాకుండా, ప్రజా ఆరోగ్యం మరియు భద్రతకు సంబంధించిన అత్యవసర అంశంగా చూడాలి. కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేస్తూ, శాస్త్రీయ పద్ధతుల్లో శునకాల నియంత్రణ చర్యలు చేపట్టాలి. ప్రతి పట్టణంలో కుక్కల శస్త్రచికిత్స కేంద్రాలు, టీకా కేంద్రాలు ఏర్పాటు చేయాలి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో రేబిస్ టీకాలు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా చూడాలి.

అదే విధంగా ప్రజల బాధ్యత కూడా ఎంతో కీలకం. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా, మున్సిపాలిటీ ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డుల్లో మాత్రమే పారవేయాలి. వీధి కుక్కలకు ఆహారం పెట్టేటప్పుడు నియమ నిబంధనలు పాటించాలి. చిన్నపిల్లలను ఒంటరిగా బయటకు పంపేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి. కుక్క కాటు జరిగిన వెంటనే సమీప వైద్య కేంద్రంలో చికిత్స తీసుకోవడం తప్పనిసరి.

అంతిమంగా, వీధి కుక్కల సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వాలు, స్థానిక సంస్థలు, ప్రజలు-మూడు వర్గాలు కలిసి పనిచేయాలి. కఠిన చర్యలు, అవగాహన కార్యక్రమాలు, శాస్త్రీయ విధానాల అమలు-ఈ మూడు కలిసివచ్చినప్పుడే ప్రజా భద్రతను కాపాడగలం. లేదంటే ఈ సమస్య మరింత తీవ్రమై, భవిష్యత్తులో పెద్ద ప్రమాదాలకు దారితీసే అవకాశముంది.



మేకిరి దామోదర్
సామాజిక విశ్లేషకులు
వరంగల్ 9573666650

# జలమండలి పేరుతో వాటర్ ట్యాంకర్ సరఫరా చేస్తే చర్యలు

- బోర్డు లోగో దుర్వినియోగంపై సీరియస్
- క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్న అధికారులు



**హైదరాబాద్, మార్చి 27 (జనంసాక్షి) :** జలమండలి అధికారిక లోగోను కొందరు వ్యక్తులు, ముఖ్యంగా ప్రైవేట్ నీటి ట్యాంకర్ యజమానులు, అనధికారికంగా వినియోగిస్తున్నట్లు ఇటీవల జలమండలి దృష్టికి వచ్చింది. ఈ విధమైన చర్యలు పూర్తిగా చట్ట విరుద్ధమైనవిగా పరిగణించబడుతుంది. జలమండలి లోగో అనేది సంస్థ ప్రభుత్వ అధికారిక గుర్తింపు చిహ్నం. దీనిని అనుమతి లేకుండా వినియోగించడం ద్వారా ప్రజలను తప్పుదారి పట్టించే అవకాశం ఉంది. ప్రైవేట్ ట్యాంకర్లు జలమండలి లోగోను ఉపయోగించడం వల్ల, ఆ ట్యాంకర్లు ప్రభుత్వ సేవల భాగంగా ప్రజలు భావించే పరిస్థితి ఏర్పడుతోంది. ఇది ప్రజల నమ్మకాన్ని దెబ్బతీయడమే కాకుండా, మోసపూరిత చర్యగా గుర్తిస్తారు. ఈ నేపథ్యంలో, జలమండలి అధికారులు ఈ విషయాన్ని అత్యంత సీరియస్‌గా పరిగణించి, లోగో దుర్వినియోగం చేసే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది. జలమండలి పేరు, లోగో మరియు బ్రాండ్‌ను ఉపయోగిస్తూ కొంతమంది ప్రైవేట్ బోర్‌వెల్ ట్యాంకర్ ఆపరేటర్లు అనధికారికంగా ప్రజలకు నీరు సరఫరా చేస్తున్నట్లు బోర్డు దృష్టికి వచ్చింది. దీనివల్ల ఆ నీరు జలమండలి ద్వారా సరఫరా చేయబడినదనే తప్పుడు భావన కలుగుతోంది. ప్రైవేట్ ట్యాంకర్ల ద్వారా సరఫరా అయ్యే నీరు సాధారణంగా బోర్‌వెల్‌ల నుండి సేకరించి.. ఈ నీరు జలమండలి ప్రమాణాల ప్రకారం శుద్ధి చేయబడినది కాదనీ.. అలాగే నాణ్యత పరీక్షలు కూడా చేయబడవు. అందువల్ల, ఈ నీటిని వినియోగించడం వల్ల తీవ్రమైన ఆరోగ్య సమస్యలు కలిగే ప్రమాదం ఉంది. అందువల్ల, సాధారణ ప్రజలు ప్రైవేట్ ట్యాంకర్ ఆపరేటర్లపై ఆధారపడవద్దని జలమండలి సూచిస్తోంది. ఈ నీటి నాణ్యత సురక్షితం కాకపోవచ్చు మరియు ఆరోగ్యానికి హానికరమై ఉండే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ప్రజలు తాగునీటి కోసం ట్యాంకర్లను బుక్ చేసుకునే సందర్భంలో జలమండలి అధికారిక కస్టమర్ కేర్ సేవల ద్వారా మాత్రమే బుక్ చేయవలసిందిగా కోరుతుంది. టోల్ ఫ్రీ నంబర్ 155313 కు కాల్ చేసి, సురక్షితమైన మరియు శుద్ధి చేయబడిన తాగునీటిని పొందవచ్చు. ఇలాంటి ఘటనలు గుర్తించిన వెంటనే సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తారు. ఇటీవల నిర్వహించిన తనిఖీలలో ఒక ప్రైవేట్ నీటి ట్యాంకర్ జలమండలి లోగోను అనధికారికంగా వినియోగిస్తున్నట్లు గుర్తించిన అధికారులు ఆ ట్యాంకర్‌ను స్వాధీనం చేసుకుని, సంబంధిత వ్యక్తిపై క్రిమినల్ కేసు నమోదు చేశారు. జలమండలి పరిధిలోని అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించి, లోగో దుర్వినియోగం జరుగకుండా కఠినంగా పర్యవేక్షణ చేయాలని ఎండీ అశోక్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

## సీసీ కెమెరాల ఏర్పాటు కోసం ఎన్ను నరేందర్ రెడ్డి రూ.లక్ష విరాళం

- సీసీ కెమెరాల ఏర్పాటుకు విరాళం అందించడం అభినందనీయం



**చేవెళ్ల, మార్చి 27 (జనంసాక్షి) :** సీసీ కెమెరాల ఏర్పాటుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్ అన్నారు. శుక్రవారం చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని ఇబ్రహీంపల్లి 11వ వార్డుకు చెందిన ఎన్ను నరేందర్ రెడ్డి, వాణి దంపతులు గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకుగాను చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్ కు రూ.1 లక్ష రూపాయల చెక్కును అందించారు. ఈసందర్భంగా సీఐ. మాట్లాడుతూ.. గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేం దుకు దాతలు ముందుకు రావడం చాలా హర్షించదగ్గ విషయమన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో గ్రామాల్లో ఎలాం టి ఘటనలైన ఇట్టే తెలిసిపోతుందన్నారు. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీస్ లతో సమానమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ పైండ్ల మధుసూధన్ రెడ్డి, చేవెళ్ల ఎస్సై తేజశ్రీ, నాయకులు రవీందర్, పైండ్ల శ్రీనివాస్ రెడ్డి, బాల్ రెడ్డి, జగన్ గౌడ్, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

## గురుపీఠంపై జెండా ఆవిష్కరణ

- ఆకట్టుకున్న ర్యాలీ



**శివ్వంపేట, మార్చి 27 (జనంసాక్షి) :** శివ్వంపేట మండలం గూడూరు గ్రామ శివారులోని గురుపీఠంలోని షిరిడి సాయిబాబా దేవాలయం గోపురంపై శ్రీరామనవమి నీ పురస్కరించుకొని ప్రముఖ హైకోర్టు న్యాయవాది, శ్రీ గురుఫిఠం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జిన్నారం పెద్దగౌని శివకుమార్ గౌడ్ రమాదేవి దంపతుల ఆధ్వర్యంలో గూడూరు గ్రామం నుండి ఓంకార సహితమైన పథకాలను ఊరేగింపుగా సాయి భజనలతో తీసుకొని వెళ్లి బాబా దేవాలయం పై కాషాయ జెండాను ఎగరవేశారు. గ్రామంలోని ముఖ్యులందరూ కాషా జెండాలతో ర్యాలీగా గురు పీఠం వరకు వెళ్లడంతో ర్యాలి ప్రజలతోపాటు, చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నది. జెండా ఆవిష్కరణ కార్యక్రమం ముగిసిన తర్వాత బాబా ఆలయం, దత్తాత్రేయ స్వామి దేవాలయాల్లో భక్తులు, ప్రముఖులు దేవాలయంలో దేవతామూర్తులను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ గురుఫిఠం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శివకుమార్ గౌడ్ రమాదేవి దంపతులు, సర్పంచ్ బ్యాగరి నర్సయ్య, మాజీ సర్పంచ్ స్వరాజ్యలక్ష్మి శ్రీనివాస్ గౌడ్ దంపతులు, రమణ గౌడ్ దంపతులు, రాజం బిక్షపతి యాదవ్ దంపతులు, సూర్య కుమార్ గౌడ్ దంపతులు లతో పాటు సామాన్య భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉప్పల్‌లో గంజాయి విక్రయంపై పోలీసుల దాడి

**ఉప్పల్, మార్చి 27 (జనం సాక్షి) :** నగరంలోని ఉప్పల్ ప్రాంతంలో గంజాయి అక్రమ విక్రయాలు పెరుగుతున్న నేపథ్యంలో పోలీసులు కఠిన చర్యలు ప్రారంభించారు. గోప్య సమాచారం ఆధారంగా నిర్వహించిన ప్రత్యేక దాడుల్లో నిందితున్ని అదుపులోకి తీసుకుని గంజాయి స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం, ఉప్పల్ పరిధిలోని కేఎస్‌ఆర్ నగర్, రామంతపూర్ ప్రాంతాల్లో కొంతకాలంగా గంజాయి సరఫరా, విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం అందింది. ఈ మేరకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఎస్‌టిఎఫ్ సిబ్బంది సమన్వయంతో దాడులు నిర్వహించారు. దాడుల సమయంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఆపరేషన్‌లో రెండు వేర్వేరు చోట్ల నిర్వహించిన తనిఖీల్లో గంజాయి నిల్వలు బయటపడగా, పలువురు వ్యక్తులను పోలీసులు విచారణ కోసం అదుపులోకి తీసుకున్నారు. ప్రధాన నిందితులపై కేసులు నమోదు చేసి విచారణను వేగవంతం చేశారు. పరారీలో ఉన్న మరికొంతమందిని గుర్తించేందుకు ప్రత్యేక గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. స్వాధీనం చేసుకున్న గంజాయిని సంబంధిత పోలీస్ స్టేషన్‌కు తరలించి, నిందితులను కోర్టులో హాజరుపరచినట్లు అధికారులు తెలిపారు. నగరంలో డ్రగ్స్ వ్యాప్తిని అరికట్టేందుకు ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తున్నామని, గంజాయి వంటి మాదక ద్రవ్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, ఎక్కడైనా అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఉప్పల్ ప్రాంతంలో ఇకముందు కూడా ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై నిరంతర నిఘా కొనసాగుతుందని పోలీసులు స్పష్టం చేశారు.

## నవాబుపేట్ మండలానికి 1.కోటి 75 లక్షలు మంజూరు



**నవాబుపేట్, మార్చి 27 (జనం సాక్షి) :** చేవెళ్ల నియోజకవర్గం లోని నవాబు పేట్ మండలానికి చేవాళ్ల కాంసెస్సీ ఇంచార్జి భీమ్ భరత్ సహకారంతో శుక్రవారంనవాబ్ పేట్ మండలానికి ఒక కోటి 75 లక్షల నిధులు మంజూరు చేసిన తెలంగాణరాష్ట్ర ఐటి శాఖమంత్రినీ చేవాళ్ల కాంసెస్సీ ఇన్చార్జి పామేనా భీమ్ భారత్, నవాబుపేట మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మేడిపల్లి వెంకటయ్య ఆధ్వర్యంలో నవబ్ పేట్ మండలంలోని తిమ్మారెడ్డిపల్లి ,కుమ్మరిగూడ గ్రామాల్లో సిసి రోడ్లు ప్రారంభించిన మండల అధ్యక్షులు మేడిపల్లి వెంకటయ్య ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ మండలానికి కోటి 75 లక్షల నిధులు ఇచ్చినందుకు మంత్రి శ్రీధర్ బాబు కి అలాగే చేవెళ్ల నియోజకవర్గ ఇన్చార్జి భీమ్ భరత్ కి కృతజ్ఞతలు తెలిపారు. వారి సహకారంతో ముందు ముందు ఇంకా మండలానికి ఎక్కువ నిధులు తీసుకొచ్చి అన్ని గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపిస్తామని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సామ వెంకట్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ ప్రభాకర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు గణపురం ప్రసాద్ , పులుమామిడి సర్పంచ్ నరసింహులు , తిమ్మారెడ్డిపల్లి సర్పంచ్ ప్రభాకర్ , కుమ్మరిగూడ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి ,ఉప సర్పంచ్ లు తంగడపల్లి మల్లేష్ , గోపాలకృష్ణ ,వార్డ్ సభ్యులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## వేసవిలో బాట సరులకు మజ్జిగ పంపిణీ చేయడం అభినందనీయం

- మార్వాడి యువ మంచ్ ఆధ్వర్యంలో మజ్జిగ కేంద్రం ప్రారంభం
- మున్సిపల్ చైర్పర్సన్ నీరజబాల్ రెడ్డి



**తాండూరు, మార్చి 27 (జనంసాక్షి) :** వేసవిలో బాట సరులకు మజ్జిగ పంపిణీ చేయడం అభినందనియమని మున్సిపల్ చైర్పర్సన్ నీరజబాల్ రెడ్డి పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా రామ నవమి సందర్భంగా మార్వాడి యువ మంచ్ ఆధ్వర్యంలో వేసవి కాలం ఎండతీవ్రత ను దృష్టి లో పెట్టుకొని పాదాచారులకు మజ్జిగ కేంద్రం స్థానిక బస్టాండ్ వద్ద ప్రారంభం చేయడం జరిగిందని మంచ్ అద్యక్షులు కిషన్ రాథీ తెలిపారు. ఈ మజ్జిగ పంపిణీ కార్యక్రమం 40 రోజులు దాతల సహకారంతో కొనసాగిస్తామని తెలిపారు. శుక్రవారం రాజస్థానీ మహిళ మండలి వారి సహకారంతోస్థానిక బస్టాండ్ వద్ద ప్రారంభించడం జరిగింది అని ఈ కార్యక్రమం లో పురపాలక సంఘం చైర్మన్ నీరజ బాలరెడ్డి మాట్లాడుతూ వేసవి లో బాట సరులకు మజ్జిగ పంపిణీ చేయడం గొప్ప విషయం అని మానవ సేవ యే మాధవ సేవా అని మంచ్ చేస్తున్న సేవ కార్యక్రమంలను కొనియాడారు. ఈ కార్యక్రమం లో మహిళ మండలి అధ్యక్షురాలు కిరణ్ సార్డా , కార్యదర్శి వర్ష సార్డా కోశాధికారి కల్పన రాతి. మంచ్ జాతీయ కార్యవర్గ సభ్యులు మన్మోహన్ సార్డా. రోహిత్ అగర్వాల్. మంచ్ కార్యదర్శి కరణ్ జైన్. కోశాధికారి భరత్ దేవ్డా సభ్యులు అనిల్ సార్డా. దినేష్ పర్థాని. అరుణ్ సార్డా. లక్ష్మి నారాయణ బూబ్. రమాకాంత్ పండిట్. సన్నీ అగర్వాల్. సూర్య ప్రకాష్ సోమని. నితిన్ సోమని. సునిల్ సార్డా. బ్రిజ్మోహన్ బూబ్. అభిషేక్ సార్డా తదితర సభ్యులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత నియమాలు తప్పనిసరిగా పాటించాలి




**నారాయణపేట, మార్చి 27 (జనం సాక్షి) :** ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని నారాయణపేట టౌన్ ఎస్సై వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఆదేశాల మేరకు అరయవ్ అలైవ్ మూడో విడత కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నారాయణపేట జిల్లా కేంద్రంలో ఎస్సై వెంకటే శ్వర్లు ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు, వాహనదారులకు రోడ్డు భద్రత నియమాలపై విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా డ్రైవర్లు, వాహనదారులతో మద్యం సేవించి వాహనాలు నడపరాదు, ట్రాఫిక్ రూల్స్ తప్పనిసరిగా పాటించాలి, హెల్మెట్, సీట్‌బెల్ట్ వాడాలి, అతివేగం నివారించాలి అనే అంశాలపై రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎస్సై వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం మద్యం సేవించి వాహనాలు నడపడం మరియు ట్రాఫిక్ నియమాలు పాటించకపోవడమేనని తెలిపారు. ప్రతి వాహన దారుడు తన ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు. రోడ్డు భద్రత నియమాలను పాటించడం వల్లే ప్రమాదాలను నివారించవచ్చని అన్నారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించి ప్రజల ప్రాణాలను కాపాడడమే పోలీస్ శాఖ యొక్క ప్రధాన లక్ష్యమని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, డ్రైవర్లు, వాహనదారులు పాల్గొన్నారు.

## ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలి

**మల్కాజిగిరి, మార్చి 27 (జనంసాక్షి) :** శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆనంద్‌బాగ్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగిన సీతారాముల వారి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు స్వామివారి కల్యాణాన్ని తిలకించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ప్రధాన అర్చకులు ఆయనకు శాలువాలతో సత్కరించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం మైనంపల్లి మాట్లాడుతూ. నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, శ్రీరామచంద్రుని ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం అన్న ప్రసాద కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీకాంత్ రెడ్డి,బికె శ్రీనివాస్, గుండా నిరంజన్, జీఎన్వీ సతీష్ కుమార్, పిట్టల శ్రీనివాస్, రాందాస్, సంతోష్ ముదిరాజ్, సంపత్ గౌడ్, వైనాల ప్రవీణ్, వినోద్ యాదవ్, సిరిగిరి రాజు, సనాది శంకర్, కన్నా, కుమార్ మరియు ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## పోస్ట్ ఆఫీస్‌కు తాళం వేసి గ్రామస్తుల నిరసన



**వెల్దండ, మార్చి 27 (జనంసాక్షి) :** మండల పరిధిలోని చెదురుపల్లి గ్రామంలో ఉన్న పోస్టు కార్యాలయాన్ని రద్దు చేస్తున్నట్లు అధికారులు ఉత్తర్వులు జారీ చేయడంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో గ్రామ సర్పంచ్ దన్ సింగ్ నాయక్ ఆధ్వర్యంలో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ పోస్టు కార్యాలయానికి తాళం వేశారు. గ్రామస్తుల వివరాల ప్రకారం, చెదురుపల్లి గ్రామానికి ఈ పోస్టు కార్యాలయం కీలక సేవలను అందిస్తోంది. పింఛన్లు, మనీ ఆర్డర్లు, ఆధార్ సేవలు వంటి పలు అవసరాలకు గ్రామ ప్రజలు ఈ కార్యాలయంపై ఆధారపడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కార్యాలయాన్ని అకస్మాత్తుగా రద్దు చేయడం అన్యాయమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచ్ దన్ సింగ్ నాయక్ మాట్లాడుతూ నాలుగువేల జనాభా ఉన్న చెదురుపల్లి గ్రామాన్ని వదిలేసి కేవలం 40 ఇండ్లు ఉన్న కమల్ పూర్ కు పోస్ట్ ఆఫీస్ తరలించడం అన్యాయమని,వనపర్తి పోస్టల్ ఎస్పీ భూమన్న డబ్బులకు లొంగిపోయి పోస్ట్ ఆఫీస్ తీసివేయడం చూడడం మానేసుకోవాలని తెలిపారు, గ్రామ ప్రజలకు అత్యవసరమైన సేవలను అందించే పోస్టు కార్యాలయాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ మూసివేయనివ్వం. అధికారులు వెంటనే తమ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి" అని డిమాండ్ చేశారు. గ్రామస్తులు కూడా పోస్టు కార్యాలయం కొనసాగించాలని నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. నిరసన తెలిపిన వారిలో గ్రామ ఉప సర్పంచ్ సహదేవ్, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

## జాతర ఉత్సవాలు వైభవంగా ఎలాంటి లోటు లేకుండా జరపాలి



**తాండూరు, మార్చి 27 (జనంసాక్షి) :** శ్రీ భావిగి బద్రేశ్వర జాతర ఉత్సవాలు వైభవంగా ఎలాంటి లోటులేకుండా జరుపుకోవాలని ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం తాండూర్‌లో పర్యటించిన మహేందర్ రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా జాతర ఉత్సవ కమిటీ సభ్యులు కలిసి శాలువాతో సన్మానించారు. అదేవిధంగా జాతర ఉత్సవ కమిటీ సభ్యులు మేడి మహేష్,దేవనూర్ శంకర్, గంగా శ్రవణ్ కుమార్, గాజుల విజయ్ కుమార్, శెట్టి చంద్రకాంత్, మధురిక చంద్రకాంత్, అగ్గనూరు సంకేత తదితరులు భద్రేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఏప్రిల్ నెల 7వ తేదీ నుండి ప్రారంభమై 15వ తేదీ వరకు కొనసాగుతాయని చెప్పారు. ఇందులో భాగంగా రథోత్సవం ఏప్రిల్ 11వ తేదీ రాత్రి 11 గంటలకు నిర్వహిస్తామని, 12న రాత్రి 10 గంటలకు లంకాదాహనం ఉంటుందని వివరించారు. స్పందించిన మహేందర్ రెడ్డి తప్పక వస్తానని పేర్కొంటూ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని,జాతర ఉత్సవాలకు భక్తులకు అవసరమైన సదుపాయాల కోసం కూడా అధికారులను ఆదేశిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు తదితరులు ఉన్నారు.

# క్యాన్సర్ నివారణకు సమగ్ర చర్యలు

- నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప



**ఖైరతాబాద్, మార్చి 27 (జనం సాక్షి) :** వేగంగా పెరుగుతున్న క్యాన్సర్ వ్యాధి భారాన్ని దృష్టిలో ఉంచుకుని, ప్రజల్లో అవగాహన పెంపొందించడం, సమగ్ర నివారణ చర్యలు చేపట్టడం అత్యవసరమ ని నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప పేర్కొన్నారు. ఈ మేరకు నిమ్స్(నిజామ్స్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్) ఆసుపత్రిలో కీలక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి డా.బీరప్ప అధ్య క్షత వహిస్తూ అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో క్యాన్సర్ కేసులు క్రమంగా పెరుగుతు న్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితిని ఎదుర్కోవడానికి ముందస్తు గుర్తింపు, ప్రజల్లో అవ గాహన, అందరికీ అందుబాటులో ఉండే చికిత్సా సౌకర్యాలు అత్యంత కీలకమని ఆయన స్పష్టం చేశారు. కాన్సర్ రిజిస్ట్రీ ప్రిన్సిపాల్ ఇన్వెస్టిగేటర్ డా.సదాశివుడు గుండేటి మాట్లాడుతూ క్యాన్సర్ నివారణలో ఆరోగ్యకరమైన జీవనశైలి, క్రమం తప్పని ఆరోగ్య పరీక్షలు, స్క్రీనింగ్ కార్యక్రమాలు ముఖ్యపాత్ర పోషిస్తాయని తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని సూచిం చారు. ఈ సమావేశంలో భారత వైద్య పరిశోధనా మండలి(ఐసీఎంఆర్)కి చెందిన నేషనల్ ఇన్స్టి ట్యూట్ ఆఫ్ నాన్-కమ్యూనికబుల్ డిసీజెస్ ఎపిడె మియాలజీ విడుదల చేసిన 'తెలంగాణ క్యాన్సర్ బర్డెన్ ప్రొఫైల్ 2026'పై ప్రత్యేక చర్చ జరిగింది. ఈ ప్రొఫైల్ ఆధారంగా రాష్ట్రంలో క్యాన్సర్ వ్యాప్తి, ప్రభావం, నియంత్రణ చర్యలపై విశ్లేషణ చేయబడింది. క్యాన్సర్ రిజిస్ట్రీ ప్రాముఖ్యతను వివరించు తూ, రాష్ట్ర వ్యాప్తంగా క్యాన్సర్ కేసుల నమోదు, డేటా విశ్లేషణ, సమగ్ర నివారణ చర్యలను బలోపే తం చేయాలని నిర్ణయించారు. పీబీసీఆర్ పాపు లేషన్ బేస్డ్ కాన్సర్ రిజిస్ట్రీ సోర్స్ ఆసుపత్రుల నుంచి డేటా అందించినందుకు సమావేశంలో కృత జ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డా.శాంతవీర్ ఉప్పిన్ రిజిస్ట్రార్, డా.రఘునాథరావు ప్రొఫెసర్, ఎంఎన్జే క్యాన్సర్ హాస్పిటల్, డా.మెహెర్ లక్ష్మి అడిషనల్ ప్రొఫెసర్, హెడ్-మెడికల్ ఆంకాలజీ, డా.రచన చెన్నమనేని అసోసియేట్ ప్రొఫెసర్, డా.మోనికా రేడియేషన్ ఆంకాలజిస్ట్, డా.తారా రోషిణి పాల్ పాథాలజిస్ట్, డా.ఉప్పలపాటి శ్రీహరి సీనియర్ రీసెర్చ్ ఆఫీసర్ తదితరులు, అలాగే వివిధ ఆసుపత్రుల వైద్యులు, పీజీ విద్యార్థులు, పరిశోధకులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
28 మార్చి 2026

# అక్షర స్కూల్ గుర్తింపు వెంటనే రద్దు చేయాలి

- అక్రమ కేసులు రాజకీయ ప్రేరేపిత చర్యకు నిదర్శనం



**వనపర్తి బ్యూరో, మార్చి 27 (జనం సాక్షి) :** అక్షర స్కూల్ లో మైనార్టీ విద్యార్థినిపై జరిగిన లైంగిక దాడి, సంఘటన వెలుగులోకి రాకుండా పాఠశాల యాజమాన్యం దాచిపెట్టడం, రాజకీయాలకతీతంగా ఖండించాలని, గట్టు యాదవ్, పుట్ట.ఆంజనేయులు, పలుస.రమేష్ గౌడ్, షేక్. జహాంగీర్, హేమంత్ ముదిరాజ్ పిలుపునిచ్చారు. శుక్రవారం నాడు వనపర్తి పట్టణంలోని మాజీ మంత్రి నివాస గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అక్రమ కేసుల నుండి బి.ఆర్.ఎస్ నాయకులకు, ఊరట కలగడం పోలీస్ అధికారులకు చెంపపెట్టు లాంటిదని అన్నారు.ఎమ్మెల్యే తొత్తులుగా మారి పోలీస్ అధికారులు, నిన్న ప్రవర్తించిన తీరు ప్రజలలో పోలీస్ వ్యవస్థపై చులకన భావం ఏర్పడ్డదని అన్నారు.సంఘటన జరిగిన బాధిత కుటుంబానికి తోడుగా నిలవాల్సిన ఎమ్మెల్యే, బి.ఆర్.ఎస్ నాయకులపై కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. ఎమ్మెల్యే మైనారిటీ సమాజానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.అక్షర స్కూల్ లో మైనార్టీ విద్యార్థినిపై జరిగిన లైంగిక దాడి సహించరానిదని అన్నారు. మార్చి23న, సంఘటన జరిగితే యాజమాన్యం, పోలీసులకు సమాచారం ఇవ్వకుండా, దాచిపెట్టి పెద్ద నేరం చేసిందని,యాజమాన్యంపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.స్కూల్ యాజమాన్యం నిర్లక్ష్యం వల్ల ,భావోద్వేగంతో జరిగిన దాడిని రాజకీయ ప్రేరేపిత చర్యగా, చేసి బి.ఆర్.ఎస్ నాయకులపై అక్రమ కేసులు పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు.బాధిత కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే దశల వారీగా ఉద్యమ చేస్తామని హెచ్చరించారు.జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని ,స్కూల్ గుర్తింపు రద్దు చేయాలని అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.మైనార్టీ ఓట్లు దండుకుని గెలిచి, మైనార్టీ విద్యార్థినిపై లైంగిక దాడి జరిగితే యాజమాన్యానికి కొమ్ము కాయడం తగదని అన్నారు.ఈ సమావేశంలో కౌన్సిలర్ మదన్, జోహెబ్ హుస్సేన్,సమద్, ఇమ్రాన్,అస్లాం, జెమిల్,సి.పి.ఎం నాయకులు పరమేశ్వర చారి,డి.కురుమయ్య,బాలస్వామి ఉన్నారు.

## కురుమల సమస్యలపై మాజీ మంత్రి హరీష్‌కు కేవైసీఎస్ వినతి



**చేర్యాల, మార్చి 27 (జనంసాక్షి) :** కురుమ కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యలపై కేవైసీఎస్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో గురువారం సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్ రావును కలిసి మెమొరాండం సమర్పించారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు దొడ్డి కొమురయ్య కురుమ ఆత్మగౌరవ భవనం కురుమ విద్యార్థులకే వినియోగించాలని, దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేయాలని, పలు సమస్యలపై హరీష్ రావుతో కేవైసీఎస్ నాయకులు సుదీర్ఘంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు కుండే వెంకటేష్ కురుమ, రాష్ట్ర ఉపాధ్యక్షులు మీస సత్యనారాయణ కురుమ, కోశాధికారి రావుల ఐలయ్య కురుమ, ఎల్బీనగర్ ఇంచార్జి మల్లేష్ కురుమ, తదితరులు పాల్గొన్నారు.


## ఫీజు రీయింబర్స్ మెంట్ కొరకు నిధులను వెంటనే విడుదల చేయాలి



**గద్వాల నడిగడ్డ, మార్చి 27 (జనం సాక్షి) :** బడ్జెట్ లో బహుజనులకు హామీ ఇచ్చిన మేరకు నిధులను కేటాయించాలని , కాలేజీ విద్యార్థులకు తక్షణమే పెండింగ్ స్కాలర్ షిప్స్ విడుదల చేయాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఇప్పటికే గత మూడు సంవత్సరాలుగా ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు విడుదల కాకుండా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారనీ, సగం బడ్జెట్ నిధులన్నీ ఏదో ఒక పేరు మీద కూడా కార్పొరేట్ సంస్థలకే వెళ్ళిపోతున్నాయని, దాని వల్ల బహుజన పేదలు, మధ్యతరగతి జీవితాలలో మార్పు రావడం గానీ, ఆశించిన ఫలితాలు గానీ రావడం లేదనీ, చివరికి బహుజనులకు,పేదలకు ప్రభుత్వ నిధులు సరిగా అందక కార్పొరేట్ కంపెనీలకు,సంస్థలకు సేవ చేసే బానిసలుగా మారడం దారుణమైన పరిస్థితిని చూయిస్తున్నదనీ, అన్ని రంగాలలో బహుజనుల భాగస్వామ్యం ఎండమావిగా మారుతున్నది.ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే రాజ్యాంగం అమలుకు నోచుకోకుండా పోయే ప్రమాదం ఉన్నదనీ, కార్పొరేట్ సంస్థల ఆదిపత్యం,దోపిడి విపరీతంగా పెరిగిపోతోందనీ ఇప్పటికైనా ప్రభుత్వాలు వేగంగా చర్యలు చేపట్టాల వారన్నారు. ఈ కార్యమంలో బహుజన రాజ్య సమితి నాయకులు ఎం. వాల్మీకి, కె.వినోద్ కుమార్,టి పి ఎఫ్ రాష్ట్ర నాయకుడు ప్రభాకర్,సి ఎల్ సి ఉమ్మడి జిల్లా అధ్యక్షులు సుభాన్,బి ఎస్ పి నాయకుడు కోళ్ల ఉసేన్ , ఉప్పేరుసుబాన్, రైమతుల్లా, సాదత్ పాల్గొన్నారు.

## మత భేదాలకు అతీతంగా శ్రీరామనవమి వేడుకలు

- సీతారాముల వారి కళ్యాణంలో పాల్గొన్న మైనార్టీ నాయకులు



**చేవెళ్ళ, మార్చి 27 (జనంసాక్షి) :** మత భేదాలు లేకుండా పండుగలను కలిసి జరుపుకోవడం సమాజ ఐక్యతకు దోహదమని మహమ్మద్ జాహేద్ అన్నారు. శుక్రవారం శ్రీరామనవమి సందర్భంగా చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని 11వ వార్డు ఇబ్రహీంపల్లిలో సీతారాముల వారి కల్యాణోత్సవాన్ని గ్రామ పెద్దలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపల్లి మాజీ ఉపసర్పంచ్, చేవెళ్ల మండల బిఆర్ఎస్ మైనార్టీ సెల్ నాయకులు, మహమ్మద్ జాహేద్ తో పాటు సలీం, దాతర్, ఖాలేద్, హమేద్, మునవ్వర్ లు కౌన్సిలర్ మధుసూదన్ రెడ్డి తో కలిసి పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ముస్లిం సోదరులు కూడా కళ్యాణోత్సవంలో పాల్గొని మతసామరస్యానికి నిదర్శనంగా నిలిచారు. భక్తులతో కలిసి కళ్యాణాన్ని వీక్షించి పూలమాలలు, పండ్లు సమర్పించడంతో పాటు కళ్యాణ కానుకలు సమర్పిస్తూ తమ భక్తి శ్రద్ధలు చాటుకున్నారు. ఈ సందర్భంగా మహమ్మద్ జాహేద్ మాట్లాడుతూ... మత భేదాలు లేకుండా పండుగలను జరుపుకోవడం సమాజానికి ఎంతో మంచిదని పేర్కొన్నారు. ఆలయ నిర్వాహకులు ముస్లిం సోదరులను సాదరంగా ఆహ్వానించి అభినందించారు. ఇలాంటి కార్యక్రమాలు సౌభ్రాతృత్వానికి ప్రతీకలని పలువురు అభిప్రాయపడ్డారు. గ్రామంలో శాంతి, ఐక్యత కొనసాగాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్లు ఎన్ను జంగారెడ్డి, దశరథ్, మనోహర్ రెడ్డి, మహేందర్ రెడ్డి, జగన్ గౌడ్, జంగయ్య గౌడ్, గ్రామస్తులు, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# మెదక్ జిల్లాలో ఎటువంటి గ్యాస్, ఇంధనం కొరత లేదు

- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



**మెదక్ జిల్లా బ్యూరో, మార్చి 27 (జనం సాక్షి) :** మెదక్ జిల్లాలో గ్యాస్ సిలిండర్ల ఇంధనం సరఫరా విష యంలో, కూడా ఎక్కడా కొరత లేదని, బుకింగ్ చేసుకున్న వారి కి యధావిధిగా డెలివరీ జరుగుతుందని వదంతులు నమ్మవద్దని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ శుక్రవారం ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. పెట్రోల్,డీజిల్,ఎల్.పి.జి కొరత అంటూ జరుగుతున్న ప్రచారాన్ని. కలెక్టర్ తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో న్రా+ గ్యాస్ సరఫరా కూడా సమృద్ధిగా ఉందని తెలిపారు. రోజుకు సగటున 3000 సిలిండర్లు బుక్ అవుతుండగా, వాటికి 100 శాతం డెలివరీ జరుగుతోందన్నారు. అదనంగా జిల్లాలోనీ గ్యాస్ గోదాముల్లో సుమారు 3500 సిలిండర్లు నిల్వ ఉండగా, మరో 6500 సిలిండర్లు ట్రాన్సిట్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. మెదక్ జిల్లాలో పెట్రోల్, డీజిల్ మరియు వంట గ్యాస్ (ఎల్పిజి) సరఫరా ఎటువంటి ఇబ్బంది లేకుండా కొనసాగుతోందని తెలిపారు. జిల్లాలో మొత్తం 87 పెట్రోల్ బ్యాంకులు మరియు 16 ఎల్పిజి గ్యాస్ ఏజెన్సీలు సక్రమంగా పనిచేస్తున్నాయని వెల్లడించారు. జిల్లాలో ప్రతిరోజు సుమారు 90 కిలోలీటర్ల పెట్రోల్ మరియు 110 కిలోలీటర్ల డీజిల్ అవసరం ఉండగా, ప్రస్తుతం మెదక్ జిల్లాలో 550 కిలోలీటర్ల పెట్రోల్ మరియు 644 కిలోలీటర్ల డీజిల్ సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సరఫరా యంత్రాంగం నిరంతరంగా కొనసాగుతున్నందున ప్రజలు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.కొన్ని పెట్రోల్ బంకుల వద్ద కనిపిస్తున్న క్యూలు వదంతుల కారణంగా ప్రజలు అవసరానికి మించి కొనుగోలు చేయడం వల్లే ఏర్పడుతున్నాయని తెలిపారు.అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెట్ కార్యకలాపాలను అరికట్టేందుకు సివిల్ సప్లైస్, రెవెన్యూ, లీగల్ మెట్రాలజీ మరియు పోలీస్ శాఖల సంయుక్త బృందాలు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తున్నాయని తెలిపారు. నిబంధనల ఉల్లంఘనపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నేటి వరకు మెదక్ జిల్లాలో పలు హోటల్లు రెస్టారెంట్ల యజమానులు గృహ అవసరాల కోసం (ఇళ్లలో) వాడే 14.2 కేజీల సిలిండర్లను, హోటళ్లు, రెస్టారెంట్లు వ్యాపార సంస్థలలో వాడటాన్ని గుర్తించి జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో టాస్క్ ఫోర్స్ పౌర సరఫరాల శాఖ, పోలీస్, రెవిన్యూ ఆధ్వర్యంలో బృందాలు మెదక్ పట్టణంలో పలు హోటళ్లు రెస్టారెంట్లలో విస్తృత తనిఖీలు నిర్వహించి 134 సిలిండర్లను సీజ్ చేసి 83మంది మీద క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరిగిందని తెలిపారు.మెదక్ జిల్లాలో ప్రజలు గమ నించాల్సిన విషయం ఏమిటంటే వాహనా ల్లో ఇంధనం తక్కువగా ఉంటే తప్ప బంకు లకు వెళ్లొద్దన్నారు.. ముఖ్యంగా వాట్సాప్, ఫేస్ బుక్ తదితర సోషల్ మీడియా ప్లాట్ ఫాంలలో వచ్చే ధృవీకరించని వార్తలను ఇతరులకు పంపవద్దన్నారు.. ప్రభుత్వం లేదా చమురు కంపెనీల అధికారిక ప్రకటనలను మాత్రమే నమ్మండి అన్నారు.వదంతులను నమ్మకుండా సంయమనం పాటిస్తే, ఈ క్యూ లైన్లు మాయమవుతాయి. మన భయం వ్యాపారులకు లాభం కావచ్చు, కానీ సామాన్యుడికి మాత్రం సమ యం, డబ్బు వృధానే. కాబట్టి గ్యాస్ ఇంధనం కొరత లేదు కాబట్టి ప్రజలందరూ సమన్వయం పాటించాలని తెలిపారు.

## టియుఎఫ్ చలో అసెంబ్లీ ముట్టడి వాయిదా..

- టియుఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఓరుగంటి ఆనంద్



**హయత్‌నగర్, మార్చి 27 (జనం సాక్షి) :** ఎల్బీనగర్ లోని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కార్యాలయంలో టియుఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఓరుగంటి ఆనంద్ ఆధ్వర్యంలో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ గత వారం నుండి చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని మార్చి 30 వ తేదీన న నిర్వహించనున్నట్లు తెలిసినదే, అందులో భాగంగా 26 వ తేదీ న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ని కలిసి ఉద్యమకారుల ఎదుర్కొంటున్న సమస్యలను వారికి విన్నవించగా, త్వరలో మీ సమస్యను పరిష్కరిస్తానని, సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. అందువలన చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్లు వారు తెలియజేశారు. ఈ విషయాన్ని 33 జిల్లాల తెలంగాణ ఉద్యమకారులందరూ గమనించగలరని కోరుతున్నాను. ఈ కార్యక్రమంలో టియుఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జెనిగె విష్ణువర్ధన్, ఉపాధ్యక్షులు కొంత యాదిరెడ్డి, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు జానకి రెడ్డి, రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు ఆడాల యాదయ్య, జిల్లా సెక్రెటరీ నరేష్, తెలంగాణ ఉద్యమకారులు డి దశరథ, ఎల్బీనగర్ నియోజకవర్గం అధ్యక్షులు రెడ్డి మాల కృష్ణ, కిషోర్ లాల్, బలరాం, రాజు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## పోయిన గంటలోనే 9 తులాల బంగారం రికవరీ

- యజమానికి అప్పగింత



**తూప్రాన్, మార్చి 27 (జనం సాక్షి) :** మెదక్ జిల్లా తూప్రాన్ పోలీసుల చురుకైన చర్యలతో కేవలం గంట వ్యవధిలోనే సుమారు 9 తులాల బంగారం రికవరీ యజమానికి అందజేశారు. ఈరోజు ఉదయం డయల్ 100కు అందిన సమాచారం మేరకు, బ్రాహ్మణపల్లి రైల్వే గేట్ సమీపంలో ఒక వ్యక్తి తన బ్యాగ్‌ను కోల్పోయినట్లు, అందులో సుమారు 9 తులాల బంగారం ఉన్నట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. వెంటనే స్పందించిన తూప్రాన్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విచారణ ప్రారంభించారు. ప్రాథమిక విచారణలో, ఫిర్యాదుదారు మోటార్ సైకిల్‌పై ప్రయాణిస్తూ బ్యాగ్‌ను సైడ్ హ్యాండిల్‌కు వేలాడదీసి తీసుకెళ్తుండగా, అది ప్రమాదవశాత్తు కింద పడి పోయినట్లు తెలిసింది. పోలీసులు వెంటనే పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలను పరిశీలించి దర్యాప్తు చేపట్టారు. ఆ క్రమంలో బ్యాగ్ ఒక స్పీడ్ బ్రేకర్ వద్ద పడిపోయి, అక్కడి నుంచి ఒక వ్యక్తి దాన్ని తీసుకెళ్లినట్లు గుర్తించారు. తక్షణమే ఆ వ్యక్తిని గుర్తించిన పోలీసులు అతని వద్దకు చేరుకోగా, అతను తన వద్ద బ్యాగ్ ఉన్నట్లు స్వయంగా తెలిపాడు. పరిశీలించగా అందులో ఉన్న రెండు బంగారు చైన్‌లు (సుమారు 9 తులాలు)ను స్వాధీనం చేసుకుని యజమానికి అప్పగించారు. పోలీసుల వేగవంతమైన చర్యలతో కేవలం ఒక గంటలోనే మొత్తం ఆస్తి రికవరీ కావడం విశేషం. ఈ సందర్భంగా తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్ సీఐ రంగకృష్ణ ఎస్సై గంగరాజు పోలీసు సిబ్బందిని అభినందించారు.అలాగే నిజాయితీగా బంగారం అప్పగించిన నాగరాజు, కృష్ణలను శాలువాలతో సన్మానించారు.

## సింగూరులో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం



**పుల్కల్, మార్చి 27 (జనం సాక్షి) :** శ్రీరామనవమి పురస్కరించుకొని శుక్రవారం మండల పరిధిలోని సింగూరు గ్రామంలో గ్రామ సర్పంచ్ నంది కంటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.అందులో భాగంగా గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ క్రింద మంజూరైన ఐదు లక్షల నిధులతో బుడిగ జంగాల కాలనీలో సిసి రోడ్డు పనులను ప్రారంభించారు.అలాగే అంగన్వాడి నూతన భవనానికి పన్నెండు లక్షల రూపాయల నిధులు కూడా మంజూరయ్యాయని గ్రామ సర్పంచ్ నంది కంటి శ్రీనివాస్ తెలిపారు.అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కు ప్రహరి గోడ నిర్మాణానికి, మహిళ సమైక్య భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.పల్లెల అభివృద్దే ధ్యేయంగా ఆందోల్ నియోజకవర్గం ను వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని గ్రామ సర్పంచ్ శ్రీనివాస్ కొనియాడారు. ఎక్కడలేని విధంగా కనివిని ఎరుగని రీతిలో ఆందోల్ ను అభివృద్ధి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎర్ర శేఖర్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ల వేధింపులు తాళలేక ఏఎన్ఎం ఆత్మహత్యాయత్నం



**వెల్దుర్తి, మార్చి 27 (జనం సాక్షి) :** వెల్దుర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్ పేత్తనం నెలకొంది. ఆస్పత్రిలోఉన్న మహిళ వైద్యుల వేధింపులు తాళ్లలేక ఓమహిళఎ ఎన్ఎం షుగర్ మాత్రలు మింగి ఆత్మహత్య యత్నానికి ఓడిగట్టిన సంఘటన శుక్రవారం జరిగింది. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులుగా సౌజన్య శిరీషలు విధులు నిర్వహిస్తున్నారు.వెల్దుర్తి ప్రభుత్వాసుపత్రిలో సెకండ్ ఎ ఎన్ఎం గాపనిచేస్తున్న రజినిను అర్ధాంతరంగా మధ్యాహ్నం సమయంలో ఆస్పత్రియుడిసి శ్రీలత మాసాయిపేట బిసబ్ సెంటర్లో సిబ్బంది లేరనితక్షణమే వెళ్లాలని ఆదేశాలు జారీ చేయడంతో విధుల్లో ఇలాంటి వేధింపులు ఏమిటి మనస్థాపానికి గురైన రజిని ఆస్పత్రిలోని ఓ గదిలో గల మెట్ ఫార్విన్ 500 ఎంజి 4 షుగర్ మాత్రలు మింగి ఆత్మహత్య యత్నానికి పాల్పడింది గమనించిన సిబ్బంది రజినీకి కు తాత్కాలిక వైద్యం అందించారు. ఈ విషయమై రజిని మాట్లాడుతూ ఆస్పత్రిలో గత కొద్ది రోజులుగా ఇద్దరి వైద్యులు తన విధి నిర్వహణ విషయంలో చాలా ఇబ్బంది పెడుతున్నారని కంటతడి పెట్టారు. చిన్న ఉద్యోగం మీదే బ్రతికే తాను వైద్యుల వేధింపులు భరించలేక గత కొద్ది రోజులుగా తీవ్ర మనస్తవం చెందానని శ్రీ అయినప్పటికీ వైద్యులతీరు ఇబ్బందులు తాళలేకఆత్మహత్య చేసుకోనిచనిపోవాలని నిర్ణయించుకున్నాననీ ఆమె తెలిపారు. వెల్దుర్తి ప్రభుత్వాసుపత్రిలో ఉన్న మహిళ డాక్టర్లు సిబ్బందిని చాలా వేధిస్తున్నారని ఆరోపణ వినిపిస్తున్నాయి.వైద్యుల వేధింపులు భరించలేక ఇక్కడ పని చేసిన ఓఎఎన్ఎం తనఉద్యోగం మానేసినట్లు తెలిసింది అలాగే సిబ్బంది కూడా వైద్యులు పెట్టే ఇబ్బందులు బయటకు చెప్పకుండా సెలవు పై లేదా బదిలీలు చేసుకోవాలని ఆలోచనలో ఉన్నట్లు ఆస్పత్రిలో పనిచేసే కొందరు సిబ్బంది తెలిపారు. జిల్లా వైద్య శాఖ యంత్రాంగం ఆసుపత్రిలో సిబ్బందిని వేధిస్తున్న డాక్టర్ల తీరూ పై విచారణ జరిపిచర్యలు తీసుకోవాలని పలువురు గ్రామస్తులు కోరుతున్నారు. ఆత్మహత్య యత్నానికి పాల్పడిన ఎఎన్ఎంకు మెరుగైన చికిత్స అందించేందుకు 108 అంబులెన్స్ లో మెదక్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## గ్రామ అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తా..



**ఊర్కొండ, మార్చి 27 (జనం సాక్షి) :** గ్రామ అభివృద్ధి లక్ష్యంగా నిరంతరం ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని రాచాలపల్లి సర్పంచ్ మాడుగుల మహేష్ తెలియజేశారు. జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి సహకారంతో శుక్రవారం రోజు సి సీ రోడ్డు స్థానిక నాయకులతో కలిసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాచాలపల్లి గ్రామంలో ప్రతి వీధిని సిసి రోడ్లుగా మారుస్తామని స్థానిక ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి సహాయ సహకారాలతో గ్రామాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసినందుకు ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వెంకటస్వామి, తాజా మాజీ ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు తదితరులు ఉన్నారు.

# దేవాదుల పంపు హౌస్‌ను పరిశీలించిన జలశక్తి మంత్రిత్వ శాఖ కార్యదర్శి కాంతారావు



**హనుమకొండ ప్రతినిధి, మార్చి 27 (జనంసాక్షి) :** హనుమకొండ జిల్లా హసన్ పర్తి మండలం దేవన్నపేట శివారులోని దేవాదుల పంప్ హౌస్ తోపాటు ధర్మసాగర్ లోని రిజర్వాయర్, సౌత్ మెయిన్ కెనాల్ ను కేంద్ర జల శక్తి మంత్రిత్వ శాఖ కార్యదర్శి వి ఎల్ కాంతారావు శుక్రవారం సందర్శించారు. దేవన్నపేట పంప్ హౌస్, ధర్మసాగర్ సౌత్ మెయిన్ కెనాల్ వివరాలను అధికారులు కేంద్ర జల శక్తి మంత్రిత్వ శాఖ కార్యదర్శి కి వివరించారు. ప్రాజెక్టుకు సంబంధించిన భూ సేకరణ ప్రక్రియను త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలని కేంద్ర జల శక్తి మంత్రిత్వ శాఖ కార్యదర్శి వి ఎల్ కాంతారావు అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్ అండ్ అర్ కమిషనర్ శివకుమార్ నాయుడు, కేంద్ర జల శక్తి మంత్రిత్వ శాఖ సీనియర్ జాయింట్ కమిషనర్ కుల్దీప్ సింగ్, సిడబ్ల్యుసి డైరెక్టర్ శ్రీనివాస్, హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, ఇఎన్సీ జనరల్ రమేష్ బాబు, చీఫ్ ఇంజనీర్ సుధీర్, ఇరిగేషన్ ఎస్ ఈ రాం ప్రసాద్, ఈఈలు సీతారాం,మంగీలాల్, హనుమకొండ ఆర్డిఓ రాథోడ్ రమేష్, జిల్లా సాగునీటిపారుదల శాఖ అధికారి రామ్మోహన్, మెగా ప్రాజెక్టు మేనేజర్ తిరుపతి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# హనుమకొండ ప్రయివేట్ హాస్టల్ భోజనంలో బల్లి

- ఆలస్యంగా వెలుగులోకి ఆందోళన చేసిన విద్యార్థులు..
- జరిమానా విధించి చేతులు దులుపుకున్న సంబంధిత శాఖ అధికారులు



**హనుమకొండ ప్రతినిధి మార్చి 27 (జనం సాక్షి) :** హన్మకొండ నగరంలోని ఓ ప్రయివేట్ హాస్టల్ భోజనంలో బల్లి రావడం తో హాస్టల్ లో ఉంటున్న విద్యార్థులు ఆందోళనకు గురైయ్యారు... భోజనంలో బల్లి వచ్చిన ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది హన్మకొండ భీమారం లోని ఎస్వీఎస్ కళాశాల సమీపంలో ఉన్న శశాంక బాయ్స్ హాస్టల్ లో గురువారం భోజనం లో బల్లి వచ్చింది దింతో ఒక్కసారిగా ఆందోళనకు గురైన హాస్టల్ విద్యార్థులు హాస్టల్ నిర్వాహకులకు చెప్పడంతో వారు విద్యార్థులను సముదాయించే ప్రయత్నం చేసినట్లు తెలిసింది ఇందుకు విద్యార్థులు ససేమిరా అని అధికారులకు పిర్యాదు చేయడంతో హాస్టల్ కు వచ్చి భోజనాన్ని పరిశీలించిన ఫుడ్ ఇన్స్పెక్టర్ హాస్టల్ నిర్వాహకులకు 15వేల రూపాయల జరిమాన విధించినట్లు సమాచారం. ఈ హాస్టల్ ఎప్పుడు వివాదాస్పదంగానే కొనసాగుతున్నట్లు తెలిసింది గతంలో గంజాయి విషయంలో పోలీసులు ఈ హాస్టల్ లో కొందరిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

# వైద్యునిపై దాడి ఘటనలో నిందితులపై కఠిన చర్యలు

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్ బ్యూరో మార్చి27 (జనంసాక్షి) :** జిల్లా కేంద్రంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న వైద్యునిపై గురువారం చోటుచేసుకున్న దాడి ఘటనను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తీవ్రంగా ఖండించారు. ఈ దుశ్చర్యకు పాల్పడిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె స్పష్టం చేశారు. శుక్రవారం ఈ మేరకు ప్రకటన విడుదల చేస్తూ, ఎవరూ చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవడానికి వీల్లేదని హెచ్చరించారు. అరాచకానికి పాల్పడే వారిపై నిర్దాక్షిణ్యంగా వ్యవహరిస్తామని తెలిపారు. ఈ ఘటనపై ఇప్పటికే పూర్తిస్థాయి విచారణ కొనసాగుతోందని, బాధ్యులను గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ ఘటన నేపథ్యంలో జిల్లాలో వైద్య సేవలకు ఎటువంటి అంతరాయం కలగలేదని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు యథావిధిగా పనిచేస్తున్నాయని, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. సాధారణ ఓపీ సేవలతో పాటు అత్యవసర వైద్య సేవలు కూడా నిరంతరాయంగా కొనసాగుతున్నాయని వివరించారు. ప్రజారోగ్యానికి భంగం కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని, వైద్యులకు రక్షణ కల్పించడంతో పాటు శాంతిభద్రతల విషయంలో ఎలాంటి రాజీ ఉండదని కలెక్టర్ స్పష్టం చేశారు.

# హిందువులపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి

- ఎమ్మెల్యే మహేశ్వరెడ్డి



**నిర్మల్ బ్యూరో, మార్చి 27 (జనంసాక్షి) :** రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న శ్రీరామనవమి ఉత్సవాలను ప్రభుత్వం అడ్డుకుంటూ.. అనుమతుల పేరిట ఆంక్షలు విధించడం సరికాదని బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంలో హిందూ వాహిని బజరంగ్దళ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన శ్రీరామ హనుమాన్ శోభాయాత్ర కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ఎస్పి జానకి షర్మిల బాధ్యతలు తీసుకున్నాక హిందూ పండుగలపై వివక్ష కొనసాగుతోందని ఆరోపించారు. ప్రతి పండుగకు ఏదో విధంగా కక్ష్య సాధింపు చర్యలు తీసుకుంటుందని ఫైర్ అయ్యారు. హిందూ పండుగలపై ఈ ఎస్పీకి ఎందుకింత ద్వేషమని ప్రశ్నించారు. హనుమాన్ మాలధారణ స్వాములను జైలుకు పంపిన ఘనత జిల్లా ఎస్పీదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలో డాక్టర్ పై దాడి చేసిన వ్యక్తులను ఇప్పటివరకు ఎందుకు అరెస్టు చేయలేదని పోలీసులను ప్రశ్నించారు. బాసర ట్రిపుల్ ఐటీలో విద్యార్థులపై ఎస్పి మాట్లాడిన భాషను తీవ్రంగా ఖండిస్తున్నారని తెలిపారు. ఎస్పీపై అసెంబ్లీలో ప్రీ మోషన్ (తీర్మానం) ప్రవేశపెడతానని అన్నారు. ఇప్పటికైనా హిందువులపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని హెచ్చరించారు. నిర్మల్ నియోజకవర్గంలో హిందువులకు అన్యాయం జరగనివ్వనని అన్నారు.

# శ్రీ భద్రకాళి అమ్మవారికి లక్ష గులాబీలతో అర్చన



**వరంగల్ ఈస్ట్, మార్చి 27 (జనం సాక్షి) :** చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానంలో వసంత నవరాత్ర మహోత్సవ ములు తొమ్మిదవ రోజుకు చేరుకున్నాయి. తొమ్మిదవ రోజు కార్యక్రమాలలో శుక్రవారం భాగంగా ఉదయం సుప్రభాత సేవ, నిత్యాహ్నికం జరుపడిన పిమ్మట కల్పోక్త ప్రకారం వసంత నవరాత్ర ఉత్సవాల సందర్భం గా జరుపవలసిన విశేష జపహూ మార్చనాభిషేకములు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి గులాబీ పూలతో లక్షపుష్పార్చన జరిపి అమ్మవారికి నివేదనలు సమర్పించి భక్తులకు ప్రసాద వితరణ జరిపారు. ఈ రోజు అమ్మవారికి జరుపబడిన లక్షపుష్పార్చన ఉభయదాతలు వరంగల్ పశ్చిమ నియోజక వర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి-నీలిమ దంపతుల సౌజన్యంతో నిర్వహింపబడింది. ఆలయానికి విచ్చేసిన ఎం.ఎల్.ఏ రాజేందర్ రెడ్డి కి ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త ధర్మకర్తల మండలి చైర్మన్ డా॥ శివసుబ్రహ్మణ్యం, ధర్మకర్త గాండ్ల స్రవంతి, పాలడుగుల ఆంజనేయులు, ప్రధానార్చకులు భద్రకాళి శేషులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. తొలుతగా అమ్మవారికి పూజాదికములు నిర్వహించి ఈ రోజు లక్ష పుష్పార్చనకు ఉభయదాతలైన ఎం.ఎల్.ఏ నాయిని రాజేందర్ రెడ్డి కి లక్షపుష్పార్చన క్రతువు నిర్వహింజేశారు. అనంతరం అమ్మవారికి పుష్పాలను వెదురుబుట్టలలో తీసుకొని అర్చన నిర్వహింపజేశారు. అనంతరం అమ్మవారి శేషవస్త్రములు బహూకరించి ప్రసాదములు అందజేశారు. శుక్రవారం కావడంతో భక్తులు అమ్మవారి దర్శనానికి పోటెత్తారు.

# కనుల పండువగా శ్రీ సీతారాముల కళ్యాణం

- భక్తులతో కిక్కిరిసిన ఆలయాలు
- పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే





**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా వ్యాప్తంగా శ్రీ సీతారాముల కళ్యాణ వేడుకలు శుక్రవారం కనులపండువగా జరిగాయి. అభిజిత్ లగ్నంలో రాముడు, జగన్మాత సీతమ్మ మెడలో మాంగళ్యధారణ ఘట్టం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆయా మండలాల్లో జరిగిన వేడుకల్లో ఆలయాల అర్చకులు, వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ఆ దేవ దేవుడి కల్యాణ వైభోగాన్ని కనులారా వీక్షించి భక్తులు పులకించారు. మేళ తాళాలు, భక్తుల జయజయ ధ్వానాల మధ్య ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా వేదిక వద్దకు తీసుకరాగా, స్వామివారికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పట్టు వస్త్రాలు సమర్పించారు. అర్చకులు కల్యాణ సామగ్రికి సంప్రోక్షణ గావించి రక్షాబంధనం నిర్వహించి యోక్త్రధారణ చేశారు. ప్రత్యేకంగా అల్లిన తాడుని సీతమ్మవారికి అలంకరించారు. సీతారాములకు రక్తాబంధనం కట్టి స్వామి గృహస్త ధర్మం కోసం యజ్ఞోప వితరణ చేసి కన్యావరణ నిర్వహించి తాంబూలాది సత్కారాలు అందించారు. స్వామివారి పాదప్రక్షాళన చేసి మహాదానలు సమర్పించారు. భక్త రామదాసు సమర్పించిన పచ్చలహారం, ఆభరణాలను ఉత్సవ మూర్తులకు అలంకరించారు. కల్యాణ వైభవంను చాటుతూ చూర్ణికను పఠించిన అనంతరం వేద మంత్రోచ్చారణాలు మార్మోగుతుండగా జీలకర్ర, బెల్లం మిశ్రమాన్ని సీతరాముల శిరస్సుపై ఉంచారు. ఈ కల్యాణ కమనీయ వేడుకను కనులారా భక్తులు వీక్షించి తన్మయత్వం పొందారు. భక్తుల రామ నామస్మరణ మధ్య జగదభిరాముడు జానకమ్మను మనువాడాడు. రాముడు దోసిట తలంబ్రాలు నీలపురాసులుగా జానకి దోసిట తలంబ్రాలు మనిమాణిక్యాలై సాక్ష్యాత్కరించిన వేళ సీతారాముల పరిణయ ఘట్టం ముగిసింది. అనంతరం ఉత్సవ మూర్తులను పల్లకిలో ఊరేగించి గుడిలోకి తీసుకవెళ్లారు. భూపాలపల్లి నియోజకవర్గ పరిధిలోని రేగొండ మండలం చెన్నాపురం (రూపురెడ్డిపల్లి) గ్రామంలో శుక్రవారం జరిగిన సీతారాముల కళ్యాణ మహోత్సవం సందర్భంగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం రేగొండ మండలంలోని రావులపల్లి, పెద్దంపల్లి గ్రామాలలో శ్రీరామనవమి సందర్భంగా దేవాలయాల్లో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. గణపురం మండలం బుద్ధారం గ్రామంలో సీతారాముల కళ్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పద్మ దంపతులు పాల్గొని పూజలు చేశారు. భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలో జరిగిన రాములోరి కళ్యాణ వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ స్వామివారి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, పాడి పంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య వైస్ చైర్మన్, అంబాల శ్రీనివాస్, సింగరేణి జీఎం రాజేశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

**ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి పూజలు..**

భూపాలపల్లి పట్టణంలోని సుభాష్ కాలనీ, ఖాసీంపల్లి సెగ్గంపల్లిలో జరిగిన శ్రీ సీతారామ కళ్యాణ వేడుకలకు మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ, శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనా చారి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయా వేడుకల్లో స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**కళ్యాణ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే దంపతులు..**

రాములోరి కళ్యాణ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, జ్యోతి దంపతులు పాల్గొని పూజలు చేశారు. భూపాలపల్లి మంజూరునగర్‌లోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శ్రీ రామ నవమి సందర్భంగా శ్రీ సీతారామ చంద్ర స్వామి కళ్యాణ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా కనులపండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి, జ్యోతి దంపతులు పాల్గొని భక్తులకు తీర్థ ప్రసాదాలు, కళ్యాణ తలంబ్రాలు పంపిణీ చేయడంతో పాటు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

# పదో తరగతి విద్యార్థులు పరీక్షల్లో ఉన్నతంగా రాణించాలి

- మధ్యాహ్న భోజనంపై సమగ్ర పరిశీలన
- పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి పరీక్షల సన్నద్ధతపై ఆరా
- విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి
- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**పాలకుర్తి. మార్చి 27 (జనంసాక్షి) :** పదవ తరగతి విద్యార్థులు పరీక్షలు బాగా రాసి, చదువులో ఉన్నతంగా రాణించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకాక్షించారు. శుక్రవారం, జిల్లాలోని పాలకుర్తి మండల కేంద్రం పరిధిలో గల సాంఘీక సంక్షేమ రెసిడెన్షియల్ (బాలికల) పాఠశాలను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సందర్శించి, ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా పాఠశాలలోని కిచెన్ (వంటశాల)ను, భోజన శాలను ప్రత్యేకంగా పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకంపై కలెక్టర్ సమగ్ర తనిఖీ నిర్వహించారు. వంట చేసే విధానం, ఆహారం ఉడికించే విధానం, ఉపయోగిస్తున్న బియ్యాన్ని, పప్పులు, ఉల్లిగడ్డలు, తదితర సరుకుల నాణ్యతను పరిశీలించారు. వంటశాలలో పరిశుభ్రత పై ప్రత్యేక దృష్టి సారిస్తూ, అన్ని పాత్రలు, వంట గది పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఆహారం తయారీలో కూడా నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, విద్యార్థులకు నాణ్యమైన పోషకాహారం అందేలా చూడాలని ఆదేశిం చారు. ఆహారం రుచిగా, శుభ్రంగా, సమయానికి అందించాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, మధ్యాహ్న భోజన పథకాన్ని అత్యంత జాగ్రత్తగా అమలు చేయాలని స్పష్టం చేశారు. అలాగే విద్యార్థుల, ఉపాధ్యాయు ల హాజరు వివరాలను పరిశీలించారు. ఈ మేరకు మధ్యాహ్న భోజనానికి సంబంధించిన కుకింగ్ సిబ్బంది పనితీరును కూడా పరిశీలించి, పలు సూచనలు చేశారు. పదో తరగతి విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడారు. రేపటి పరీక్షల నేపథ్యంలో వారు ఎలా సిద్ధమవుతున్నారో అడిగి తెలుసు కున్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో శ్రద్ధగా చదువుకుంటూ, ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు హాజరై, మంచి ఫలితాలు సాధించాలని కలెక్టర్ సూచించారు. ఈ తనిఖీలో ప్రిన్సిపల్ స్వరూప, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీరాముని జీవితం అందరికీ ఆదర్శనీయం

- రాష్ట్ర కార్మిక మంత్రి గడ్డం వివేకానంద




**మంచిర్యాల ప్రతినిధి, మార్చి 27 (జనంసాక్షి) :** శ్రీరాముని జీవితం మన అందరికీ ఆదర్శనీయమని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. శుక్రవారం శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని మంచిర్యాల జిల్లాలోని మందమర్రి మండలం పాలచెట్టు ప్రాంతంలో గల శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో నిర్వహించిన శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవానికి రాష్ట్ర మంత్రి సతీమణి, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మండల తహసిల్దార్ సతీష్, మున్సిపల్ కమిషనర్ రాజలింగు లతో కలిసి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ.. శ్రీరాముని ఆశీస్సులతో ప్రజలకు సేవలు అందిస్తామని తెలిపారు. శ్రీరాముడు నీతి, నిజాయితీ ఆచరించి ఆదర్శనీయంగా నిలిచారని, ఆధ్యాత్మిక మార్గం ద్వారా మనశాంతి కలుగుతుందని తెలిపారు. శ్రీరాముని ఆశయాలను అందరం అనుసరించాలని తెలిపారు. చెన్నూర్ నియోజకవర్గ పరిధిలో ప్రజల సౌకర్యార్థం సి సి రహదారులు, మురుగు కాలువ వ్యవస్థను అభివృద్ధి చేసి ప్రజలకు వేసవిలో త్రాగునీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మందమర్రి మున్సిపల్ పరిధిలో 30 కోట్ల రూపాయల వ్యయంతో పనులు చేపట్టడం జరుగుతుందని, ప్రజల సమస్యలను పరిష్కరించే దిశగా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ.., ఒక మనిషి జీవన విధానాన్ని శ్రీరాముడు ఆచరించి చూపారని, నీతి, నిజాయితీ కలిగి ఉండాలని తెలిపారు. శ్రీరాముడు ఆచరించిన జీవన విధానం అందరికీ ఆదర్శంగా నిలిచిందని తెలిపారు. శ్రీరాముడి స్పూర్తితో జిల్లా, రాష్ట్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని తెలిపారు. అనంతరం రాష్ట్ర మంత్రి జిల్లాలోని క్యాతనపల్లి, మందమర్రి మున్సిపాలిటీ, జైపూర్, భీమారం, చెన్నూర్, కోటపల్లి మండలాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమాలకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్ ముందు ఆందోళన చేసిన 8 మందిపై కేసు

**చెన్నారావుపేట, మార్చి 27 (జనం సాక్షి) :** పోలీస్ స్టేషన్ ముందు ఆందోళన చేపట్టిన 8 మందిపై కేసు నమోదు చేసినట్లు చెన్నారావుపేట ఎస్సై రాజేష్ రెడ్డి శుక్రవారం తెలిపారు. జల్లి గ్రామానికి చెందిన మంచాల సురేష్ ను కులం పేరుతో దూషిస్తూ తీవ్రంగా కొట్టిన అదే గ్రామానికి చెందిన దొంతరబోయిన కొమ్మాలు, అతని కుమారులు రాజేందర్, నరేష్, సురేష్ లను ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో అరెస్టు చేసి రిమాండ్ కు తరలిస్తున్న క్రమంలో గ్రామ సర్పంచ్ యాట సుధాకర్, ఉప సర్పంచ్ మెరుగు బాబు, కాట కుమారస్వామి, క్రాంతి, శరత్, మల్లేశం, సుజాతలతో పాటు తదితరులు జైలుకు తరలిస్తున్న పోలీసు ఎస్కార్డు వాహనాన్ని అడ్డుకున్నారన్నారు. పోలీసు సిబ్బందితో దురుసుగా ప్రవర్తిస్తూ ఎలాంటి అనుమతి లేకుండా పోలీస్ స్టేషన్ ముందు ఆందోళన చేపట్టినట్లు తెలిపారు. ఏసీపీ వాహనాన్ని సైతం అడ్డుకున్నట్లు పేర్కొన్నారు. ఈ ఘటన మాజీ ఎంపీపీ జక్క అశోక్ ప్రోత్బలంతో జరిగిందని ఏఎస్ఐ లక్ష్మణమూర్తి ఫిర్యాదు మేరకు 8 మందిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేష్ రెడ్డి తెలిపారు.

## తులం బంగారం, వెండి నగదు అపహరణ

**నేరడిగొండ, మార్చి 27 (జనంసాక్షి) :** మండల కేంద్రంలో తాళం వేసి ఉన్న ఒక ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి భారీగా బంగారం,వెండి ఆభరణాలతో పాటు నగదును దొంగిలించిన సంఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల తెలిపిన వివరాల మేరకు నేరడిగొండ గ్రామానికి చెందిన జాదవ్ భీమారావు, ఉపాధి హామీ ఈ సిగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ నెల 26న ఉదయం 11:00 గంటల సమయంలో తన కుమార్తెకు ప్రసవ వేదన రావడంతో, చికిత్స నిమిత్తం భార్యా భర్తలిద్దరూ ఇంటికి తాళం వేసి ఆమెను ఆదిలాబాద్ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. 27న తెల్లవారుజామున సుమారు 03:30 గంటలకు భీమారావు కుమారుడు హైదరా బాద్ నుండి ఇంటికి చేరుకోగా, ఇంటి తాళాలు పగులగొట్టి ఉండటం గమనించాడు. లోపలికి వెళ్లి చూడగా బీరువా తెరిచి ఉండటమే కాకుండా సామాన్లన్నీ చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. ఉదయం 06:00 గంటలకు కుటుంబ సభ్యులు ఇంటికి చేరుకుని పరిశీలించారు. బీరువాలో ఉన్న వస్తువులు తులం కమ్మలు, 2 తులాల నల్లపూసల హారం, 9 గ్రాముల చైన్, 5 గ్రాముల మరో రెండు జతల కమ్మలు, 11.5 తులాల వెండి పట్టీలు, రూ. 10,000 దొంగిలించబడినట్లు పేర్కొన్నారు.

# అక్రమ కార్యకలాపాలపై పోలీసుల కఠిన చర్యలు

- అక్రమ ఇసుక రవాణా పై ప్రత్యేక నిఘా
- కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ నీతికా పంత్



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, మార్చ్ 27(జనంసాక్షి):** జిల్లాలోని ఇస్గాం పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న వ్యక్తుల వద్ద నుండి డబ్బులు వసూలు చేస్తున్న ముగ్గురిపై ఎక్స్ టార్షన్ కేసులు నమోదు చేశామని, జిల్లాలో అక్రమ కార్యకలాపాలు చేసే వారిపై జిల్లా పోలీస్ శాఖ చట్టపరమైన చర్యలు తీసుకుంటుందని జిల్లా ఎస్పీ నీతికా పంత్ తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టమైన ఆదేశాల మేరకు జిల్లాలో అక్రమ ఇసుక రవాణా, ఇతర చట్ట విరుద్ధ కార్యకలాపాలు నిర్వహించే వారిపై పోలీస్ శాఖ కఠినంగా వ్యవహరిస్తూ చట్టపరమైన చర్యలు తీసుకుంటుందని ఎస్పీ స్పష్టం చేశారు. గత రెండు రోజులలో జిల్లావ్యాప్తంగా అక్రమ ఇసుక రవాణా పై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, ఇస్గాం పోలీస్ స్టేషన్ పరిధిలో ఆరు కేసులు, కాగజ్ నగర్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మూడు కేసులు, కౌటాల పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక కేసు, కెరమరిలో ఒక కేసు, బెజ్జూర్ లో ఒక కేసు నమోదు చేసి, సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇస్గాం పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్స్ టార్షన్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఇస్గాం పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ డ్రైవర్లను బెదిరించి డబ్బులు వసూలు చేసిన ఘటనలపై రెండు ఎక్స్ టార్షన్ కేసులు నమోదు చేసినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. అందేలి గ్రామంలో ఒక్కరు, ట్రాక్టర్ డ్రైవర్లను భయపెట్టి డబ్బులు వసూలు చేసినట్లు గుర్తించారు. అలాగే రాసపల్లి గ్రామంలో ఇద్దరు వ్యక్తులు ట్రాక్టర్ డ్రైవర్లను బెదిరించి డబ్బులు వసూలు చేసినట్లు గుర్తించారు. ఈ ఘటనలపై సంబంధిత వ్యక్తులపై ఎక్స్ టార్షన్ కేసులు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. అక్రమంగా ఇతరుల వద్ద నుండి డబ్బులు వసూలు చేయడం, అక్రమ కార్యకలాపాలు నిర్వహించే వారిపై పోలీసులు నిరంతరం ప్రత్యేక నిఘా ఉంటుందని, జిల్లా వ్యాప్తంగా పెట్రోలింగ్ ముమ్మరం చేసి శాంతి భద్రతల పరిరక్షణలో ఎల్లప్పుడూ ముందుండే విధంగా చర్యలు కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలు కూడా అక్రమ కార్యకలాపాలపై అప్రమత్తంగా ఉండి, ఎలాంటి అనుమానాస్పద సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్ కు లేదా డయల్ 100 కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వ్యక్తుల వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
28 మార్చి 2026

# అవంగాపురంలో సమభావనకు దారి కరువు

- ప్రభుత్వ భవనం చుట్టూ అక్రమ కంచెలు
- కబ్జా కోరల్లో కమ్యూనిటీ హాల్ స్థలం..?
- అధికారుల నిర్లక్ష్యంపై గ్రామస్థుల మండిపాటు

మాడుగులపల్లి

**మాడుగులపల్లి, మార్చి 27 (జనం సాక్షి) :** నల్గొండ జిల్లా మాడుగులపల్లి మండల పరిధిలోని అవంగాపురం గ్రామంలో ప్రభుత్వ నిధులతో నిర్మిస్తున్న సమభావన సంఘం భవనానికి గ్రహణం పట్టింది. బహుజన వర్గాల సామాజిక అవసరాల కోసం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ భవన నిర్మాణానికి ఇప్పుడు దారి లేకుండా పోయింది. భవనం చుట్టూ ఉన్న ఖాళీ స్థలాన్ని, వెళ్లే దారిని కొందరు వ్యక్తులు అక్రమంగా ఆక్రమిస్తున్నారని గ్రామంలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది.

### కళ్ళముందే కంచెలు పట్టించుకోని పాలకులు



సమభావన సంఘం భవనం నిర్మిస్తున్న ప్రాంతంలో అక్రమంగా సిమెంట్ స్తంభాలు నాటి, పెన్సింగ్ (కంచె) చుట్టడం ఇప్పుడు ప్రత్యక్ష నిదర్శనంగా కనిపిస్తోంది. భవనానికి వెళ్లే దారిని మూసివేస్తూ, ప్రభుత్వ భూమిని తమ సొంత ఆస్తిలా మార్చుకునే ప్రయత్నం జరుగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. బహిరంగంగానే కబ్జా ప్రయత్నాలు జరుగుతున్నా, స్థానిక పంచాయతీ పాలకవర్గం కానీ, రెవెన్యూ అధికారులు కానీ స్పందించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### దారి లేకపోతే భవనం ఎవరి కోసం?

లక్షల రూపాయల ప్రజా ధనంతో నిర్మిస్తున్న ఈ భవనానికి దారి లేకపోతే అది ఎందుకు ఉపయోగపడుతుందని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. భవిష్యత్తులో ఈ భవనం కేవలం షో పీస్‌గా మిగిలిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే జిల్లా ఉన్నతాధికారులు, మండల రెవెన్యూ యంత్రాంగం స్పందించి, ఆక్రమణలను తొలగించి భవనానికి స్పష్టమైన దారి సౌకర్యం కల్పించాలని అవంగాపురం గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని పలువురు గ్రామస్తులు హెచ్చరిస్తున్నారు.

## కొండపల్లి మాధవికి డాక్టరేట్ ప్రదానం



**పెనుబల్లి, మార్చి 27 (జనం సాక్షి) :** మండల పరిధిలోని వెన్నవల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కొండపల్లి శ్రీమన్నారాయణ కుమార్తె కొండపల్లి మాధవి ఐఐటి హైదరాబాద్లో పిహెచ్డి పూర్తి చేయడంతో డాక్టరేట్ ప్రధానం చేశారు. ప్రాథమిక విద్య, నుండి పదవ తరగతి వరకు వెన్నవల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసించారు. తదుపరి ఖమ్మంలో ఇంటర్మీడియట్, ఇంజనీరింగ్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి, అనంతరం హైదరాబాదులో ఎంటెక్ పూర్తి చేశారు. ఇదే నేపథ్యంలో ప్రొఫెసర్ సి. కృష్ణ మోహన్ పర్యవేక్షణలోఆమె ఐఐటి హైదరాబాదులో పరిశోధన, చేస్తూ మారుతున్న వాతావరణ పరిస్థితులలో స్వయంప్రతిపత్త డ్రైవింగ్ కోసం ఒక ఏకీకృత పర్సెప్షన్ పైప్‌లైన్‌ను అభివృద్ధి చేస్తుంది. ఇందులో డేటాసెట్ సృష్టి, అంచనా, గుర్తింపు, విభజన, దృష్టి-భాషా అవగాహన , పునరుద్ధరణ వంటి అంశాలు ఉంటాయి. ఇది నిరంతర వాతావరణ మార్పులను నిర్వహించడం పర్యవేక్షణలో తన పీహెచ్‌డీ థీసిస్‌ను విజయవంతంగా సమర్పించినందుకు డాక్టర్ కొండపల్లి మాధవికి సీఎస్ఈ ఐఐటీ అభినందనలు తెలియజేస్తోంది. ఆమె భవిష్యత్ ప్రయత్నాలకు శుభాకాంక్షలు తెలిపారు మండలంలోని వె న్నవల్లిగ్రామానికి చెందిన కొండపల్లి మాధవి ఐఐటి లో పీహెచ్డీ సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మట్టారాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, అభినందనలు తెలిపారు. అదే విధంగా గ్రామంలోని ప్రముఖులు డాక్టర్ మాధవికి అభినందనలు తెలిపారు.

## వంట గ్యాస్ కోసం తిరగబడ్డ జనం...



**నారాయణఖేడ్, మార్చి 27 (జనం సాక్షి) :** రెండు దేశాల మధ్య యుద్ధ పరిస్థితులు నెలకొనడంతో భారత్ లో గ్యాస్ సరఫరాలో అంతరాయం ఏర్పడిందన్న ప్రచారం నేపథ్యంలో గ్యాస్ కొరత నారాయణఖేడ్ నియోజకవర్గం లో తీవ్రంగా కనిపిస్తుంది. గత వారం రోజుల నుంచి నియోజకవర్గంలో గోధమ లలో స్టాక్ లేదని చెప్పడంతో గ్యాస్ కొరతా లేదని అధికారులు చెప్పినప్పటికీ ఇక్కడ మాత్రం గ్యాస్ కొరత ఏర్పడుతుంది వినియోగదారులు వాపోయారు. వారం రోజుల నుంచి వంట గ్యాస్ బుకింగ్ చేసుకున్నప్పటికీ ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు గురువారం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. 1/2 కిలోమీటర్ క్యూ లైన్ కట్టినప్పటికీ కండ్ల ముందు నుంచే ఆటోను బ్లాక్ మార్కెట్కు గ్యాస్ తరలిస్తున్నారు. ఇదేమిటని ప్రశ్నించే గ్యాస్ యజమాని పట్టించుకోవడం లేదు. ప్రతిరోజు వచ్చి పోతున్నారు తప్ప ఒక్కరోజు గ్యాస్ లేకపోవడంతో నానా అవస్థలు పడుతున్నారు. బుకింగ్ చేసుకుని వారం రోజులైనప్పటికీ కూడా గ్యాస్ ఇవ్వడం ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదనంతో తెలిపారు. నారాయణఖేడ్ నియోజకవర్గం మనూరు మండలం లోని గ్యాస్ గోదాం దగ్గర వినియోగదారులు పెద్ద ఎత్తున ఉదయం తిరగబడ్డారు. ఉదయం 5 గంటల నుంచి క్యూలైన్లలో వెయ్యి మంది నిలబడ్డారు. ఇలాంటి పరిస్థితి ఎప్పుడు రాలేదని వినియోగదారులు ఆ వేదనం చెందుతున్నారు. గ్యాస్ మాకు ఇవ్వకుండా బ్లాక్ లో రెండు వేలకు అమ్ముకుంటారని గ్యాస్ బుకింగ్ చేసుకున్నప్పటికీ నీకు ఓటిపి రాలేదు ఇవ్వడం లేదని అంటున్నారని, ఉదయం నుంచి మేము వచ్చిన మాకు ఇవ్వకుండా బ్లాక్ లో అమ్ముకుంటున్నారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా సరఫరాల అధికారి స్పందించి న్యాయం చేయాలని పలువురు కోరుతున్నారు.


# లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ సలీం డిమాండ్



**మాడుగులపల్లి, మార్చి 27 (జనం సాక్షి) :** కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని చూస్తున్న నాలుగు లేబర్ కోడ్‌లు పూర్తిగా కార్మిక వ్యతిరేకమని, వాటిని వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ సలీం డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా పరిశ్రమలు, రైస్ మిల్లులలో పనిచేస్తున్న కార్మికుల స్థితిగతులను అధ్యయనం చేసే కార్యక్రమంలో భాగంగా ఆయన శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా మాడుగుల పల్లి మండలం కుక్కడం గ్రామంలో విశాఖ ఇండస్ట్రీస్‌లో ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కార్మికులు ఎంతో పోరాడి సాధించుకున్న హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తోందని విమర్శించారు. కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ తీసుకొచ్చిన ఈ లేబర్ కోడ్‌ల వల్ల కార్మికుల భద్రత, వేతనాలు ప్రమాదంలో పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో గ్యాస్, డీజిల్, పెట్రోల్ నిల్వలు పుష్కలంగా ఉన్నాయని పాలకులు చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో సామాన్యులు క్యూ లైన్లలో నిలబడాల్సిన దుస్థితి ఏర్పడిందని సలీం మండిపడ్డారు. నిల్వలు ఉన్నప్పటికీ కావాలనే కృత్రిమ కొరత సృష్టిస్తున్న వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. రైతులు, కార్మికులు, మహిళలు నిత్యావసరాల కోసం గంటల తరబడి వేచి చూడాల్సి రావడం పాలకుల వైఫల్యమేనని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు రొండి శ్రీనివాస్, విశాఖ పర్మినెంట్ ఎంప్లాయి యూనియన్ ప్రతినిధులు బొంగర్ల మల్లయ్య, సయ్యద్, బొంగర్ల సోమయ్య, విశాఖ కాంట్రాక్ట్ ఎంప్లాయి యూనియన్ ప్రతినిధులు శ్రీధర్, కొండల్, నయీం, లక్ష్మయ్య, అలాగే సురేష్, శ్రీను, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించిన ఎమ్మెల్యే



**చింతపల్లి, మార్చి 27 (జనం సాక్షి) :** చింతపల్లి మండలం మోదుగుల మల్లేపల్లి గ్రామంలో శ్రీ శ్రీ శ్రీ కూర్మాచల సీతారామచంద్రస్వామి జాతర సందర్భంగా ఏర్పాటుచేసిన ఓపెన్ క్రికెట్ టోర్నమెంట్ ని దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలునాయక్ ప్రారంభించారు... ఆయన మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ ప్రతీఒక్కరు క్రీడల్లో పాల్గొనాలన్నారు. తద్వారా శారీరకంగా దృఢంగా ఉండటానికి దోహదపడుతుందన్నారు. ప్రభుత్వం క్రీడలకు ప్రోత్సాహం అందిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, గ్రామ సర్పంచ్ ముద్దం మల్లేష్ గౌడ్, గ్రామ పాలకవర్గం మరియు గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

# నేత్రపర్వంగా సీతారాముల కళ్యాణం



**సూర్యాపేట, మార్చి 27 (జనంసాక్షి) :** శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని సకల మానవాళికి ఆదర్శ దంపతులైన సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని లోక కళ్యాణార్థం జిల్లా కేంద్రంలోని అలంకార్ సెంటర్లో శ్రీ సీతారామ వసంత కళ్యాణ మహోత్సవ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కళ్యాణ వేదికపై అర్చక స్వాములు సీతారాముల కళ్యాణ క్రతువును శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, రాష్ట్ర టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పోతు భాస్కర్ తో పాటు పలువురు ప్రముఖులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం శ్రీరామ పల్లకి సేవా ఊరేగింపును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ షఫీఉల్లా, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, కౌన్సిలర్లు వెలుగు వెంకన్న, దిలీప్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ కక్కిరేణి శ్రీనివాస్, పార్టీ పట్టణ అధ్యక్షులు ఎండి.అంజద్ అలీ,ఎలిమినేటి అభినయ్ ఉత్సవ కమిటీ అధ్యక్షులు మీలా మహదేవ్, ప్రధాన కార్యదర్శి తోట శ్యాంప్రసాద్,సుధా బ్యాంక్ ఎండీ పెద్దిరెడ్డి గణేష్, కమిటీ ఉపాధ్యక్షులు కాసం జగన్, గుడిపాటి సురేష్, సంయుక్త కార్యదర్శులు పోతుగంటి మనోహర్,బుర్ల మధు, వందనపు రజినీకాంత్, జూలకంటి ఉదయ్, నడిపల్లి ప్రవీణ్, మహంకాళి రమేష్, గుడిపాటి రమేష్, యామా లక్ష్మీనారాయణ,వీరవెల్లి విజయ శంకర్, గుండా శంకర్, పాలవరపు రంగనాథ్, తోట శ్రీనివాస్, మురారిశెట్టి శ్రీధర్, గరినే ఏకాంబరం తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సీతారాముల కల్యాణం



**భువనగిరి టౌన్, మార్చి 27 (జనం సాక్షి) :** శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని భువనగిరి పట్టణంలో శ్రీ సీతారాముల కల్యాణ వేడుకలు ఘనంగా నిర్వహించారు. నల్లగొండ చౌరస్తాలోని రామాలయం, పచ్చలకట్ట సోమేశ్వరాలయం, కిల్లా నగర్‌లోని అంజనాద్రి వీరాంజనేయ స్వామి ఆలయం, అలాగే శ్రీ సీతారామాంజనేయ సహిత సంతోషిమాత ఆలయం, వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య అంగరంగ వైభవంగా కళ్యాణోత్సవాలు జరిగాయి. అనంతరం భక్తులకు తులసి ప్రసాదం, అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్, వైస్ చైర్‌పర్సన్ పోతంశెట్టి మంజుల వెంకటేశ్వర్లు, మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్, ఆలయ చైర్మన్లు, స్థానిక కౌన్సిలర్లు, నాయకులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## రైతులకు స్ప్రింక్లర్ పైపుల పంపిణీ



**నాగర్‌కర్నూల్, మార్చి 27 (జనంసాక్షి) :** నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నాగర్ కర్నూల్ మండలానికి చెందిన రైతులకు స్ప్రింక్లర్ పైపులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి, ఈ కార్యక్రమంలో రైతులతో ఆత్మీయంగా ముచ్చటిస్తూ, ఆధునిక సాగు పద్ధతులను ఉపయోగించి నీటి సంరక్షణతో పాటు దిగుబడులు పెంచుకోవాలని సూచించారు. రైతుల అభ్యున్నతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పంచముఖ ఆంజనేయ స్వామి వారి విగ్రహ ఆవిష్కరణ



**సూర్యాపేట, మార్చి 27 (జనంసాక్షి) :** జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ నగర్ లో గల రామాలయంలో శుక్రవారం శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని సీతారామచంద్ర స్వామి వారి వసంత కళ్యాణ మహోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించడంతో పాటు పంచముఖ ఆంజనేయ స్వామి వారి విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం సీతారామచంద్ర స్వామి వారి వసంత కళ్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు. సాయంత్రం స్వామివారి శోభాయాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా రామాలయం కమిటీ వారు మాట్లాడుతూ దాతల సహకారంతో రెండు నెలల్లోనే దేవాలయ ఆధునీకరణతో పాటు పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు. ఈ వేడుకల నిర్వహణకు సహకరించిన దాతలందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ వేడుకల్లో మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది,వైస్ ఛైర్మన్ ఎండీ.షఫీ వుల్లా, కౌన్సిలర్ బైరబోయిన శ్రీదేవి శ్రీనివాస్, దేవాలయ గౌరవ అధ్యక్షులు మీలా మహదేవ్, అధ్యక్షులు గుండా శ్రీధర్, ప్రధాన కార్యదర్శి ఉప్పల సత్యనారాయణ, కోశాధికారి మానస్ స్వర్ణ సింగ్, రాచర్ల కమలాకర్,కక్కిరేణి చంద్రశేఖర్, చల్లా లక్ష్మీకాంత్, బొజ్జ లక్ష్మయ్య, కృష్ణ, వినయ్, జానీ,గుండా రమేష్, తదితరులు పాల్గొన్నారు.


## చలివేంద్రాన్ని ప్రారంభించిన గ్రామ సర్పంచ్ వంగాల శ్రీనివాస్ రెడ్డి




**పి.ఏ.పల్లి, మార్చి 27 (జనంసాక్షి) :** పి.ఏ.పల్లి మండల కేంద్రంలో వేసవికాలంలో మండల ప్రజల దాహార్తిని తీర్చేందుకు సూర్య హాస్పిటల్ ఎండి,కాంగ్రెస్ నాయకులు పాల్వాయి వెంకట్ రెడ్డి మానవతా దృక్పథంతో తన సొంత ఖర్చులతో చలివేంద్రం కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచ్ వంగాల శ్రీనివాస్ రెడ్డి హాజరై చలివేంద్రం కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ముందుకు వచ్చిన సూర్య హాస్పిటల్ ఎండి.కాంగ్రెస్ నాయకులు పాల్వాయి వెంకట్ రెడ్డి కి పి.ఏ.పల్లి గ్రామ ప్రజల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు,స్థానిక నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీ సీతారామచంద్రస్వామి వారి కళ్యాణ వేడుకలు

**సూర్యాపేట, మార్చి 27 (జనంసాక్షి) :** జిల్లా కేంద్రంలో శుక్రవారం శ్రీరామనవమి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. బొడ్రాయి బజారులోని శ్రీ వేదాంత భజన మందిరం వద్ద ఏర్పాటు చేసిన కళ్యాణ మండపంలో శ్రీ సీతారామచంద్రస్వామి వారి కళ్యాణంను కన్నుల పండువగా జరిగింది. నుదుటన కళ్యాణ తిలకం,బుగ్గన దిష్టి చుక్కతో కళ్యాణ సీతమ్మ, సర్వాలంకరణతో శ్రీరామచంద్రుడు మెరిసిపోయారు. ఉదయం ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి మంగళ వాయిద్యాలు, వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ కళ్యాణ మండపానికి తీసుకుని రావడంతో కళ్యాణ వేడుకలు ప్రారంభమయ్యాయి. అంతకు ముందు సంప్రోక్షణ, ఆరాధనలు,యజ్ఞ ప్రవేశం, వరపూజ,ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం జీలకర బెల్లం సీతారాములపై ఉంచి,శ్రీ రామ నామ స్మరణ నడుమ మాంగల్య ధారణ కార్యక్రమాన్ని వేద పండితులు దరూరి సింగరాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. సకల గుణాభిరాముడి కళ్యాణ వైభవాన్ని చూసి భక్తులు తరించిపోయారు. కళ్యాణ వేడుకలకు భక్తులు భారీగా తరలివచ్చారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కళ్యాణ వేడుకల్లో ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, రాష్ట్ర టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి,వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పోతు భాస్కర్,మాజీ మున్సిపల్ ఛైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ,మొరిశెట్టి శ్రీనివాస్ తో పాటు పలువురు ప్రముఖులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ వార్డుల కౌన్సిలర్లు, నాయకులు, మందిర అధ్యక్షులు రాచర్ల వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి నకరికంటి రాజశేఖర్,కోశాధికారి సోమ అశోక్ తదితరులు పాల్గొన్నారు.



## కుక్కల దాడిలో బాలునికి గాయాలు...

- తక్షణ స్పందనతో చికిత్సకు చర్యలు



**భువనగిరి టౌన్, మార్చి 27 (జనం సాక్షి) :** భువనగిరి పట్టణంలోని 31వ వార్డు తారకరామారావు నగర్‌లో ఇమాన్స్ అనే బాలుడిపై వీధి కుక్కలు దాడి చేసిన ఘటన ఆందోళనకు గురి చేసింది. ఈ ఘటనపై మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ వెంటనే స్పందించి, బాలుడిని ఏరియా హాస్పిటల్‌లో పరామర్శించారు. భువనగిరి శాసనసభ్యుడు కుంభం అనిల్ కుమార్ రెడ్డి సూచనల మేరకు మెరుగైన చికిత్స కోసం బాలుడిని హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రికి తరలించారు. జిల్లా కలెక్టర్, ఆర్డీవో, ఎమ్మార్వో, మున్సిపల్ కమిషనర్‌లను ఆసుపత్రికి పిలిపించి బాలుడికి అత్యుత్తమ వైద్యం అందేలా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా చికిత్స కోసం తక్షణంగా రూ.50 వేల ఆర్థిక సహాయం 31వ వార్డు కౌన్సిలర్ బర్రె సంఘవి కరుణాకర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ పట్టణంలో వీధి కుక్కల సమస్యపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చిన్నపిల్లలను ఒంటరిగా బయటకు పంపకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.




# మళ్లీ బేర్‌మన్న మార్కెట్లు

## రూ.9లక్షల కోట్లు ఆవిరి

**న్యూఢిల్లీ:**దేశీయ మార్కెట్ల రెండు రోజుల లాభాల జోరుకు బ్రేక్ పడింది. పశ్చిమాసియాలో యుద్ధం ముగింపుపై అనిశ్చితులు, భగ్గుమన్న చమురు ధరలతో శుక్రవారం స్టాక్ మార్కెట్లు కుప్పకూలాయి. సెన్సెక్స్ 1600 పాయింట్లకు పైగా పతనమవ్వగా.. నిఫ్టీ మళ్లీ 23వేల మార్క్ కిందకు దిగజారింది. బీఎస్‌ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.422లక్షల కోట్లకు తగ్గడంతో.. ఈ ఒక్క రోజే మదుపర్ల సంపద దాదాపు రూ.9లక్షల కోట్ల మేర ఆవిరైంది.అంతర్జాతీయ మార్కెట్ల ప్రతికూల సంకేతాలతో నేటి ట్రేడింగ్‌ను సూచీలు నష్టాలతో ప్రారంభించాయి. 74,883 పాయింట్ల వద్ద మొదలైన సెన్సెక్స్ అంతకంతకూ దిగజారుతూనే ఉంది. ఇంట్రాడేలో 73,534.41 కనిష్ఠ స్థాయిని తాకిన సూచీ.. చివరకు 1690.23 పాయింట్ల నష్టంతో 73,583.22 వద్ద స్థిరపడింది. అటు నిఫ్టీ 486.85 పాయింట్లు పతనమై 22,819.60 వద్ద ముగిసింది.ఎన్‌ఎస్‌ఈలో శ్రీరామ్ ఫైనాన్స్, టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, రిలయన్స్ ఇండస్ట్రీస్, బజాజ్ ఫైనాన్స్ షేర్లు నష్టపోయాయి. ఓఎన్జీసీ, టీసీఎస్, విప్రో, భారతీ ఎయిర్‌టెల్, కోల్ ఇండియా స్వల్పంగా లాభపడ్డాయి.



ప్రభుత్వ రంగ బ్యాంకింగ్, రియల్టీ షేర్లు 3శాతం మేర పతనమయ్యాయి. పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో అంతర్జాతీయంగా చమురు ధరలు మళ్లీ పెరిగాయి. బ్రెంట్ క్రూడ్ ధర 107.97 డాలర్లుగా ఉంది. అటు అంతర్జాతీయ ఈక్విటీల్లో అమ్మకాలు వెల్లువెత్తాయి.రూపాయి విలువ అంతకంతకూ క్షీణిస్తోంది. నేటి ట్రేడింగ్‌లో డాలర్‌తో పోలిస్తే మన రూపాయి విలువ ఏకంగా 86 పైసలు క్షీణించి 94.82 వద్ద సరికొత్త జీవనకాల కనిష్ఠాన్ని తాకింది.కొంతకాలంగా వరుసగా నష్టాల్లోనే ఉన్న స్టాక్ మార్కెట్లు.. గత రెండు సెషన్లలో లాభపడ్డాయి. దీంతో నేటి ట్రేడింగ్‌లో మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడం కూడా మార్కెట్ల పతనానికి ఓ కారణమైంది.

## మరో 5 లక్షలకు పైగా ఇండక్షన్ స్టవ్‌ల సరఫరా

### టెండర్లను పిలిచే యోచనలో ఈఈఎస్‌ఎల్


**న్యూఢిల్లీ:**రెండు విడతల్లో 5 లక్షల ఇండక్షన్ స్టవ్‌ల సరఫరా కోసం కొత్తగా టెండర్లు పిలిచే యోచనలో ప్రభుత్వ రంగ సంస్థ ఎనర్జీ ఎఫీషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఈఎస్‌ఎల్) ఉన్నట్లు తెలుస్తోంది. పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో,



వంటగ్యాస్ (ఎల్‌పీజీ) సరఫరాపై ప్రభావం పడటంతో విదరి?యుత్తు సాయంతో వంట చేసుకునే ఉపకరణాలకు గిరాకీ పెరిగింది. గిరాకీకి తగ్గట్లుగా సరఫరా పెంచేందుకు ఇటీవలే లక్ష ఇండక్షన్ స్టవ్‌లకు టెండర్ ప్రక్రియను ఈఈఎస్‌ఎల్ పూర్తి చేసింది. పలు రాష్ట్రాల ప్రభుత్వాలు, వినియోగదారుల అభిప్రాయాలు సేకరించి, ఇండక్షన్ ఆధారిత వంట సామగ్రికీ టెండర్ ప్రక్రియను నిర్వహించింది.'ప్రస్తుతం మార్కెట్లో వినియోగదార్ల నుంచి వస్తున్న అధిక స్పందనను దృష్టిలో ఉంచుకుని, దాదాపు 5 లక్షల ఇండక్షన్ స్టవ్‌లకు కొత్తగా టెండర్లు ఆహ్వానించాలని ఈఈఎస్‌ఎల్ భావిస్తోంద'ని అధికారిక వర్గాలు వెల్లడించాయి.

## బయోకాన్ కొత్త ఎండీ, సీఈవోగా శ్రీహాస్..


**న్యూఢిల్లీ:**బయోకాన్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈవోగా శ్రీహాస్ ప్రదీప్ తాంబేని నియమించనున్నట్టు సంస్థ వెల్లడించింది. ఇప్పటివరకు ఈ పదవిలో ఉన్న సిద్ధార్థ్ మిత్తల్ రాజీనామా చేయగా, దానికి బోర్డు ఆమోదం తెలిపింది. ఈ పరిణామాలతో ఔషధ తయారీ సంస్థల షేర్లు నేడు స్వలంగా నష్టాల్లో ఉన్నాయి.శ్రీహాస్ ఏప్రిల్ 1 నుంచి బయోకాన్ బాధ్యతలు స్వీకరించనున్నారు. మరోవైపు చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ ముఖేష్ కామత్ కూడా తన పదవికి రాజీనామా చేశారు. ఆ స్థానంలో కేదార్ నారాయణ్ ఉపాధ్యేను కంపెనీ నియమించనుంది. ఈ నియామకాలకు సంబంధించి బయోకాన్ ఓ ప్రకటన విడుదల చేసింది. దీంతో నేటి మార్కెట్లో ఈ ఔషధ తయారీ సంస్థ షేర్లు పడిపోయాయి. ఓ దశలో దాదాపు 3శాతానికి పైగా కుంగి రూ.368.20కు చేరాయి. ప్రస్తుతం మధ్యాహ్నం సమయంలో 2 శాతం నష్టంతో ట్రేడవుతున్నాయి.




## 2026-27లో భారత వృద్ధి 7.1%

### అంచనాలు పెంచిన ఎస్ అండ్ పీ

దిల్లీ: వచ్చే ఆర్థిక సంవత్సరం (2026-27)లో భారత వృద్ధి 7.1 శాతానికి పెరగొచ్చని ఎస్ అండ్ పీ గ్లోబల్ రేటింగ్స్ అంచనా వేసింది. ప్రైవేట్ వినియోగం, పెట్టుబడులు, ఎగుమతులు ఇందుకు దోహదపడతాయని తాజా త్రైమాసిక ఆసియా-పసిఫిక్ ఆర్థిక వివరాల్లో తెలిపింది.కీలక అంచనాలు ఇలా: 2026-27లో వాస్తవ జీడీపీ వృద్ధి 7.1 శాతంగా ఉండొచ్చని ఎస్ అండ్ పీ అంచనా వేసింది. 2025-26లో 7.6 శాతంగా ఉంటుందని పేర్కొంది. 2025-26 వృద్ధి అంచనాలను 0.4 శాతం పెంచి 7.6 శాతానికి, 2026-27 అంచనాలను 0.2 శాతం పెంచి 7.1 శాతానికి సవరించింది. 2026-27లో ద్రవ్యోల్బణం తక్కువ స్థాయుల నుంచి 4.3 శాతానికి పెరుగుతుందని భావిస్తోంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) వడ్డీ రేట్లను స్థిరంగా ఉంచొచ్చని, తటస్థ వైఖరిని పాటించొచ్చని ఎస్ అండ్ పీ అంచనా వేస్తోంది. చమురు ధర పెరిగితే వడ్డీ రేట్ల పెంపు: భారత ఆర్థిక వ్యవస్థపై చమురు ధరల ప్రభావం పడే అవకాశం ఉంది. పెరిగిన ముడిచమురు ధరల వల్ల వాణిజ్య లోటు పెరగొచ్చు. కానీ సేవల వాణిజ్యంలో మిగులు కారణంగా కరెంటు ఖాతా లోటు అదుపులో ఉంటుంది. చమురు ధరలు పెరిగితే సబ్సిడీ ఖర్చులను నియంత్రించడానికి మన దేశంలో ఇంధన ధరలను పెంచొచ్చు. ప్రాథమిక అంచ నాల ప్రకారం జూన్ త్రైమాసికంలో బ్యారెల్ బ్రెంట్ చమురు సగటున 92 డాలర్లు, 2026లో 80 డాలర్లుగా ఉండొచ్చని ఎస్ అండ్ పీ భావిస్తోంది. ఒక వేళ ప్రతికూల పరిస్థితులు ఎదురై చమురు ధర జూన్ త్రైమాసికంలో సగటున 185 డాలర్లకు చేరితే, ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడానికి రిజర్వ్ బ్యాంక్ కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉందని ఎస్ అండ్ పీ పేర్కొంది. ఇదే జరిగితే ఈ ఏడాది ద్వితీయార్థంలో 25 బేసిస్ పాయింట్ల (0.25%) మేర రేట్ల పెంపు ఉండొచ్చని తెలిపింది. వచ్చే ఆర్థిక సంవత్సరం ప్రథమార్థంలో ఇ-కామర్స్, టెక్ స్టార్టప్‌ల నియామకాలు 4.7 శాతం మేరకు వృద్ధి చెందే అవకాశం ఉందని ఒక నివేదిక వెల్లడించింది. ఉద్యోగాల కల్పన పట్ల సానుకూల దృక్పథం ప్రధానంగా భారీ సంస్థల్లోనే ఎక్కువగా కనిపిస్తోంది. నియామకాలను పెంచేందుకు వీటిలో 74 శాతం వరకూ మొగ్గు చూపిస్తున్నాయని టీమ్‌లీజ్ సర్వీసెస్ ప్రాజెక్ట్స్ విడుదల చేసిన 'ఎంప్లాయిమెంట్ అవుట్‌లుక్ రిపోర్టు' పేర్కొంది. మధ్య తరహా సంస్థల్లో ఇది 57 శాతంగా, చిన్న వ్యాపార సంస్థల్లో 38 శాతంగా ఉందని తెలిపింది. ఏప్రిల్-సెప్టెంబరు కాలానికి ఇచ్చిన అంచనాల ప్రకారం.. పరిశ్రమల మద్దతుతో డిజిటల్, ఇతర రంగాల్లో సానుకూల వాతావరణం కనిపిస్తోందని పేర్కొంది.



ముఖ్యంగా ఇ-కామర్స్, టెక్ స్టార్టప్ రంగాలు అత్యధికంగా 8.9 శాతంతో ముందు వరుసలో ఉండగా, ఆ తర్వాతి స్థానాల్లో ఆరోగ్య సంరక్షణ, ఔషధ, తయారీ, ఇంజినీరింగ్, మౌలిక సదుపాయాల రంగాలు ఉన్నట్లు నివేదిక వివరించింది. ఈ ఆరు నెలల కాలంలో మొత్తం మీద నికర ఉపాధి 4.7 శాతంగా ఉంటుందని పేర్కొంది.

## విమాన సంస్థలకు త్వరలో మంచి రోజులు: డీజీసీఏ

దిల్లీ: విమానయాన సంస్థలు సులభంగా వ్యాపారం చేసుకునేందుకు, అవి వృద్ధి చెందేందుకు తగిన మద్దతు ఇస్తున్నామని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) పేర్కొంది. ప్రయాణికుల హక్కుల పరిరక్షణకూ తగిన చర్యలు తీసుకుంటున్నామని డీజీసీఏ అధిపతి ఫయాజ్ అహ్మద్ కిద్వాయ్ పేర్కొన్నారు. యుద్ధాల కారణంగా కొన్ని దేశాలు గగనతల ఆంక్షలు విధించడంతో, అంతర్జాతీయ మార్గాల్లో ఎక్కువ దూరం ప్రయాణించాల్సి రావడం, విమాన ఇంధనం (ఏటీఎఫ్) ధరతో పాటు కార్యకలాపాల వ్యయాలు పెరగడం వంటి సవాళ్లను విమానయాన కంపెనీలు ప్రస్తుతం ఎదుర్కొంటున్నాయన్నారు. త్వరలో మంచి రోజులు రావొచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. భారత పౌర విమానయాన మార్కెట్ వృద్ధి కోసం డీజీసీఏ, పౌర విమానయాన మంత్రిత్వ శాఖ పలు చర్యలు తీసుకుంటున్నాయి. డిసెంబరులో ఇండిగో విమాన కార్యకలాపాలకు పెద్దఎత్తున అంతరాయం ఏర్పడిన సందర్భాల్లో, ఇతర సంస్థల విమాన టికెట్ల ధరలు మరీ పెరగకుండా విధించిన గరిష్ఠ పరిమితి ఆంక్షలను ఇటీవల సంస్థ తొలగించింది కూడా. ఎయిరిండియా అధికారిపై చర్యలు: గత వారం వాంకోవర్ (కెనడా)కు అనుమతి ఉన్న విమానం బదులు ఇంకొక విమానాన్ని పంపిన నేపథ్యంలో దిద్దుబాటు చర్యలు తీసుకోవాల్సిందిగా ఎయిరిండియాకు డీజీసీఏ సూచించింది. ఇందుకు బాధ్యుడైన అధికారిపై చర్యలు తీసుకుంది.

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
| --- | --- |
| ₹ 5.15 | ₹ 5.17 |

### బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| | |
| --- | --- |
| ₹ 1,32,650 (22 క్యారెట్లు) | ₹ 1,44,710 (24 క్యారెట్లు) |

### వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 2,45,000

# పెంటగాన్‌లో ఏం జరుగుతోంది?

## ప్రాంతంలో మళ్లీ పెద్దఎత్తున పిజ్జా ఆర్డర్లు..!

**న్యూఢిల్లీ:**హర్మూజ్ జలసంధిని తెరిచే విషయమై ఇరాన్‌కు నిర్దేశించిన గడువును మరో 10 రోజులపాటు పొడిగించినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే పశ్చిమాసియాకు అమెరికా తన పదాతిదళాలను పంపే ఆలోచనలో ఉన్నట్లు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వస్తున్నాయి. అదనపు సైనిక బలగాల సమీకరణకు కావాల్సిన సమయం కోసం.. గడువు పెంపు అనేది ట్రంప్ ఎత్తుగడ కావొచ్చని కొంతమంది విశ్లేషకులు భావిస్తున్నారు.ఈ క్రమంలోనే పెంటగాన్ ప్రాంతంలో ఓ పరిణామంఈ క్రమంలోనే పెంటగాన్ ప్రాంతంలో ఓ పరిణామం చర్చనీయాంశంగా మారింది. గురువారం సాయంత్రం ఈ ప్రాంతంలో పిజ్జా ఆర్డర్లు అనూహ్యంగా పెరిగాయని స్థానికంగా వీటి డెలివరీలను ట్రాక్ చేసే ఓ వెబ్‌సైట్ పేర్కొంది. పాపా జాన్స్ ఆర్డర్లలో 296 శాతం, డొమినోస్‌లో 208 శాతం, పిజాటోలో 200 శాతం పెరుగుదల నమోదైనట్లు 'ఎక్స్' వేదికగా ఓ పోస్టు పెట్టింది. పెంటగాన్ చుట్టుపక్కల పిజ్జా ఆర్డర్లు పెరిగాయంటే ప్రపంచంలో ఏదో మూల అలజడి మొదలైనట్టేననే ప్రచారం ఎప్పట్నుంచో ఉంది. ఇటీవల వెనెజువెలాపై అమెరికా బలగాల దాడి సమయంలోనూ ఇలాగే ఆర్డర్లు



పెరిగాయి.1970వ దశకంలో సోవియట్ గూఢచారులు అర్ధరాత్రి వేళ ఫుడ్ డెలివరీల సరళిని పర్యవేక్షించేవారు. సాధారణంగా ఇటువంటి పరిణామాలు.. అమెరికా సైన్యం తీసుకోనున్న పెద్ద చర్యలకు సంకేతాలుగా ఉండేవి. ఈ నేపథ్యంలోనే.. అమెరికా సైన్యం ఏదో పెద్ద ప్రణాళిక రచిస్తోందని, ఈ క్రమంలోనే సమావేశాలు జరుగుతున్నాయనే దానికి తాజాగా పెంటగాన్ సమీపంలో పెద్దఎత్తున పిజ్జా ఆర్డర్లను సంకేతాలుగా విశ్లేషిస్తున్నారు. దీనిపై శాస్త్రీయ ఆధారాలు లేనప్పటికీ.. గతంలో ఈ తరహా పరిశీలనలు నిరూపితమయ్యాయనే వాదనలు ఉన్నాయి.సాధారణంగా అమెరికా సైనిక ఆపరేషన్లు, అత్యవసర సమయాల్లో.. రక్షణశాఖ, ఇంటెలిజెన్స్ అధికారులు రాత్రంతా ఆఫీసుల్లోనే ఉండి విధులు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఆ సమయంలో వారు క్విక్ ఫుడ్ డెలివరీలపైనే ఆధారపడతారని, అందుకే పెంటగాన్ చుట్టుపక్కల పిజ్జా డెలివరీలు పెరుగుతాయనేది ఈ 'పెంటగాన్ పిజ్జా థియరీ' సారాంశం.

# ప్రమాదంలో సబ్‌సీ కేబుళ్లు



## ఇంటర్నెట్ సేవలపై కేంద్రం ఆరా..!

**న్యూఢిల్లీ:**పశ్చిమాసియాలో కొనసాగుతోన్న ఉద్రిక్తతల నేపథ్యంలో హర్మూజ్‌లోని కేబుళ్లను ఇరాన్.. ఎర్ర సముద్రంలోని బాబ్ అల్ మందేబ్ జలసంధిలోని సముద్రగర్భ కేబుళ్లను హూతీలు టార్గెట్ చేసే అవకాశం ఉన్నట్లు పలు దేశాలు ఆందోళన వ్యక్తంచేస్తున్నాయి. వీడియో కాల్స్, ఈమెయిల్స్, బ్యాంకింగ్ లావాదేవీలు, ఏఐ సర్వీసులు వంటివి కొనసాగించడానికి ప్రపంచ ఇంటర్నెట్‌కు ఈ కేబుళ్లు అత్యంత కీలకమైనవి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం సబ్‌సీ కేబుల్ ఆపరేటర్లు, టెలికాం కంపెనీలకు కీలక ఆదేశాలు జారీ చేసింది. సముద్ర కేబుళ్లలో అంతరాయం ఏర్పడితే భారత్‌కు కలిగే నష్టాన్ని అంచనా వేసి, అందుకు తగిన ప్రణాళికలు రూపొందించాలని కేంద్ర టెలికాం కంపెనీలను, సముద్రగర్భ కేబుల్ ఆపరేటర్లను కేంద్రం కోరినట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. ఈ మేరకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్స్ పలు కంపెనీల ప్రతినిధులతో సమావేశం అయినట్లు తెలిపాయి. భారత్ నుంచి అమెరికా, యూరప్‌లకు వెళ్లే డేటా ట్రాఫిక్‌లో దాదాపు మూడింట ఒక వంతుకు హర్మూజ్ జలసంధి ఒక కీలక మార్గంగా ఉందని అధికారులు పేర్కొన్నారు. దానిలో కొంత ట్రాఫిక్‌ను సింగపూర్ మీదుగా మళ్లించగలిగినప్పటికీ ఆ సామర్థ్యం పరిమితంగా ఉందన్నారు.అంతేకాకుండా దీనికి అయ్యే ఖర్చు కూడా ఎక్కువని తెలిపారు. పసిఫిక్‌ను ప్రత్యామ్నాయ మార్గంగా తీసుకున్నా అది సుదీర్ఘంగా ఉండడం వల్ల డేటా ప్రాసెసింగ్ వేగం నెమ్మదిస్తుందన్నారు. సముద్రగర్భ మౌలిక సదుపాయాల భద్రతను నిర్ధరించడానికి ఇరాన్‌తో దౌత్య చర్చలు జరపాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. దాడుల వల్ల సముద్రంలోని అంతర్నిర్మిత నెట్‌వర్క్ కేబుళ్లు పూర్తిగా ధ్వంసమయ్యే అవకాశం లేదని భారతీయ సమాచార కమ్యూనికేషన్ టెక్నాలజీ సంస్థ అధికారి హర్షరామ్ తెలిపారు. కేబుళ్లు దెబ్బతినడం వల్ల ఏదైనా అంతరాయం ఏర్పడితే ఆర్థిక లావాదేవీలు, సోషల్ మీడియా, ఈ-కామర్స్, ఐటీ కార్యకలాపాలపై ప్రభావం పడొచ్చన్నారు. ఇక, ఇటీవలి ఉద్రిక్తతల దృష్ట్యా కేబుల్స్‌కు మరమ్మతులు చేపట్టే నౌకలు కూడా తమ విధులను నిలిపివేసినట్లు తెలుస్తోంది. దీంతో ఇప్పటికే టాటా కమ్యూనికేషన్స్‌కు చెందిన టీజీఎన్-గల్ఫ్, ఎయిర్‌టెల్ సహా ఇతర నెట్‌వర్క్‌లు, జెడ్డా సమీపంలోని ఫ్లాగ్ టెలికాంకు సంబంధించిన ఫాల్కన్ కేబుల్స్ ప్రభావితమైనట్లు తెలుస్తోంది. రిలయన్స్ జియో, గ్లోబల్ టెక్ సంస్థలకు సంబంధించిన పలు కొత్త కేబుళ్లు అదే కారిడార్ వెంబడి నిర్మాణంలో ఉన్నాయి.



## వైట్‌హౌస్ క్రిప్టిక్ పోస్టులు.. దేని గురించో?

**వాషింగ్టన్:**పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న వేళ.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రోజుకో ప్రకటన చేస్తున్నారు. ఈ క్రమంలో అధ్యక్ష కార్యాలయం వైట్‌హౌస్ కూడా వినూత్న రీతిలో పోస్టులు పెట్టింది. 'మరికొన్ని గంటల్లో అద్భుతమైన ప్రకటన వెలువడుతుందనే' అర్థం వచ్చేలా ఓ వీడియోను షేర్ చేసింది. దీనికి హుష్.. అంటూ ఓ ఎమోజీని జతచేసింది.ట్రంప్, జేడీ వాన్స్‌తోపాటు మరో వ్యక్తి అస్పష్ట ఇమేజ్‌లను వైట్‌హౌస్ అధికారిక ఎక్స్, ఇన్‌స్టా ఖాతాల్లో పెట్టింది. ఇలా అధ్యక్ష కార్యాలయం క్రిప్టిక్ పోస్టులు పెట్టడాన్ని నెటిజన్లు ఆసక్తిగా గమనిస్తున్నారు. అది ఇరాన్ యుద్ధం గురించే ఉండవచ్చుంటూ చర్చించుకుంటున్నారు. ఇదిలాఉంటే, ఇరాన్‌పై కొన్ని రోజుల పాటు దాడులు చేయబోమని అధ్యక్షుడు ట్రంప్ ప్రకటిస్తుండగా.. ఇందుకు భిన్నంగా వైట్‌హౌస్ పోస్టులు ఉండటం గమనార్హం.

# నిపుణుల కంటే ఏఐతో పని చౌక

- ప్రస్తుతం భద్రమైన వ్యవస్థ లేదు
- బోధనా పద్ధతులు మారాలి
- ఓపెన్‌ఏఐ సీఈఓ శామ్ ఆల్ట్‌మన్

**వాషింగ్టన్:**నిపుణులతో పోలిస్తే, కృత్రిమ మేధ(ఏఐ)తో మేధోపరమైన పనులు చౌకగా నిర్వహిం చుకునేలా అడుగులు పడుతున్నాయని ఓపెన్‌ఏఐ సీఈఓ శామ్ ఆల్ట్‌మన్ పేర్కొన్నారు. 'ఇన్‌ఫరెన్స్' దశలో ఉన్న ఏఐ మోడళ్లను పనిచేయించే విషయంలో.. నిపుణుల వ్యయాల కంటే తక్కువ ఖర్చుతో, వారికి సమానమైన మేధోశక్తితో ఏఐ చేయగలుగుతోందని ఫోర్బ్స్‌కిచ్చిన ఇంటర్వ్యూలో ఆల్ట్‌మన్ పేర్కొన్నారు. విద్యా వ్యవస్థలో బోధనా పద్ధతులు మారకపోతే, విద్యార్థులు ఏఐ టూల్స్‌పై అధికంగా ఆధారపడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..ఏఐకయ్యే శిక్షణ ఖర్చులు, మనుషుల సామర్థ్యం మధ్య పోలికల విషయానికొస్తే.. మానవ మేధకు దశాబ్దాల పాటు బయోలాజికల్ 'శిక్షణ', జీవితకాలం పాటు శక్తి వినియోగం అవసరం. మేధో ఫలితాలను ఒక్కో యూనిట్ ఆధారంగా చూస్తే.. ఏఐ వ్యవస్థలు మెరుగ్గా మారుతున్నాయి. సామర్థ్యం మరింత పెరిగే అవకాశాలూ కనిపిస్తున్నాయి. ఒక్కో పని చొప్పున చూసినా ఏఐ చౌకగానే ఉంటోంది.ఏఐ వల్ల



ఉద్యోగాలు పోవు. నిపుణులు చేసే పని మారుతుంది. ఉద్యోగాలపై ఏఐ చూపే ప్రభావంలో ఏకరూపత ఉండకపోవచ్చు. కొన్ని ఉద్యోగాల్లో పాక్షిక ఆటోమేషన్ కనిపించొచ్చు. మరికొన్ని పూర్తిగా మారిపోవచ్చు. సరికొత్త ఉద్యోగాలూ రావచ్చు. యూట్యూబర్లు, కంటెంట్ క్రియేటర్లు ఇటీవలి వరకూ లేరు.. ఇపుడు ఎక్కువ మంది యువత ఆ బాట పడుతుండడం మనం చూస్తూనే ఉన్నాం. ఉద్యోగం విషయంలో సవాళ్లను ఎదుర్కోవాలంటే, ఇప్పటి నుంచి దశాబ్దం తర్వాత ఎటువంటి నైపుణ్యాలు అవసరమో అంచనా వేయడం ముఖ్యం.ఒకప్పుడు కోడింగ్ అందరికీ అవసరమైన నైపుణ్యం. ఇపుడు ఏఐ టూల్స్‌ను అందిపుచ్చుకోవడం కీలకంగా మారింది. మనకు ఇపుడు నైపుణ్యం అడ్డంకిగా లేదు. వనరులే ముఖ్యం. అందుకే దేశాలు ఏఐ మౌలిక వసతులను స్థానికంగా అభివృద్ధి చేసుకోవాలా, లేదా బయటి ప్రొవైడర్లపై ఆధారపడాలా అన్నది నిర్ణయించుకోవాలి.సాంకేతికతలో మార్పులు రావడం అసలైన సవాలు కాదు. విద్యా వ్యవస్థలు వాటిని అందుపుచ్చుకోవడమే సిసలు సవాలు. బోధనా పద్ధతుల్లో మార్పు రాకపోతే, విద్యార్థులు ఏఐ టూల్స్‌పైనే అధికంగా ఆధారపడే అవకాశం ఉంది. ఏఐ టూల్స్ అందుబాటులో ఉన్నాయన్న విషయాన్ని గుర్తుంచుకుని, అభ్యాస వ్యవస్థలను విమర్శనాత్మక ఆలోచన, సృజనాత్మకత, సమస్య-పరిష్కారాలతో రీడిజైన్ చేయాలి. ఏఐని అందిపుచ్చుకునే విషయంలో భారత్ అత్యంత క్రియాశీలక మార్కెట్‌గా ఉంది. మౌలిక వసతుల నుంచి అప్లికేషన్ల వరకు.. ఇలా పూర్తి స్టాక్‌పై పెట్టుబడులు పెడుతోంది. ఓపెన్‌ఏఐ కోడింగ్ ప్రోడక్ట్‌కు భారత్ అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న మార్కెట్‌గా ఉంది. త్వరలో అతిపెద్ద మార్కెట్‌గానూ మారొచ్చు. సంప్రదాయ ఇంటర్నెట్ సేవలతో పోలిస్తే ఏఐ సేవలను అందించడం చాలా ఖరీదైన వ్యవహారం. అందుకే కంపెనీలు ఆర్థిక ఇబ్బందులు ఎదురుకాకుండా చూసుకోవడం ముఖ్యం. భారత్ వంటి మార్కెట్లను అవి కనుగొనాలి.ఏఐ ఆధారిత వ్యక్తిగత ఏజెంట్లను మరింతగా అందిపుచ్చుకోవడానికి భద్రత, గోప్యత.. అతిపెద్ద సమస్యలుగా ఉన్నాయి. సునిశిత వ్యక్తిగత సమాచారం విషయంలో ప్రస్తుత వ్యవస్థలు అంత నమ్మదగినవి కావు. అందువల్ల వాటికి సమాచారం ఇచ్చే ముందు జాగ్రత్తగా ఉండాలి. ఒక్కసారి భద్రమైన వ్యవస్థలు వచ్చాక, అటువంటి ఏజెంట్లను అందిపుచ్చుకోవడం వేగంగా పెరుగుతుంది.

## పెళ్లైన వ్యక్తి మరో మహిళతో సహజీవనం నేరం కాదు

అహ్మదాబాద్(జనంసాక్షి): పెళ్లైన వ్యక్తి వయోజనురాలైన మహిళ అంగీకారంతో సహజీవనం చేయడం చట్టప్రకారం నేరం కాదని అలహాబాద్ హైకోర్టు తెలిపింది. వ్యక్తిగత హక్కులను పరిరక్షించాల్సిన కోర్టు విధిని సామాజిక నైతికత అధిగమించలేదని అభిప్రాయపడింది. మహిళ కుటుంబం నుంచి బెదిరింపులు ఎదుర్కొంటున్న ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన ఓ సహజీవన జంట తమకు రక్షణ కల్పించాలని అలహాబాద్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన అలహాబాద్ కోర్టు సహజీవనంపై కీలక వ్యాఖ్యలు చేసింది."వివాహితుడైన పురుషుడు వయోజనురాలైన మహిళతో ఆమె అంగీకారంతో సహజీవనం చేస్తున్నప్పుడు అతనిపై ఎలాంటి నేరం మోపడానికి ఆస్కారం లేదు. నైతికతను, చట్టాన్ని వేరుగా ఉంచాలి. చట్టప్రకారం ఎలాంటి నేరం జరగనప్పుడు పౌరుల హక్కులను పరిరక్షించే కోర్టు చర్యలకు సామాజిక అభిప్రాయాలు, నైతికత మార్గదర్శకం కావు. తాను ఇష్టపూర్వకంగా, స్వేచ్ఛతోనే ఆ వ్యక్తితో కలిసి జీవిస్తున్నానని ఆ మహిళ పోలీసు సూపరింటెండెంట్‌కు తెలియజేసింది. అయినప్పటికీ మహిళ కుటుంబం నుంచి పరువు హత్య బెదిరింపులు ఉన్నా పోలీసులు చర్య తీసుకోలేదు. కలిసి జీవిస్తున్న ఇద్దరు వయోజనులను రక్షించడం పోలీసుల విధి. స్పష్టంగా ఈ ఫిర్యాదుపై పోలీసు సూపరింటెండెంట్ ఎటువంటి చర్య తీసుకోలేదు" అని జస్టిస్ జె.జె. మునీర్, జస్టిస్ తరుణ్ సక్సేనాలతో కూడిన అలహాబాద్ హైకోర్టు డివిజన్ బెంచ్ పేర్కొంది.



# సృజనాత్మక వైవిధ్యానికి అద్దం


## ఇండియా ఆర్ట్ ఫెస్టివల్ హైదరాబాద్ 2026



**హైదరాబాద్, (జనంసాక్షి) :**
భారతదేశంలోని ప్రముఖ సమకాలీన కళా ప్రదర్శనల్లో ఒకటైన ఇండియా ఆర్ట్ ఫెస్టివల్ (ఐఏఎఫ్) మరోసారి నగరంలో కళా సంబరాలకు వేదిక కానుంది. ఏప్రిల్ 03 నుండి 05 వరకు జూబ్లీహిల్స్ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించనున్న ఈ వేడుక, ఆధునిక భారతీయ కళల వైవిధ్యాన్ని ప్రతిబింబించే మహోత్స వంగా నిలవనుంది. దేశవ్యాప్తంగా ప్రసిద్ధిగాంచిన గ్యాలరీలతో పాటు, స్వతంత్ర కళాకారులకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన "ఆర్టిస్ట్ పావిలియన్" ఈసారి ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది. ఈ ఏడాది ఫెస్టివల్‌లో 30కు పైగా గ్యాలరీలు పాల్గొనగా, పలు సోలో ప్రాజెక్టులు, ఆర్టిస్టుల కలెక్టివ్ ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. వ్యక్తిగత కళా భావవ్యక్తీకరణలు, కొత్త ప్రయోగాలు, విభిన్న శైలులు ఒకే వేదికపై దర్శనమివ్వన ున్నాయి. ప్రదర్శనలో ఓం థద్కర్ తన మోనోక్రోమ్ డ్రాయింగ్ ల ద్వారా కదలికల్ని అద్భుతంగా చూపిస్తే, డా. షెఫాలి భుజ్‌బల్ అబ్‌స్ట్రాక్ట్ చిత్రాల ద్వారా భావోద్వేగాల లోతును ఆవిష్కరిస్తారు. అశోక్ రాథోడ్ సంప్రదాయ భారతీయ అంశాలను ఆధునిక శైలిలో ప్రతిబింబిస్తారు. కిరణ్ హోట్కర్, ఆయుషి జైన్ భారతీయ పురాణాల ఆధారంగా రంగుల ప్రపంచాన్ని ఆవిష్కరిస్తారు.

**ఆధ్యాత్మికతను ఆధునిక కోణంలో..**

భోపాల్‌కు చెందిన అంజలి ప్రభాకర్ స్త్రీ శక్తిని ప్రతీకాత్మకంగా చూపించే చిత్రాలతో ప్రత్యేక గుర్తింపు పొందారు. ఆమె అబ్‌స్ట్రాక్ట్, ఫిగరేటివ్ శైలుల సమ్మేళనం ద్వారా ఆధ్యాత్మికత, శక్తి అంశాలను ప్రతిబింబిస్తారు. ఫరీదాబాద్‌కు చెందిన సునీతా మెందిరట్టా 30 సంవత్సరాల అనుభవంతో సంప్రదాయం, ఆధునికతను కలిపిన చిత్రాలను సృష్టిస్తున్నారు. ఆమె తాజా సేకరణ హిందూ దేవతల పురాణాల నుంచి ప్రేరణ పొంది, ఆధ్యాత్మికతను ఆధునిక కోణంలో చూపిస్తుంది. కొల్హాపూర్‌కు చెందిన యువరాజ్ పాటిల్ తన అబ్‌స్ట్రాక్ట్ చిత్రాలతో కళాభిమానులను ఆకట్టుకుంటున్నారు. దేశీయ, అంతర్జాతీయ ప్రదర్శనల్లో పాల్గొన్న ఆయన కృతులు విస్తృత ప్రశంసలు అందుకున్నాయి. ఇక జైపూర్‌కు చెందిన అనుజా అగర్వాల్ కళను ఒక స్వేచ్ఛాయుత ప్రక్రియగా భావిస్తూ, భావోద్వేగాలకు రూపం ఇస్తారు. ముంబైకి చెందిన అశోక్ రాథోడ్ పురాణ పాత్రలను బోల్డ్ రంగులతో ప్రతిబింబిస్తారు. ఓం థద్కర్ హైపర్ రియలిస్టిక్ చార్కోల్ కళలో తన ప్రత్యేకతను చాటుతారు. ప్రదీప్ ఘుడ్గే సంప్రదాయ శిక్షణతో కూడిన ఫ్రీలాన్స్ కళాకారుడిగా తన సృజనాత్మకతను కొనసాగిస్తున్నారు.



**పెయింటింగ్ నుంచి మోడర్న్ ఆర్ట్ వరకు..**

ఛత్తీస్‌గఢ్‌కు చెందిన నందిని వర్మ గ్రామీణ జీవనాన్ని రంగుల కథగా చెబుతారు. ప్రకృతి, జానపద సంస్కృతి ప్రభావం ఆమె చిత్రాల్లో స్పష్టంగా కనిపిస్తుంది. శృతి గుప్తా కసానా ఫ్యాషన్ డిజైన్ నుంచి కళారంగానికి తిరిగి వచ్చి, దేశీయ, అంతర్జాతీయ వేదికలపై తన కృతులను ప్రదర్శిస్తున్నారు. ఇక 2005లో స్థాపించబడిన సుధా ఆర్ట్ గ్యాలరీ సంప్రదాయ, ఆధునిక చిత్రాలను రూపొందిస్తూ, దేశీయ, అంతర్జాతీయ మార్కెట్‌లో ప్రత్యేక స్థానం సంపాదించింది. టంజావూర్ పెయింటింగ్ నుంచి మోడర్న్ ఆర్ట్ వరకు విభిన్న కళాఖండాలను అందిస్తూ కళాభిమానులను ఆకట్టుకుంటోంది.

**నగరంలో అతిపెద్ద కళా వేడుక**

మొత్తంగా 3,000కు పైగా కళాఖండాలతో ఈ ఫెస్టివల్ నగరంలో అతిపెద్ద కళా వేడుకగా నిలవనుంది. కళాకారులు, గ్యాలరీలు, కలెక్టర్లు, కళాభిమానులు ఒకే వేదికపై కలుసుకుని భారతీయ సమకాలీన కళల వైవిధ్యాన్ని ఆస్వాదించేందుకు ఇది అరుదైన అవకాశం. ఇండియా ఆర్ట్ ఫెస్టివల్ హైదరాబాద్ 2026 కేవలం ఒక ప్రదర్శన కాకుండా, సృజనాత్మకతకు, సంస్కృతికి, భావవ్యక్తీకరణకు ఒక ఉత్సవంగా నిలవనుంది.



## వయోభారమైనా వృత్తే ప్రాణాధారం

- **70 ఏళ్ల వయసులో తాటి చెట్టు ఎక్కి కల్లు గీస్తున్న గౌడ తాత**
- **కుటుంబ పోషణ కోసం వయసుకు అతీతంగా కష్టపడుతున్న నారాయణస్వామి**

**పెనుబల్లి, మార్చి 27 (జనంసాక్షి) :** 70 ఏళ్ల వయసులోనూ హుషారుగా వంద అడుగుల తాటి చెట్టు ఎక్కి కల్లు గీస్తున్న ఓ గౌడ తాత ఖమ్మం జిల్లా పెను బల్లి గ్రామంలో దృష్టి ఆకర్షిస్తున్నాడు. పెనుబల్లి గ్రామానికి చెందిన 70 ఏళ్ల వంగా నారాయణ స్వామి ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం మూడు తాటి చెట్లు ఎక్కి కల్లు గీస్తూ గౌరవంగా తన జీవనాన్ని కొనసాగి స్తున్నాడు. వృద్ధాప్యంలో వయసుకు తగ్గ చిన్న చిన్న పనులు చేసుకుంటూ భార్య, పిల్లలతో హాయిగా గడపాల్సిన వయసులో, కుటుంబ పోషణ కోసం తన వయసుకు భారమైనా, ప్రమాద భరితమైనా తనకు ఇష్టమైన ఈ వృత్తిని మాత్రమే కొనసాగి స్తున్నాడు. ఎంతటి కష్టమై నా, ఎంతటి ప్రమాద మైనా తన కుటుంబం కోసం ఈ పనిని వదల కుండా ప్రతిరోజూ తాటి చెట్లు ఎక్కుతున్న నారాయ ణస్వామి ధైర్యం, కష్టపడే తత్వం స్థానికులను ఆకట్టుకుంటోంది. తిరుగులేని ఆయురారోగ్యాలతో నారాయణ స్వామి వందేళ్లు జీవించాలని స్థానికులు కోరుకుంటున్నారు. వయసు మీరినా ఇంకా కష్టపడి కుటుంబాన్ని పోషిస్తున్న ఈ తాత జీవితం ఎందరికో స్ఫూర్తిగా నిలుస్తోంది.

### మెడికల్ బోర్డు నిర్వహించకుండా..
## కార్మికులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- **గుర్తింపు ప్రాతినిధ్య సంఘాల వైఖరిని నిరసిస్తూ.. సింగరేణి వ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసనలు**

గోదావరిఖని, జనంసాక్షి : తెలంగాణ ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క అసెంబ్లీ సాక్షిగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడక ముందు 13,0 00 మందికి ఉద్యోగాల్లో తీసుకున్నారని దీనిలో అవకతవకలు జరగాయని పేర్కొనడం హాస్యాస్పదమ ని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జరిగిన నియామకాలు 1900 అని గత 2 సంవత్సరాల కాలంగా విజిలెన్స్, ఏసీబీ విచారణ జరుగుతుందని పేర్కొంటు అనారోగ్యంతో ఉన్న ఉద్యోగులను మెడికల్ బోర్డుకు పిలవకుండా మెడికల్ బోర్డు నిలిపి వేసే ప్రయత్నం కాంగ్రెస్ ప్రభుత్వం, అధికారులు కలిసి చేస్తున్నారని పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే మార్పు వస్తుంది. నెలకు మూడు మెడికల్ బోర్డులు నిర్వహిస్తామని కార్మికులను మభ్యపెట్టి కార్మికుల నెత్తిపై భస్మాసుర హస్తం పెట్టారని ఇప్పటికైనా కార్మికులందరూ అర్థం చేసుకోవాలని అన్నారు. 2000 మంది కార్మికుల సింగరేణి వ్యాప్తంగా అనారోగ్యంతో గత 10 నెలల సర్వీస్ ఉన్నవారు గత సంవత్సర కాలంగా మెడికల్ బోర్డు కొరకు వేచి చూస్తున్నారని తెలిపారు. రెగ్యులర్ మెడికల్ బోర్డు లేక అనేకమంది కార్మికు లు దీర్ఘకాలిక రోగాలతో అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. ఏసిబి, విజిలె న్స పేరిట కాలయాపన చేస్తున్నారని సింగరేణి కార్మిక వర్గమంతా ఆలోచించాలని అన్నారు. సంస్థలో జరుగుతున్న అవినీతి అక్రమాలు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కుంభకోణాల పైన సంస్థ నిధుల దుర్వినియోగం పైన సింగరేణి కార్మిక వర్గమంతా మేల్కొనాలని సూచించారు. పోరాటాలకు సిద్ధం కావాలని సంస్థను పరిరక్షించుకోవాలని అందుకు తగిన పోరాటాలతో పాటు సింగరేణి భవన్ ప్రజాభవన్ ముట్టడి కార్యక్రమానికి కార్మికులందరూ కూడా సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

**నిరసన కార్యక్రమాలు..**

ఈనెల 28న అన్ని మైన్స్ , అన్ని డిపార్ట్మెంట్స్ లో నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమం చేపడుతున్నామనీ అన్నారు.ఈ నెల 30న అన్ని ఏరియాల జిఎం కార్యాలయాల ముందు భారీ ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నామన్నారు. ఈ కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున సింగరేణి ఉద్యోగ సోదరులు పాల్గొన్నాలని సుషించారు.

## కాప్రా తహసీల్దార్ కార్యాలయం వద్ద చలివేంద్రం ఏర్పాటు


**జవహర్ నగర్ మర్చి 27 (జనంసాక్షి ) :** కాప్రా తహసీల్దార్ కార్యాలయం ప్రాంగణంలో వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఏర్పాటు చేసిన చలివేంద్రం ప్రజలకు ఎంతో ఉపశమనం కలిగించే కార్యక్రమంగా నిలిచింది. ఈ చలివేంద్రాన్ని ప్రశాంత్ కార్తీ పీపుల్స్ ఫౌండేషన్ చైర్మన్ ఆలకుంట్ల ప్రశాంత్ కార్తీ ముఖ్య అతిథిగా విచ్చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎండల తీవ్రత రోజురోజుకీ పెరుగుతున్న నేపథ్యంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం ఒక గొప్ప సేవా కార్యక్రమమని తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమా లు సమాజంలో మానవతా విలువలను పెంపొందిస్తాయని అన్నారు. ప్రజలు ఈ చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు.



## కలెక్టర్ హెచ్చరించిన .. ఆగని ఇసుక దందా..!

**పాపన్నపేట, మార్చి 27 (జనంసాక్షి) :**
అసలే పెద్ద మండలం సమస్యలు సైతం ఎక్కువ గానే ఉన్నాయి.! పోలీస్,రెవెన్యూ అధికారులు హెచ్చరిస్తున్న అక్రమార్కుల ఇసుక వ్యాపారం ఆగడం లేదు. ఆరెపల్లి, గాజులగూడెం, చిత్రి యాల్, కొడపాక శివారులో వరుస ఘటన లు చోటుచేసుకుంటున్నాయి. నదిలో నుండి ఇసుక ను ఇష్టా రీతిగా తీసి ప్రకృతి వనరులను కొల్లగొ డుతున్నారు. జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ సైతం హెచ్చరించిన దాడులు ఆగక పోవడం శోచనీ యం. అధికారులు నిఘా పెంచాల్సిన అవసరం ఉందని తెలుస్తోంది. కొడపాక గ్రామ శివారులో అక్రమంగా నిల్వ చేసిన సుమారు 15 ట్రాక్టర్ల ఇసుకను శుక్రవారం సీజ్ చేసినట్లు పాపన్నపేట తహసీల్దార్ సతీష్ కుమార్ తెలిపారు.

## డాక్టర్ సెల్ వైద్య ఆరోగ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ యెన్నం హరికాంత్ రెడ్డి



**వెల్దండ మార్చి 27 ( జనంసాక్షి ) :** మండల కేంద్రానికి చెందిన డాక్టర్ యెన్నం హరికాంత్ రెడ్డి ని గురువారం హైదరాబాద్ గాంధీ భవన్లో కాంగ్రెస్ పార్టీ డాక్టర్ సెల్ వైద్య ఆరోగ్య విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గా నియమించారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎం. రాజీవ్ చేతుల మీదుగా నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ యెన్నం హరికాంత్ రెడ్డి మాట్లాడుతూ నాపై నమ్మకంతో ఈ పదవి బాధ్యతలు అప్పజెప్పిన సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ మహేష్ కుమార్ గౌడ్, సిడబ్ల్యూసి ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్ రెడ్డి, కల్వకుర్తి ఎంఎల్ఏ కసిరెడ్డి నారాయణ రెడ్డి, అచ్చంపేట ఎంఎల్ఏ వంశీ కృష్ణ లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉచిత ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు.కాంగ్రెస్ పార్టీ ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలను నిరుపేద ప్రజలను అందేవిధంగా చూస్తామన్నారు.

## లైంగిక దాడి అమానుషం.. బాధ్యులను శిక్షించాలి

- **బాలిక కుటుంబానికి రూ. 50 లక్షలు పరిహారం ఇవ్వాలి: సిపిఐ**




**వనపర్తి బ్యూరో మార్చి 27 జనం సాక్షి :**
వనపర్తి పట్టణం 22వ వార్డు గణేష్ నగర్ అక్షర స్కూల్ మూడవ తరగతి పసి బాలికపై లైంగిక దాడి అమానవీయమని, నేరంతో ప్రత్యక్షంగా పరోక్షంగా సంబంధం ఉన్న వారిని కఠినంగా శిక్షించాలని సిపిఐ పట్టణ కార్యదర్శి రమేష్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు కళావతమ్మ డిమాండ్ చేశారు. శుక్రవారం రాత్రి సిపిఐ ఆఫీసులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. బాలికపై దాడిని, పాఠశాల యాజమా న్యం బాధ్యత రాహిత్య వైఖరిని ఖండించారు. ఈనెల 23న బాలికపై లైంగిక దాడి జరిగితే నేరాన్ని దాచిపెట్టిన పాఠశాల యాజమాన్యం కూడా నేరస్థులేనన్నారు. జిల్లా కలెక్టర్, డీఈవో స్పందించి పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లైంగిక దాడి కారణంగా బాలిక మానసిక శారీరక ఆరోగ్యం పై ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. ఈ సంఘటన బాలిక భవిష్యత్తు, బాలిక కుటుంబం పై కూడా ప్రభావం చూపుతుందన్నారు. బాలిక ఆరోగ్యం పై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, కుటుంబానికి రూ. 50 లక్షలు ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని, బాలికను ఉన్నత విద్య చదివించి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. బాలికకు న్యాయం జరిగేదాకా సిపిఐ బాధితుల పక్షాన పోరాడుతుందన్నారు. అయితే బాలికకు న్యాయం కోరుతూ అడిగేందుకు వెళ్లిన వారిని అక్రమంగా కేసుల్లో పెట్టారనే ఆరోపణలు ఉన్నాయని పూర్తిస్థాయిలో విచారించి సంబంధం లేని వారిని కేసుల నుంచి తొలగించాలని కోరారు.సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళావతమ్మ, సీనియర్ నేతలు పృథ్వి నాదం, చిన్న కురుమన్న, ఎన్ఎఫ్ఐ డబ్ల్యు పట్టణ కన్వీనర్ జయమ్మ, కమిటీ సభ్యులు జ్యోతి, ఏఐఎస్ఎఫ్ డివిజన్ కార్యదర్శి వంశి తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణం కమనీయం-సీతారాముల కళ్యాణం





- **రామనామ స్మరణతో మారు మ్రోగిన ఇల్లందకుంట..**
- **పట్టువస్త్రాలు తలంబ్రాలు సమర్పించిన మంత్రి పొన్నం**
- **అన్నదానం చేస్తున్న జమ్మికుంట రైస్,కాటన్ మిల్లర్లు**
- **అభినందించిన మంత్రి పొన్నం,ఇంచార్జి ప్రణవ్**

**ఇల్లందకుంట, మార్చి 27 (జనం సాక్షి) :**
అపర భద్రాద్రిగా పేరు పొందిన ఇల్లందకుంట మండల కేంద్రంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో జరిగే శ్రీ రామ నవమి వేడుకల్లో పాల్గొ నడం సంతోషంగా ఉందని ఆ రాముడి దయవల్ల ప్రజలందరు సుఖసం తోషాలతో ఉండాలనీ కోరుకుంటున్నట్లు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ,రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.
శుక్రవారం నాడు శ్రీ సీతారాముల కళ్యాణ వేడుకల్లో పాల్గొని ప్రభుత్వం తరపున స్వామి వారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రా,సిపి గౌస్ ఆలం,కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ తో కలిసి అందజేశారు.అంతకు ముందు స్థానిక కాంగ్రెస్ నాయకులు మంత్రి పొన్నం కు ఘన స్వాగతం పలికారు.కళ్యాణం ఆద్యంతం రామనామ స్మరణతో కమనీయంగా జరిగింది.అనంతరం ఆలయ ఆవరణలో పొన్నం సత్తయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం భక్తులకు ఉచిత మజ్జిగ పంపిణీనీ కార్యక్రమాన్ని ఆయన రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. వేసవి కాలం దృష్టిలో ఉంచుకొని కళ్యాణానికి వచ్చే భక్తులు ఇబ్బందులు కలగకుండా ప్రతి ఏటా ఈ కార్యక్రమాన్ని అందిస్తున్నామని తెలిపారు. కళ్యాణానికి వచ్చిన భక్తులకు జమ్మికుంట రైస్,కాటన్ మిల్లర్లు ప్రతి సంవత్స రం ఉచిత అన్నదానం ఏర్పాటు చేయడం పట్ల మిల్లర్లను ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేష్, ఇల్లందుకుంట ఆలయ చైర్మెన్ ఇంగిలే రామారావు, డైరెక్టర్లు, హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ సుహాసిని, కౌన్సిలర్లు, జమ్మికుంట కౌన్సిలర్లు, జమ్మికుంట, కమలాపూర్, హుజురాబాద్ వ్యవసాయ మార్కెట్ చైర్ పర్సన్, డైరెక్టర్లు, వివిధ గ్రామాల సర్పంచులు, మండల అధ్యక్షులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు,అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**లక్షలాదిగా తరలివచ్చిన జనం..**
**భారీ బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీస్ శాఖ**

అపర భద్రాద్రిలో అంగరంగ వైభవంగా జరిగిన శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం తిలకించడానికి రాష్ట్ర నలుమూలల నుండి లక్షల మంది భక్తులు హాజరై స్వామి వారి కల్యాణ వేడుకను తిలకించారు. భక్తులకు ఎలా ంటి అసౌకర్యం కలగకుండా కరీంనగర్ జిల్లా సిపి ఆదేశాల మేరకు హుజురా బాద్ ఏసిపి వాసప్ శెట్టి మాధవి ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా చల్వ పందిళ్లు మంచినీటి సౌకర్యం కల్పించారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్వామివారి కళ్యాణం ప్రశాంతంగా ముగిసింది.

## రిజర్వాయర్ల పనుల్లో వేగం పెంచాలి

**జలశక్తి మంత్రిత్వ శాఖ కార్యదర్శి కాంతరావు**



**పాలకుర్తి, మార్చి 27(జనంసాక్షి) :**
పాలకుర్తి రిజర్వాయర్ పనుల్లో వేగం పెంచాలని కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ కార్యదర్శి వి.ఎల్. కాంతారావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రిజర్వాయర్ పనులను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ్షరీతో కలిసి కాంతరావు సందర్శించి పరిశీలంచా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిజర్వాయర్ పూర్తయితే ఈ ప్రాంతం సాగునీటి వసతి మెరుగు పడి రైతులకు ఎంతో మేలు జరగుతుంద ని అన్నారు. పనుల విషయంలో జాప్యం చేయకుండా వేగవంతంగా చేపట్టాలని అధికారులను అదేశించారు. రిజర్వాయర్ మ్యాపింగ్ పనులను త్వరి తగతిన పూర్తి చేయాలని సూచించారు. ఆయన వెంట అదికారులు శ్రీకాంత్, ఆర్టీవో డి ఎస్ వెంకన్న. తహసీల్దార్ సరస్వతీ పాల్గొన్నారు.

# ఆపరేషన్ క్రాక్‌డౌన్ 1.0

## భారీ సైబర్ క్రైమ్ నెట్‌వర్క్ గుట్టురట్టు

- **13 మంది నిందితుల అరెస్ట్**
- **వివరాలు వెల్లడించిన పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం**




**కరీంనగర్ బ్యూరో, మార్చి 27 (జనంసాక్షి ):**
సైబర్ నేరగాళ్లకు సహకరిస్తూ, అక్రమ లావాదేవీలకు వేదికగా మారుతున్న 'మ్యూల్ బ్యాంక్ ఖాతాల' నెట్‌వర్క్‌పై కరీంనగర్ పోలీసులు ఉక్కుపాదం మోపారు. "ఆపరేషన్ క్రాక్‌డౌన్ 1.0"లో భాగంగా నిర్వహించిన దర్యాప్తులో 24 మంది నిందితులను గుర్తించగా, అందులో 13 మందిని శుక్రవారం గుర్తించారు అరెస్ట్ చేశారు. ఈ ముఠా ద్వారా సుమారు 138 కోట్ల రూపా యల భారీ లావాదేవీలు జరిగినట్లు పోలీసులు గుర్తించారు.
రత్నాకర్ బ్యాంక్ లిమిటెడ్ (ఆర్‌బిఎల్ ), కో - ఆపరేటివ్ సొసైటీ వంటి వర్చువల్ ఖాతాల ద్వారా జరిగిన మోసాలపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు, నిందితులపై భారత న్యాయ సంహిత (బిఎన్‌ఎస్) సెక్షన్ 112, 318(4) ఐటీ యాక్ట్ సెక్షన్ 66-డి కింద కేసులు నమోదు చేశారు. ఈ ముఠా అత్యంత ప్రణాళికాబద్ధంగా పనిచేస్తూ.. మ్యూల్ ఖాతాల ఏర్పాటును పర్యవేక్షిస్తారు. సామాన్య ప్రజలను డబ్బు ఆశచూపి వారి పేరుతో బ్యాంక్ ఖాతాలు తెరిపిస్తారు. ఈ ఖాతాల ద్వారానే సైబర్ మోసాల సొమ్మును విదేశాలకు మళ్లిస్తారు. కొద్దిపాటి కమిషన్ ఆశతో బ్యాంక్ ఖాతాలను, ఏటీఎం కార్డులను, లాగిన్ వివరాలను ఇతరులకు ఇవ్వవద్దని తెలియని వ్యక్తుల పేరుతో బ్యాంక్ అకౌంట్లు తెరిచి ఇస్తే, మీరు నేరస్థులుగా పరిగణించబడతారని ప్రజలకు పోలీస్ కమిషనర్ విజ్ఞప్తి చేశారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు లేదా www.cybercrime.gov.in లో ఫిర్యాదు చేయలని, తదుపరి దర్యాప్తులో మరిన్ని ఆసక్తికర విషయాలు బయటకు వచ్చే అవకాశం ఉందని పోలీస్ కమిషనర్ తెలిపారు.

**అరెస్ట్ అయినవారు :** బండారి సాయిరాం (30) వెల్గటూర్, అనుమాండ్ల రంజిత్ (36) గోపులాపూర్ - బుగ్గారం, అలిగేటి జగిత్యాల జిల్లా. మల్లేశం (37) ధర్మారం - పెద్దపల్లి జిల్లా. బోగ రాకేష్ (35) జగిత్యాల జిల్లా, బండి ప్రణయ (25) వెదిర - కరీంనగర్ జిల్లా

**బ్యాంకు అధికారులు :** భువనగిరి కళ్యాణ్ (52) హన్మకొండ, ఆర్‌బిఎల్ బ్యాంకు మేనేజర్ వరంగల్ జిల్లా, అయేషా బేగం (30) కరీంనగర్ జిల్లాకు చెందినవారు.

**బ్యాంకు ఖాతాదారులు :** విభూది రాంకుమార్ (37) ధర్మారం పెద్దపల్లి జిల్లా, నతర్ల శ్రీనివాస్ (39) లక్ష్మీపూర్, జగిత్యాల జిల్లా, కర్రే రాజు (35) వరంగల్ జిల్లా, కల్లెడ మహేందర్ (36) జగిత్యాల జిల్లా, కొంద్ర నరహరి (37) జగిత్యాల, కల్లెడ రాజేష్ (27) జగిత్యాల జిల్లాకు చెందినవారు. పైన తెలిపిన వివరాల ప్రకారం వివిధ పదమూడు మందిని అరెస్టు చేశామని పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం తెలిపారు

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
28 మార్చి 2026

# సిర్సపల్లి డంపింగ్ యార్డ్ రద్దు చేయాలి

- అఖిలపక్షం నాయకులు మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి
- ప్రమాదంలో ప్రజా ఆరోగ్యం, పర్యావరణం
- సీఎం రేవంత్ దృష్టికి తీసుకెళ్లాలని కోరిక



**హుజూరాబాద్, మార్చి 27 (జనంసాక్షి) :** హుజూరాబాద్ మండలం సిర్సపల్లి వద్ద ప్రభుత్వం నిర్మించాలనుకుంటున్న డంపింగ్ యార్డును వెంటనే రద్దు చేయాలని, దీని వల్ల కలిగే తీవ్రమైన ప్రమాదాలను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని అఖిలపక్షం నాయకులు మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరారు. శుక్రవారం కరీంనగర్ నుంచి హుజూరాబాద్ మీదుగా ఇల్లంతకుంట వెళ్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌ను అఖిలపక్షం నాయకులు కలిసి డంపింగ్ యార్డ్ టెండర్ ప్రక్రియను రద్దు చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వివిధ రాజకీయ పార్టీల నాయకులు డంపింగ్ యార్డు ఏర్పాటు వల్ల స్థానిక ప్రజలు ఎదుర్కొనే నష్టాలను, ప్రజా ఆరోగ్య సమస్యలను మంత్రికి వివరించారు.
కరీంనగర్, వరంగల్ ఉమ్మడి జిల్లాల మున్సిపాలిటీల పరిధిలోని చెత్తను హుజూరాబాద్‌లో ఏర్పాటు చేయనున్న డంపింగ్ యార్డుకు తరలించడం వల్ల విషపూరిత రసాయనాలు బయటకు వెలువడి, ఈ ప్రాంతంలో వింత వ్యాధులు సోకే ప్రమాదం ఉందని నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. మనుషులు, జంతువులు, పశువులు, పక్షుల ప్రాణాలు హరించుకుపోయే అవకాశం ఉందని వారు ఆందోళన చెందారు. డంపింగ్ యార్డు ఏర్పాటు నిర్ణయాన్ని ప్రభుత్వం రద్దు చేసే వరకు తమ ఉద్యమం కొనసాగుతుందని అఖిలపక్షం నాయకులు స్పష్టం చేశారు. హుజూరాబాద్ ప్రాంతం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీలు, ఇనుగాల పెద్దిరెడ్డి, హుజూరాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జి వొడితెల ప్రణవ్ బాబు తదితర నేతలు ఈ నిరసనలో పాల్గొని, సమస్య తీవ్రతను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి డంపింగ్ యార్డును రద్దు చేయించాలని మంత్రిని కోరారు. మంత్రిని కలిసిన వారిలో మున్సిపల్ చైర్‌పర్సన్ సుహాసిని, అఖిలపక్షం నాయకులు పల్కల ఈశ్వర్ రెడ్డి, వేల్పుల రత్నం, ప్రభాకర్, బండ శ్రీనివాస్, కటుకూరి మల్లారెడ్డి, నర్సింహారెడ్డి, ఎడవెల్లి కొండాల్ రెడ్డి, జనార్ధన్, సమ్మయ్య, బాబు తదితరులు ఉన్నారు.





# రాజన్న సన్నిధిలో శ్రీ సీతారాముల కల్యాణం

- తలంబ్రాలు, పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- 11.50 అభిజిత్ లగ్న సుముహూర్తం
- భారీగా హాజరైన భక్తులు,శివ పార్వతులు, ట్రాన్ జెండర్లు
- సీతారాముల కళ్యాణంలో శివుడిని పెళ్లాడిన శివ పార్వతులు

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి మార్చి 27(జనంసాక్షి) :** హరిహర క్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కళ్యాణోత్సవం అంగ రంగ వైభవంగా జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున ఆధ్వర్యంలో బీసీ రవాణా సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్వామివారికి పట్టు వస్త్రాలు తలంబ్రాలను అందజేశారు. మున్సిపల్ కార్యాలయం నుండి మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు పాలకవర్గం కమిషనర్ సంపత్ ఆధ్వర్యంలో స్వామివారికి పట్టు వస్త్రాలు తలంబ్రాలు అందజేశారు. ఉదయం ఆలయ అర్చకులు అంతరంగికంగా శ్రీ రాజరాజేశ్వర స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి పంచోపనిషత్ ద్వారా అభిషేకాన్ని ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణలతో నిర్వహించారు. రామాలయంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి మూలవిరాట్టుకు ముందుగా ఆలయ ఇంచార్జీ స్థానాచార్యులు ఉమేష్ శర్మ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు కల్యాణ తంతు నిర్విహించారు. అనంతరం ఉత్సవ మూర్తులను ఆలయ గుడి చెరువు పార్కింగ్ స్థలంలోని శివర్చన వేదికపై శ్రీ సీతారామ కళ్యాణాన్ని ఆలయ ఇంచార్జి స్థానాచార్యులు ఉమేష్ శర్మ ఆధ్వర్యంలో అర్చకుల వేదమంత్రాలతో కళ్యాణం నిర్వహించగా, కన్యాదాతలుగా మరుగంటి విజయసారధి కర్ణ దంపతులు వ్యవహరించారు. భక్తులు కల్యాణాన్ని తిలకించేందుకు ఆలయ అధికారులు ఎల్ఈడి స్క్రీన్లు ఏర్పాటు చేశారు. భక్తులు ఎండ వేడిమి తట్టుకునేందుకు చలువ పందిళ్లు,కలకత్తా డెకరేషన్ పందిర్లు ఆలయ పార్కింగ్ అవరణతో పాటు పరిసర ప్రాంతాల్లో ఆలయ అధికారులు ఏర్పాటు చేశారు. కళ్యాణ వేదిక వద్ద 15 ప్రత్యేక జోన్లు ఏర్పాటు చేసి భక్తులను జోన్ల వారీగా కూర్చోబెట్టారు. దాతల సహకారంతో భక్తులకు మజ్జిగ, త్రాగు నీటి ప్యాకెట్లను పంపిణీ చేశారు.సుమారు 40 వేల మంది భక్తులకు పార్కింగ్ స్థలంలో ఆలయం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.శ్రీ సీతారామచంద్ర స్వామి కళ్యాణంలో శివపార్వతులు చేతిలో త్రిశూలానికి బాసింగం కట్టుకొని జీలకర్ర బెల్లం పెట్టుకొని వారు శివుడితో కళ్యాణం అయినట్లు బావించుకొని తలంబ్రాలు పోసుకోవడం ఇక్కడ సనతనంగా కొనసాగుతున్న ఆనవాయితీ.

**ప్రత్యేక ఆకర్షణలో ట్రాంజెండర్లు....**
శ్రీరామనవమి సందర్భంగా వేములవాడలో శ్రీ సీతారామ స్వామి వారి కళ్యాణం జరుగుతున్న క్రమంలో దేశవ్యాప్తంగా ఉన్న ట్రాంజెండర్లు వేములవాడకు చేరుకొని స్వామి వారి కళ్యాణంలో పాల్గొన్నారు.వారు స్వామివారికి పట్టు వస్త్రాలు,తలంబ్రాలు అర్చకులకు అందచేశారు.కళ్యాణ మహోత్సవంలో వారు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.స్వామి వారి కళ్యాణం జరుగుతున్న క్రమంలో ట్రాంజెండర్లు ఒకరిపై ఒకరు తలంబ్రాలు పోసుకొని పలువురి ఆకట్టుకున్నారు.ఈ కల్యాణ వేడుకలలో ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్,ఆలయ ఈవో రమాదేవి దంపతులు,బిజెపి రాష్ట్ర నాయకుడు ప్రతాప రామకృష్ణ, మున్సిపల్ చేర్మెన్ పుల్కం రాజు, కౌన్సిలర్లు, డిఎస్పి శ్రీనివాసులు,సిఐ వీరప్రసాద్, ఎస్పీఎఫ్,పోలీస్ సిబ్బంది,మాజీ మార్కెట్ కమిటీ చేర్మెన్ మనోహర్ రెడ్డి,విహెచ్పి నాయకులు,ఆలయ సిబ్బంది, పలు పార్టీల నాయకులు,శివపార్వతులు, ట్రానుజెండర్లు కల్యాణ వేడుకలలో పాల్గొన్నారు.



# మార్చి 31లోపు ఆస్తిపన్ను చెల్లించాలి

### కలెక్టర్ సత్య ప్రసాద్

**రాయికల్, జనంసాక్షి:** రాయికల్ మున్సిపల్ పరిధిలో పాత బకాయి ఆస్తి పన్నులను ఈ నెల 31లోపు తప్పనిసరిగా వసూలు చేయాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులకు ఆదేశించారు. శుక్రవారం రాయికల్ పట్టణంలోని మున్సిపల్ పన్నుల వసూళ్లపై ఆయన సమీక్ష నిర్వహించారు. పట్టణంలో ఆస్తి పన్ను వసూళ్ల పురోగతిని పరిశీలించిన కలెక్టర్, బకాయిలు ఉన్న యజమానులకు వెంటనే నోటీసులు జారీ చేసి గడువులోపు పన్నులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నోటీసులు ఇచ్చినప్పటికీ పన్నులు చెల్లించని వారిపై కఠిన చర్యలు తీసుకుని నీటి కనెక్షన్లు తొలగించాలని స్పష్టం చేశారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మున్సిపల్ పరిధిలో పారిశుధ్యం, మౌలిక సదుపాయాలు, పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. పట్టణాభివృద్ధికి ఆస్తి పన్నులు కీలకమని, ప్రజలు స్వచ్ఛందంగా పన్నులు చెల్లించాలని కోరారు. ఈ సమీక్షలో మున్సిపల్ కమిషనర్, కీర్తి నాగరాజు, మున్సిపల్ మేనేజర్ వెంకటి, అశోక్, ఆర్ఐ. దేవదాస్, సిబ్బంది పాల్గొన్నారు.

# నర్మాలలో మతసౌహార్ధం చాటిన ముస్లిం సోదరులు

- హనుమాన్ మాల ధరించిన స్వాములకు పాలు, పండ్లు పంపిణీ
- ఒకే సమాజం, ఒకే మనసు - ప్రేమ, ఐక్యతకు మచ్చుతునక
- సేవాభావం ప్రదర్శించిన ముస్లిం యువకులు



**గంభీరావుపేట, మార్చి 27(జనంసాక్షి) :** గంభీరావుపేట మండలం నర్మాల గ్రామంలో మతసౌహార్దానికి ప్రతీకగా నిలిచే హృదయస్పర్శి సంఘటన చోటుచేసుకుంది. హనుమాన్ మాల ధరించి దీక్షలో ఉన్న స్వాములకు స్థానిక ముస్లిం సోదరులు సేవాభావంతో పాలు, పండ్లు పంపిణీ చేసి తమ విశాల హృదయాన్ని చాటుకున్నారు. ముస్లిం కమిటీ అధ్యక్షుడు షేక్ షబ్బీర్ ఆధ్వర్యంలో ఈ సేవా కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ముస్లిం యువకులు, పెద్దలు సమూహంగా పాల్గొని స్వాములకు స్వయంగా పాలు, పండ్లు అందజేశారు. స్వాములు కూడా ఈ సేవా కార్యక్రమాన్ని హర్షిస్తూ ముస్లిం సోదరులపై కృతజ్ఞతలు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా షేక్ షబ్బీర్ మాట్లాడుతూ, "మనం అందరం ఒకే సమాజానికి చెందినవారమే. మతాలు వేర్వేరు అయినా మనసులు ఒక్కటే. ఇలాంటి కార్యక్రమాల ద్వారా ప్రేమ, ఐక్యతను పెంపొందించుకోవడం చాలా అవసరం" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో దుబ్బ హనుమాన్ దేవాలయం కమిటీ అధ్యక్షులు రాజబోయిన అంజనేలు, ఉప సర్పంచ్ సుదర్శన్, కోశాధికారి మధు, సభ్యులు రాము, రాజు, నర్సింలు, కిషోర్, ముస్లిం సోదరులు మహమ్మద్ ఖాసీం, కమిటీ కోశాధికారి సమీర్, వసిఉల్లాహ్, జాహేద్, రెహాన్ తదితరులు పాల్గొన్నారు.

# ఆగిన ఆటో చక్రం


### గ్యాస్ కోసం డ్రైవర్ల ఆవేదన

- గంటల తరబడి క్యూలైన్లలోనే.. కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆందోళన



**అబ్దుల్లాపూర్మెట్ (జనంసాక్షి) :** పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలతో ఇప్పటికే ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆటో డ్రైవర్లకు ఇప్పుడు గ్యాస్ కొరత మరింత భారంగా మారింది. నగరంలోని పలు గ్యాస్ స్టేషన్ల వద్ద సిఎన్జీ, ఎల్ పిజి గ్యాస్ అందుబాటులో లేకపోవడంతో ఆటోలు నిలిచిపోయి, డ్రైవర్లు రోజులు తరబడి నిరీక్షించే పరిస్థితి ఏర్పడింది. ప్రతిరోజూ ఉపాధి కోసం రోడ్లపైకి వచ్చే ఆటో డ్రైవర్లు, గ్యాస్ కోసం గంటల కొద్దీ క్యూల్లో నిలబడాల్సి వస్తోంది. కొన్నిచోట్ల గ్యాస్ సరఫరా పూర్తిగా నిలిచిపోవడంతో, "ఆగిన ఆటో చక్రం"లా వారి జీవితం కూడా స్థంభించింది. రోజుకు వచ్చే ఆదాయం లేక కుటుంబాలను పోషించడం కష్టంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గ్యాస్ స్టేషన్ల వద్ద తెల్లవారుజామునే క్యూలు మొదలవుతున్నాయి. అయినా కూడా సరఫరా తక్కువగా ఉండటంతో చాలామంది ఖాళీ చేతులతోనే తిరిగి వెళ్తున్నారు. ఈ సమస్య వల్ల ప్రయాణికులకు కూడా ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఆటోలు అందుబాటులో లేకపోవడంతో ప్రయాణ ఖర్చులు పెరుగుతున్నాయి. సంబంధిత అధికారులు ఈ సమస్యపై దృష్టి సారించి గ్యాస్ సరఫరాను సమర్థవంతంగా నిర్వహించాలని, లేకపోతే పరిస్థితి మరింత విషమించవచ్చని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

**ప్రభుత్వం చొరవ తీసుకోవాలి : పులిపలుపుల వెంకటేశం, ఆటో డ్రైవర్**



రోజుకు కనీసం 10-12 గంటలు పని చేసి కుటుంబాన్ని పోషిస్తాం. కానీ ఇప్పుడు గ్యాస్ దొరకకపోవడంతో వాహనం నిలిపేయాల్సి వస్తోంది. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకుని సరఫరా పెంచాలి. లేకపోతే మా కుటుంబాలు రోడ్డున పడాల్సి వస్తుంది.

# మార్చి 31న ప్రైవేట్ సెక్యూరిటీ కార్మికుల సమావేశం

### విజయవంతం చేయాలని సిఐటియు పిలుపు

**కరీంనగర్ టౌన్ మార్చి 27 (జనం సాక్షి) :** కరీంనగర్‌లో ప్రైవేట్ సెక్యూరిటీ గార్డ్స్, స్వీపర్లు, వాచ్మెన్, ఆఫీస్ బాయ్స్ సమస్యల పరిష్కారానికి ఈనెల 31న సమావేశం నిర్వహిస్తున్నట్లు సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి పున్నం రవి తెలిపారు. కనీస వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ, భద్రతా సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఉదయం 10 గంటలకు కోతి రాంపూర్‌లోని సిఐటియు కార్యాలయంలో జరిగే ఈ సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# జిల్లాలో గ్యాస్ సిలిండర్లకు కొరతలేదు

### ప్రజల అవసరాలకు అనుగుణంగా నిలువలు ఉన్నాయి : కలెక్టర్ గరిమ అగ్రవాల్



**రాజన్న సిరిసిల్ల బ్యూరో, మార్చి 27 (జనం సాక్షి);** జిల్లాలో గ్యాస్ సిలిండర్లకు కొరత లేదని కలెక్టర్ గరిమ అగ్రవాల్ స్పష్టం చేశారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా జిల్లాలో సిలిండర్ల నిల్వలు ఉన్నాయని తెలిపారు. ఈ విషయంలో ఎలాంటి అపోహలు పడవద్దని, వదంతులు నమ్మవద్దని సూచించారు. గృహ వినియోగదారులు తొందరపడి గ్యాస్ బుక్ చేసుకోవద్దని తెలిపారు. తమ అవసరాలకు అనుగుణంగా గ్యాస్ బుకింగ్ చేసుకోవాలని సూచించారు. గ్యాస్ సిలిండర్ పక్కదారి పట్టినా.. బ్లాక్ దందా చేసిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఎల్‌పీజీ గ్యాస్ సరఫరా విషయమై జిల్లాలో కంట్రోల్ రూమ్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కంట్రోల్ రూమ్ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. జిల్లాలో ఎల్‌పీజీ గ్యాస్‌కు సంబంధించిన సమస్యలు ఎదురైతే వినియోగదారులు 80084 29738 ఫోన్ నంబర్‌కు సంప్రదించి తమ ఫిర్యాదులను తెలియ జేయవచ్చని పేర్కొన్నారు. ఎల్‌పీజీ గ్యాస్ సరఫరా, పంపిణీకి సంబంధించిన సమస్యలను పర్యవేక్షించడంతోపాటు వినియోగదారుల ఫిర్యాదులను స్వీకరించి, పరిష్కరించే చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.కంట్రోల్ రూమ్‌లో నమోదు అయ్యే ఫిర్యాదులను సంబంధిత అధికారులు, ఎల్‌పీజీ గ్యాస్ ఏజెన్సీలకు తెలియజేసి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పేర్కొన్నారు.



# రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**చొప్పదండి, మార్చి 27 (జనం సాక్షి):** రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఆ దిశగా రైతు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు .ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లిమిటెడ్ చొప్పదండి ఆధ్వర్యంలో జువ్వాడి చొక్కా రావు వ్యవసాయ మార్కెట్ కమిటీ చొప్పదండిలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని మొట్టమొదటి మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం మార్క్ ఫెడ్ ద్వారా ఈ కొనుగోలు కేంద్రం నిర్వహించబడుతుందని, రైతులు తాము ఆరుగాలం కష్టపడి పండించిన మొక్కజొన్న పంటను ప్రభుత్వ మద్దతు ధర క్వింటాలకు 2400/- లకు చొప్పదండి వ్యవసాయ మార్కెట్లో ప్రభుత్వం కల్పించే మద్దతు ధరపై అమ్ముకోవాలని సూచించారు. రైతులు తొందరపడి తాము పండించిన పంటను తక్కువ ధరకు అమ్ముకోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ అధ్యక్షులు కొత్తూరి మహేష్, ఉపాధ్యక్షులు రాజేందర్, మున్సిపల్ చైర్పర్సన్ వడ్లూరి సరిత, మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఇప్ప శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు సునీత, రాజేందర్ రెడ్డి, వెంకటేష్, రాజశేఖర్, మార్కెట్ డైరెక్టర్లు సాంబమూర్తి, శ్రీనివాస్, కొమరయ్య, స్వామి, రవి, మార్కెట్ కార్యదర్శి రాజేశ్వరి సొసైటీ కార్యదర్శి కళ్లెం తిరుపతిరెడ్డి ,సిబ్బంది తిరుపతి రమణారెడ్డి చెంబయ్య రాజమౌళి శ్రీనివాస్ లు పాల్గొన్నారు.

# బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా గడ్డం లక్ష్మణ్





**కరీంనగర్ టౌన్ మార్చి 27 ( జనం సాక్షి ):** కరీంనగర్ జిల్లా కోర్టు న్యాయవాదుల బార్ అసోసియేషన్ అధ్యక్షు డిగా సీనియర్ న్యాయవాది, మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గడ్డం లక్ష్మణ్ గెలుపొందారు. గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు జిల్లా కోర్టు ఆవరణలో న్యాయవాదులకు ఎన్నికలు నిర్వహించగా 908 మంది న్యాయవాదులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. తదుపరి ఓట్ల లెక్కింపు చేపట్టగా రాత్రి 10 గంటలకు ఎన్నికల అధికారి మారోజు రామకృష్ణచారి ఫలితాలను ప్రకటించారు. అధ్య క్షుడిగా గడ్డం లక్ష్మణ్, ఉపాధ్యక్షులుగా బి.గీతారాణి, బి. శివకుమార్, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్.కిరణ్ కుమార్, సంయుక్త కార్యదర్శిగా అనురాద(ఏకగ్రీవం), దేవకిషన్, కోశాధికారిగా బి.స్వామి, క్రీడల కార్యదర్శిగా శ్రీకాంత్, గ్రంథాలయ కార్యదర్శిగా బి.రాజేష్, సీనియర్ కార్యవర్గ సభ్యులుగా మదన్బాబు, భూమాచారి, సంధ్యారాణి, జూనియర్ కార్యవర్గ సభ్యులుగా శాంతికుమార్, బీ.శ్రీనివాస్, గంగు కరుణశ్రీ గెలుపొందినట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు.

# రామస్వామి గుట్ట వద్ద పేకాట స్థావరంపై దాడి.. ఐదుగురు అరెస్ట్

**హుజూర్ నగర్, మార్చి 27 (జనంసాక్షి):** పట్టణ పరిధిలోని రామస్వామి గుట్ట ప్రాంతంలో రహస్యంగా నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై పోలీసులు మెరుపు దాడి చేశారు. ఈ దాడిలో ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ బండి మోహన్ బాబు వెల్లడించారు. నమ్మదగిన సమాచారం మేరకు రామస్వామి గుట్ట పరిసరాల్లో తనిఖీలు చేపట్టగా, కొందరు వ్యక్తులు గుంపుగా చేరి జూదం ఆడుతూ కనిపించారు. వెంటనే వారిని చుట్టుముట్టి అదుపులోకి తీసుకున్నామని ఎస్ఐ తెలిపారు. నిందితుల నుండి 12,000 రూపాయల నగదు, 3 స్మార్ట్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

# రూ.2 కోట్లతో కళ్యాణ మండపం ఏర్పాటు

- కోల్ బెల్టులో ఆలయాలకు కొత్త రూపురేఖలు : ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్ ఠాకూర్



**గోదావరిఖని, జనంసాక్షి:** శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా గోదావరిఖని శ్రీ కోదండ రామాలయంలో జరిగిన సీతారాముల కళ్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్- మనాలి ఠాకూర్, నగర మేయర్ మహంకాళి స్వామి దంపతులు పాల్గొని స్వామివారికి పట్టు వస్త్రాలు- తలంబ్రాలు సమర్పించారు.ఆలయంలో ఉన్న సీతారామ లక్ష్మణ స్వాముల ఉత్సవ విగ్రహాలను ఒక వేదికపై ఏర్పాటు చేసి వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య అంగరంగ వైభవంగా సీతారాముల కళ్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, నగర మేయర్, సింగరేణి జిఎం లలిత్ కుమార్ దంపతులు, జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచందర్, ప్రజా ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కోదండ రామాలయం ఆవరణలో 2 కోట్ల నిధులతో కల్యాణ మండపం నిర్మిస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. తద్వారా అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడే విధంగా దానిని తీర్చిదిద్దుతామన్నారు. కోట్లాది రూపాయల నిధులతో నగరాన్ని సుందరీకరణ చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. ఈ ప్రాంతాన్ని ఆధ్యాత్మిక నగరం గా ఏర్పాటు చేస్తారని పేర్కొన్నారు. ఇదే క్రమంలో హనుమాన్ జంక్షన్ బి. పవర్ హౌస్ వద్ద భారీ హనుమంతుని విగ్రహం ఏర్పాటు, సమ్మక్క జాతర ఆవరణలో సకల సదుపాయాలు కల్పించామన్నారు. రామగుండం కార్పొరేషన్ కార్యాలయం సమీపంలో వినాయకుని విగ్రహం ఏర్పాటు చేస్తున్నామన్నారు. అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు.

# ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికతో అపూర్వస్పందన

- తెలంగాణ బీసీ స్టేట్ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్



**హైదరాబాద్ మార్చి 27 :** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా రాష్ట్రవ్యాప్తంగా కొనసాగిస్తున్న ప్రజా పాలన- ప్రగతి ప్రణాళికకు అనూహ్యస్పందన లభిస్తున్నట్లు ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయని తెలంగాణ బీసీ స్టేట్ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం నాడు ఆయన పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేస్తూ వార్డు మెంబర్ నుండి మంత్రి వరకు అందరి భాగస్వామ్యంతో, ఈ కార్యక్రమం అప్రతి హతంగా కొనసాగుతుందని, ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యకరణకు విశేష స్పందన లభిస్తుందని, 20 రోజుల్లోనే అనగా మార్చి 6 తేదీ నుండి 15వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని విభాగాలలో కలిపి 1,06,598 ఫైళ్ళ క్లియరెన్స్ జరగడం ఒక రికార్డు అని అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా పెండింగ్ లోఉన్న అన్ని పనులను పూర్తిచేసే దిశగా ప్రభుత్వం ముందడుగు వేసిందని, 99 రోజులు పాటు నిర్వహించనున్న శానిటేషన్ డ్రైవ్ కువిశేష స్పందన వస్తుందని, వార్డు మెంబర్లు, మంత్రులతో పాటు ప్రజలు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమాల్లో భాగస్వాములు అవుతున్నారని అన్నారు. ప్రభుత్వానికి చేరిన లెక్కల ప్రకారం మొత్తం 455.44 టన్నుల ఘనవ్యర్థాలను తొలగించినట్లు, మార్చి 19 నుండి 22 వరకు నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా సిద్దిపేట జిల్లా నర్మెట్టలో 70 లక్షల మంది రైతులకు ఎకరానికి 6000 చొప్పున 3500 కోట్ల రైతు భరోసా నిధులు జమ చేసిన ఘనత కూడా కాంగ్రెస్ ప్రభుత్వానికి లభిస్తుందని అన్నారు. ఆధునిక సాగు విధానాలు వ్యవసాయ యంత్రాలు తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించేందుకు మూడు రోజులపాటు రైతు మేళాలు నిర్వహించి విజయవంతంగా ముగించినట్లు, అదేవిధంగా సిద్దిపేట ప్రాంతంలో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీని ముఖ్యమంత్రి ప్రారంభించారని అలాగే పలు నీటి సరఫరా భూగర్భ డ్రైనేజీ ప్రాజెక్టులు, 50 పడకల సమీకృత ఆయుష్ ఆసుపత్రులు, యూపీహెచ్‌ఎస్సి భవన నిర్మాణం, 200 కోట్లతో గజ్వేల్ నియోజకవర్గంలోని కొండ పాకలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల శంకుస్థాపనకు నోచుకున్నాయని, ఇక వ్యాధుల వ్యాప్తి నియంత్రణ పశు జనన నియంత్రణ ఈ వ్యర్థాల నిర్వహణకు సంబంధించి ఫ్రైడే డ్రై డే అనే కార్యక్రమాన్ని నిర్వహించినట్లు అలాగే పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమాన్ని ప్రోత్సహించేందుకు హ్యాపీ సండే కార్యక్రమం ప్రతి ఆదివారం నిర్వహిస్తూ వస్తున్నామని అన్నారు. ఇది ఇలా ఉండగా జూన్ 2న తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకల నాటికి అన్ని జిల్లాలలో పెండింగ్లో ఉన్న అభివృద్ధి పనుల కోసం శంకు స్థాపనలు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారని, ఇందుకు సంబంధించి డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క నేతృత్వంలో క్యాబినెట్ సబ్ కమిటీ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని నిరంతరం పర్యవేక్షణ చేస్తుందని 99 రోజుల కార్యకరణ పర్యవేక్షణకు చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు ప్రత్యేక డ్యాష్ బోర్డు రూపొందించారని మంత్రులందరూ తమ జిల్లాలలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొనడం అభినందించదగ్గ విషయమని నూతి శ్రీకాంత్ గౌడ్ పేర్కొన్నారు.



## సీతారాముల కళ్యాణంలో డీజీపీ దంపతులు

**భద్రాచలం (జనంసాక్షి) :** భద్రాద్రి క్షేత్రంలో లోకపావనులైన సీతారాముల కళ్యాణ మహోత్సవం శుక్రవారం వేద మంత్రాల సాక్షిగా అత్యంత వైభవంగా, కనులపండుగగా జరిగింది. ప్రతి ఏటా నిర్వహించే ఈ మహోత్సవంలో భాగంగా ఈ ఏడాది కూడా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వేద మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల మధ్య జరిగిన ఈ వేడుకలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి దంపతులు, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దంపతులతో పాటు రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి.శివధర్ రెడ్డి తన సతీమణి హేమలతతో కలిసి పాల్గొన్నారు. వీరితో పాటు మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వాకిటి శ్రీహరి, కొండా సురేఖ, అనసూయ సీతక్క, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి తదితరులు స్వామివారి కళ్యాణాన్ని తిలకించి పునీతుల య్యారు. శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవ సందర్భంగా ముందస్తు భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు డిజిపి గురువారం సాయంత్రానికే భద్రాచలం చేరుకు న్నారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక పోలీస్ అధికారులతో బందోబస్తుపై చర్చిం చారు. రాష్ట్ర ముఖ్యమంత్రితో పాటు పలువురు మంత్రులు, భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. దాదాపు 2,000 మంది పోలీస్ సిబ్బందితో పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేశారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ పర్యవేక్షణలో స్థానిక పోలీసులు భద్రతా ఏర్పాట్లను నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందు లు కలగకుండా, క్రమశిక్షణతో కళ్యాణాన్ని వీక్షించేలా చర్యలు చేపట్టారు. భక్తిభావంతో పులకించిన భద్రాచలంలో సీతారాముల కళ్యా ణ మహోత్సవం కనులవిందుగా ముగిసింది.

# రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు వినతి

- **కొత్తగూడెం (భద్రాచలం రోడ్) రైల్వే స్టేషన్ చారిత్రక ప్రాముఖ్యత రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాల్సిందిగా ఎంపీలు వద్దిరాజు, సురేష్ రెడ్డిల విజ్ఞప్తి**



**ఖమ్మం టౌన్ (జనంసాక్షి) :** తెలంగాణలోని కొత్తగూడెం (భద్రాచలం రోడ్) రైల్వే స్టేషన్ చారిత్రక ప్రాముఖ్యత, నిరంతర సేవలను దృష్టిలో పెట్టుకుని డివిజన్ ఏర్పాటు చేసి మరింత అభివృద్ధి పర్చాల్సిందిగా కేంద్ర ప్రభుత్వానికి బీఆర్ఎస్ విజ్ఞప్తి చేసింది. ఈ రైల్వే స్టేషన్ మూలాలు 1932లో బ్రిటిష్ కాలం నాటివని, వేగంగా విస్తరిస్తున్న సింగరేణి బొగ్గు క్షేత్రాలకు సేవలు అందించడానికి గాను దీనిని "భద్రాచలం రోడ్"గా అభివృద్ధి చేశారని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ కే.ఆర్.సురేష్ రెడ్డి,డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్రలు రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ కు తెలిపారు.వారు పార్లమెంట్ ప్రాంగణంలో శుక్రవారం మంత్రిని కలిసి వినతిపత్రం ఇచ్చారు.ఆ కాలం నాటి చారిత్రక పత్రాలు, అరుదైన ఛాయాచిత్రాలు, రైల్వే, మైనింగ్ కార్యకలాపాలతో సంబంధం ఉన్న ఆధారాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ స్టేషన్ ఒక వ్యూహాత్మక బొగ్గు రవాణా కేంద్రంగా ఎలా రూపుదాల్చిందో ఇవి స్పష్టం చేస్తాయని రవిచంద్ర, సురేష్ రెడ్డిలు మంత్రికి వివరించారు. శతాబ్ద కాలంగా కొత్తగూడెం దేశానికి విద్యుత్ సరఫరా చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నదని వారు చెప్పారు. ఇది బ్రిటిష్ కాలంలో బొగ్గు వెలికితీత, రవాణాను సాధ్యం చేసిందని తెలిపారు. ఇది సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ కు ప్రధాన కేంద్రంగా కొనసాగుతున్నదని, భారతీయ రైల్వేలో సరుకు రవాణా ఆదాయానికి కీలకమైనదని తన వినతిపత్రంలో ఎంపీ రవిచంద్ర పేర్కొన్నారు. ఇంత గొప్ప వారసత్వం ఉన్నా కూడా భారతీయ రైల్వే చరిత్రలో కొత్తగూడెం స్టేషన్ తగిన గుర్తింపు లేని కీలకమైన ది మిగిలిపోయిందని వారు మంత్రి దృష్టికి తెచ్చారు. ఈ రోజు కొత్తగూడెంలో అనేక ప్రధాన రైల్వే ప్రాజెక్టులు కేంద్రీకృతమవుతున్నాయని ఎంపీలు రవిచంద్ర, సురేష్ రెడ్డిలు మంత్రికి తెలిపారు.కొత్తగూడెం-కిరండల్,మల్కన్ గిరి-భద్రాచలం జునాగఢ్- మల్కన్‌గిరి-భద్రాచలం కారిడార్,ప్రతిపాదిత కొత్తగూడెం-సత్తుపల్లి-కొవ్వూరు మార్గాలు అని వినతిపత్రంలో ఎంపీ వద్దిరాజు పేర్కొన్నారు.ఈ ప్రాంతం తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిషా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను కలిపే ఒక ప్రధాన రైల్వే కేంద్రంగా అభివృద్ధి చెందుతున్నదని ఎంపీ రవిచంద్ర తెలిపారు. 2032లో కొత్తగూడెం రైల్వే స్టేషన్ 100 ఏళ్ల మైలురాయిని చేరుకోనున్న తరుణంలో, ఈ చారిత్రాత్మక స్టేషన్‌కు తగిన గుర్తింపు లభించాలనేది ప్రజల చిరకాల ఆకాంక్ష అని ఆయన మంత్రికి వివరించారు. కొత్తగూడెంలో రైల్వే డివిజన్ ఏర్పాటు కేవలం అభివృద్ధి డిమాండ్ మాత్రమే కాదని, 1932 నుండి దాని చారిత్రక సహకారం, బొగ్గు, ఖనిజ రవాణాలో ప్రాముఖ్యత కలిగి ఉన్నదని, జాతీయ రైల్వే కేంద్రంగా భవిష్యత్తులో పాత్ర పోషించను న్నదని ఎంపీ వద్దిరాజు పేర్కొన్నారు. ఇలాంటి చర్య కార్యాచరణ సామర్థ్యాన్ని గణనీయంగా మెరుగుపరు స్తుందని, మౌలిక సదుపాయాల నిర్వహణను మరింత బలోపేతం చేస్తుందని, ముఖ్యంగా గిరిజన, వెనుకబడిన ప్రాంతాల్లోని లక్షలాది మందికి ప్రయోజనం చేకూరుస్తుందని ఆయన వివరించారు.కొత్తగూడెంను రైల్వే డివిజన్ గా ప్రకటించి అభివృద్ధి పర్చేందుకు వీలైనంత తొందరగా సాధ్యాసాధ్యాల అధ్యయనాన్ని మొదలు పెట్టాల్సిందిగా కోరారు. వందేళ్ల మైలురాయి (1932-2032) దృష్ట్యా ఈ ప్రతిపాదనను పరిగణించాల్సిందిగా వినతిపత్రంలో పేర్కొన్నారు. కొత్తగూడెం దశాబ్దాలుగా దేశ ఇంధన అవసరాలకు తోడ్పడుతోందని, శతాబ్దకాలం పూర్తి చేసుకుంటున్న ఈ తరుణంలో, ఇది గుర్తింపు, పెట్టుబడులు, సంస్థాగత హోదాకు అర్హమైనదని ఎంపీలు వద్దిరాజు, సురేష్ రెడ్డిలు రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ కు వివరించారు.

## నటుడు రాహుల్ రామకృష్ణ కుటుంబంలో విషాదం

- **గడ్డి మందు ప్రభావంతో సోదరుడు మృతి**
- **పారాక్వాట్‌ను నిషేధించాలని రామకృష్ణ బహిరంగ వినతి**



**హైదరాబాద్, మార్చి 27 (జనంసాక్షి) :** ప్రముఖ నటుడు, సినీ రచయిత రాహుల్ రామకృష్ణ కుటుంబంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఆయన సోదరుడు పారాక్వాట్ అనే అత్యంత ప్రమాదకరమైన గడ్డి నివారణ మందు కారణంగా మరణించారు. ఈ విషాద వార్తను పంచుకుంటూ రాహుల్ రామకృష్ణ సోషల్ మీడియా వేదికగా చేసిన ట్వీట్ ఇప్పుడు చర్చనీయాంశమైంది. ఈ ఘటనపై ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ, పారాక్వాట్ వంటి ప్రాణాంతక రసాయనాలు మార్కెట్‌లో ఎంత సులభంగా అందుబాటులో ఉన్నాయో వివరించాడు. ఈ విషప్రయోగం వల్ల సంభవించే మరణాల సంఖ్యను చూసి వైద్యులు కూడా దిగ్భ్రాంతికి గురవుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు రాహుల్ రామకృష్ణ ప్రధానమంత్రి కార్యాలయంతో పాటు తెలంగాణ ముఖ్యమంత్రి కార్యాలయానికి బహిరంగ విన్నపం చేశారు. పారాక్వాట్ అనేది చాలా శక్తివంతమైన రసాయనమని, దీనికి ఎటువంటి విరుగుడు లేకపోవడం వల్ల ఇది శరీరంలోకి వెళ్ళిన వెంటనే ఊపిరితిత్తులు, కిడ్నీలు మరియు కాలేయాన్ని పూర్తిగా దెబ్బతీస్తుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం వ్యవసాయ అవసరాల పేరుతో ఈ విషం మార్కెట్లలోనే కాకుండా ఈ-కామర్స్ సైట్లలో కూడా విచ్చలవిడిగా దొరుకుతోందని, దీనిని ఆత్మహత్యలకు ఎక్కువగా ఉపయోగిస్తున్నారని ఆయన వివరించారు. ఇలాంటి ప్రాణాంతక మందును తక్షణమే నిషేధించి మరిన్ని ప్రాణాలు పోకుండా కాపాడాలని ఆయన ప్రభుత్వాలను కోరారు. ఇప్పటికే పలు దేశాల్లో నిషేధానికి గురైన ఈ రసాయనంపై భారత్‌లో కూడా ఆంక్షలు విధించాలనే డిమాండ్‌కు నెటిజన్ల నుండి పెద్ద ఎత్తున మద్దతు లభిస్తోంది.

## భారీగా కుళ్లిన చికెన్ పట్టివేత



**హైదరాబాద్, మార్చి 27 (జనంసాక్షి) :** సిటీలో చికెన్ తినే వారికి షికింగ్ న్యూస్. కోల్డ్ స్టోరేజ్ లో గట్టిగా గడ్డ కట్టి.. బూజు పట్టి.. కుళ్లిపోయిన పరిస్థితిలో షాపులకు చేరుతోంది.శుక్రవారం ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీల్లో దొరికిన చికెన్ చూస్తే షాకవ్వాల్సిందే. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ప్రజారోగ్యానికి హాని కలిగించే విధంగా నిల్వ ఉంచిన కుళ్ళిన చికెన్‌ను స్థానిక విక్రేతలకు సరఫరా చేస్తున్న ఒక వ్యక్తిని హైదరాబాద్ కమిషనర్ టాస్క్ ఫోర్స్ బృందం అరెస్ట్ చేసింది. విశ్వసనీయ సమాచారం మేరకు, హెచ్-ఫాస్ట్ బృందం వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ కె. నాగార్జునతో కలిసి మూసాపేట సమీపంలోని భరత్ నగర్, జింకలవాడ వద్ద ఉన్న 'మెసర్స్ ఎస్.పి.ఆర్ చికెన్' ప్రాంగణంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. ఈ తనిఖీల్లో అత్యంత అపరిశుభ్రమైన వాతావరణంలో నిల్వ ఉంచిన కుళ్ళిన చికెన్‌ను గుర్తించారు. దీనిని స్థానిక హోటళ్లు, చికెన్ షాపులకు సరఫరా చేస్తున్నట్లు నిర్ధారణ అయింది. ఈ ఘటనకు సంబంధించి సూరజ్ పాల్ (66), అనే వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కూకట్‌పల్లి రాజీవ్ గాంధీ నగర్ లో నివాసం ఉండే పాల్ చికెన్ హోల్ సేల్ వ్యాపారం నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. కోల్డ్ స్టోరేజ్ సెంటర్ నుంచి సుమారు 352 కిలోల గడ్డకట్టిన కుళ్ళిన చికెన్ స్వాధీనం చేసుకున్నారు. అందులో రెక్కలు, చెస్ట్, లివర్, గిజార్డ్ వంటి భాగాలు స్వాధీనం చేసుకున్నారు. చికెన్ నిల్వ ఉంచిన ప్రాంగణం అత్యంత అపరిశుభ్రంగా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. లైసెన్స్ గడువు ముగిసినప్పటికీ నిబంధనలు ఉల్లంఘించి నిర్వహిస్తున్నారు. నిల్వ చేసిన మాంసం తినడానికి యోగ్యమైనది కాదని తెలిపారు. హెచ్-ఫాస్ట్ బృందం స్వాధీనం చేసుకున్న మాంసాన్ని, నిందితుడిని సనత్ నగర్ పోలీస్ స్టేషన్ ఎస్.హెచ్.ఓ కు అప్పగించారు. ఈ ఆపరేషన్‌లో హెచ్-ఫాస్ట్ ఇన్‌స్పెక్టర్, సిబ్బంది, సనత్ నగర్ పోలీసులు పాల్గొన్నారు.

## కూలిన కళ్యాణోత్సవ వేదిక

- **ఎమ్మెల్యే వేములకు తృటిలో తప్పిన ప్రమాదం**

**నల్లగొండ, మార్చి 27 (జనంసాక్షి) :** ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశంకు తృటిలో ప్రమాదం తప్పింది. కేతేపల్లి మండలం బండపాలెంలో శ్రీరామనవమి వేడుకల్లో అపశృతి చోటు చేసుకుంది. శ్రీసీతారాముల కళ్యాణోత్సవం నిర్వహిస్తున్న వేదిక అకస్మాత్తుగా కుప్పకూలింది. ఈ ప్రమాదంలో పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశం దంపతులు ఈ వేడుకల్లో పాల్గొని వెళ్లిన కొద్దిసేపటికే ఈ ప్రమాదం జరిగింది. సీతారాముల కళ్యాణోత్సవానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఇలాంటి సమయంలో వేదిక కూలడంతో భక్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నిర్వాహకుల నిర్లక్ష్యం వల్లే ఈ అపశృతి జరిగిందంటూ తీవ్రంగా విమర్శించారు.

## రాయవరం ప్రమాదంలో బస్సు యజమాని అరెస్ట్

**మార్కాపురం, మార్చి 27 (జనంసాక్షి) :** మార్కాపురం బస్సు ప్రమాద ఘటనలో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. బస్సు యజమాని, డ్రైవర్ పి.హరికృష్ణారెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. రాయవరం వద్ద గురువారం ప్రైవేటు ట్రావెల్స్ బస్సు- కంకర టిప్పర్ లారీ ఢీకొన్న ఘటనలో 14 మంది మృతి చెందిన విషయం తెలిసిందే. బస్సు ప్రమాద సమయంలో హరికృష్ణారెడ్డి డ్రైవింగ్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. ప్రమాదం తర్వాత ప్రయాణికులను వదిలేసి అతడు పరారయ్యాడు. నెల్లూరుకు పారిపోతుండగా గురువారం సాయంత్రమే పామూరు శివారులో పోలీసులు అతడిని పట్టుకున్నారు. ఇవాళ సాయంత్రం మార్కాపురం పోలీస్‌స్టేషన్‌కు తరలించే అవకాశం ఉంది.

## తమిళనాడులో సీట్ల పంపకాలపై అన్నామలై అసంతృప్తి

- **బిజెపి గెలిచే చోట కేటాయించలేదని అసహనం**
- **కేంద్ర నాయకత్వానికి లేఖ రాసినట్లు సమాచారం**

**చెన్నై, మార్చి 27 (జనంసాక్షి) :** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ-అన్నాడీఎంకే మధ్య సీట్ల పంపకాలపై బీజేపీ రాష్ట్ర శాఖ మాజీ అధ్యక్షుడు కె.అన్నామలై తీవ్ర అసంతృప్తితో ఉన్నారని పార్టీ వర్గాల సమాచారం. సీట్ల పంపకాల ఒప్పందంలో భాగంగా బీజేపీకి కేటాయించిన నియోజకవర్గాలపైనా ఆయన ఆందోళన వ్యక్తం చేస్తూ ఢిల్లీలోని పార్టీ అధిష్ఠానానికి లేఖ రాసినట్టు ఆ వర్గాలు తెలిపాయి. బీజేపీ తేలిగ్గా గెలిచే కినితుకడవు నియోజకవర్గంతో సహా పలు నియోజక వర్గాలను అన్నాడీఎంకే కేటాయించలేదని అన్నామలై ఆ లేఖలో పేర్కొన్నట్టు తెలుస్తోంది. తమిళనాడు ఎన్నికల్లో తాను పోటీ చేసేది లేదని కూడా పార్టీ అధిష్ఠానానికి తెలియజేసినట్టు చెబుతు న్నారు. సీట్ల పంపకాల ఒప్పందంపై కినితుకడవు నియోజకవర్గంలో బీజేపీ కార్యకర్తలు గురువారంనాడు నిరనస ప్రదర్శన కూడా నిర్వహించారు. తమిళ నాడులో ఎన్డీయే ఇటీవల సీట్ల కేటాయింపు ఒప్పందాన్ని ఖరారు చేసింది. 169 సీట్లలో అన్నాడీఎంకే పోటీ చేయనుండగా, బీజేపీకి 27 సీట్లు కేటాయించింది. ఇతర భాగస్వామ్య పార్టీలైన పీఎంకే 18, ఏఎంఎంకే 11 స్థానాల్లో పోటీ చేస్తున్నాయి. 27 సీట్లతో బీజేపీ సంతృప్తికరంగా ఉన్నట్టు ఆపార్టీ తమిళనాడు ఇన్‌చార్జి, కేంద్రమంత్రి పీయూష్ గోయల్ ప్రకటించారు.

## గల్ఫ్ ఆఫ్ మెక్సికోలో భారీ స్థాయిలో చమురు తెట్టు

- **సముద్ర జీవులపై తీవ్ర ప్రభావం**

**మెక్సికో, మార్చి27 (జనంసాక్షి) :** గల్ఫ్ ఆఫ్ మెక్సికోలో 600 కి.మీ మేర భారీ స్థాయిలో చమురు తెట్టు ఏర్పడటం ఆందోళన కలిగిస్తోంది. చమురు తెట్టు విస్తరించి సముద్ర జీవ వైవిధ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నట్లు మెక్సికో అధికారులు వెల్లడించారు. దీనివల్ల ఏడు ప్రకృతి సంరక్షణ ప్రాంతాలతో సహా సముద్రంలోని జీవరాశులపై పెను ప్రభావం పడిందన్నారు. రెండు సహజ చమురు ఊటలు, ఓ చమురు నౌక సముద్రంలో బోల్తాపడడం వల్ల ఈ ముప్పు సంభవించిందన్నారు. కొన్ని నెలల క్రితం భారీ వర్షాలు, వరదల కారణంగా మెక్సికోలోని వెరాక్రూజ్ ప్రాంతంలో సహజంగా చమురు బయటకు వచ్చే పైప్‌లైన్ దెబ్బతింది. దీంతో లీకైన చమురు నదుల ద్వారా సముద్రంలోకి చేరి, సుమారు 200 కిలోమీటర్ల తీరప్రాంతాన్ని దాటి మొత్తం 600 కిలోమీటర్ల వరకు వ్యాపించింది. అదనంగా, కాంపెచే బేలోని మరో సహజ చమురు ఊట కూడా నిరంతరం లీక్ అవుతూ కాలుష్యాన్ని మరింత పెంచుతోంది. ఇంకా ?. మూడు నెలల క్రితం సముద్రంలో ఒక చమురు నౌక మునిగిపోవడం వల్ల పరిస్థితి మరింత విషమించింది. ఈ ఘటనల వల్ల సముద్రంలోని వందలాది చేపలు, సముద్ర తాబేళ్లు వంటి జలచరాలు ప్రాణాలు కోల్పోతున్నాయి. అలాగే, ప్రకృతి సంరక్షణ ప్రాంతాలు, బయోస్పియర్ రిజర్వులు, జాతీయ పార్కులు కూడా తీవ్రంగా ప్రభావితమయ్యాయి. ప్రస్తుతం కాలుష్యాన్ని నియంత్రించేందుకు అధికార సిబ్బంది శు భ్రపరిచే చర్యలు చేపడుతున్నారు.

## అయోధ్యలో అద్భుత ఘట్టం ఆవిష్కృతం

- **బాలరాముడిపై సూర్యకిరణాలతో తిలకం**
- **తిలకించి, పులకించిన భక్తజనం**



**అయోధ్య, మార్చి 27(జనంసాక్షి) :** శ్రీరామ నవమి వేడుకల సందర్భంగా అయోధ్యలోని భవ్య రామమందిరంలో అద్భుత ఘట్టం ఆవిష్కృతమైంది. శుక్రవారం మధ్యాహ్నం సరిగ్గా 12:00 గంటలకు అభిజిత్ ముహూర్తంలో బాలరాముడి నుదుటిపై సూర్య కిరణాలు తిలకంలా మెరిసిపోయాయి. సైన్స్, ఆధ్యాత్మికత కలబోతగా జరిగిన ఈ 'సూర్య తిలకం' వేడుకను చూసి లక్షలాది మంది భక్తులు పులకించి పోయారు.ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఈ సూర్య తిలక వేడుకను నిర్వహించారు. మధ్యాహ్నం 12:00 గంటలకు ప్రారంభమై సుమారు కొన్ని నిమిషాల పాటు ఈ కాంతి తిలకం రామ్ లల్లాను ప్రకాశింపజేసింది. ఐఐటీ రూర్కీ శాస్త్రవేత్తల నేతృత్వంలో రూపొందిం చిన ఆటోమెకానికల్ సిస్టమ్ ద్వారా సూర్య కిరణాలు నేరుగా విగ్రహంపై పడేలా ప్లాన్ చేశారు. ఈ అద్భుత దృశ్యాన్ని వీక్షించేందుకు దేశ విదేశాల నుండి భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయ ప్రాంగణం తోపాటు అయోధ్య అంతటా ఏర్పాటు చేసిన భారీ ఎల్‌ఈడీ స్క్రీన్ల ద్వారా భక్తులు ఈ వేడుకను ప్రత్యక్షంగా వీక్షించారు. సూర్య కిరణం రామ్ లల్లా నుదుటిపై పడగానే భక్తులు 'జై శ్రీరామ్' అంటూ చేసిన నినాదాలతో అయోధ్య నగరం మారుమోగిపోయింది. సూర్యవంశీ యుడైన శ్రీరాముడికి సూర్యభగవానుడే స్వయంగా తిలకం దిద్దినట్లుగా ఉన్న ఈ దృశ్యం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ అద్భుతం భక్తులకు కనువిందు చేయడమే కాకుండా భారతీయ ఇంజనీరింగ్ నైపుణ్యానికి ప్రతీకగా నిలిచింది.

## గొల్లపల్లి కళ్యాణోత్సవంలో పాల్గొన్న కెటిఆర్



**రాజన్న సిరిసిల్ల, మార్చి 27 (జనంసాక్షి) :** శ్రీరామనవమి సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లిలోని హనుమాన్ ఆలయంలో సీతారామ చంద్రస్వామి కల్యాణ వేడుకలు ఘనంగా జరిగాయి. సంప్రయాదబద్ధంగా పండితులు కళ్యాణతోవసం నిర్వహించారు. ఈ వేడుకల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.రాములోరి కల్యాణోత్స వాలకు హాజరైన సందర్భంగా కేటీఆర్‌కు ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు.


## అంబర్‌పేట్‌లో విష బిస్కెట్లు..!



అంబర్‌పేట్, మార్చి 27 (జనం సాక్షి): అంబర్‌పేట్ ప్రాంతంలో ఉస్మానియా బిస్కెట్లు తయారు చేస్తున్న ఓ ఫ్యాక్టరీపై పోలీసులు, ఆహార భద్రత అధికారులతో కలిసి ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. బిస్కెట్లకు ఆకర్షణీయమైన రంగు, రుచి కలిగించేందుకు నిషేధిత, ప్రాణాంతక రసాయనాలను వినియోగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. అంతేకాకుండా, తక్కువ ఖర్చుతో ఉత్పత్తి పెంచేందుకు కుళ్ళిపోయిన, పాడైన గుడ్లను ఉపయోగిస్తున్నట్లు ఆధారాలతో సహా పట్టుబడింది. ఫ్యాక్టరీలో కనీస పరిశుభ్రత ప్రమాణాలు పాటించకపోవడం, ఈగలు ముసురుతున్న మురికి వాతావరణంలోనే తయారీ కొనసాగించడం అధికారులు గుర్తించారు. ఈ పరిస్థితులు ప్రజల ఆరోగ్యానికి తీవ్రమైన ముప్పు కలిగించే అవకాశముందని హెచ్చరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, ఫ్యాక్టరీ యజమానిపై కఠిన చర్యలు తీసుకునేందుకు అధికారులు సిద్ధమయ్యారు. స్వాధీనం చేసుకున్న ముడి సరుకులను ప్రయోగశాలకు పంపినట్లు సమాచారం.

## ప్రవాస తెలుగు మహిళకు అరుదైన గౌరవం

- **యూకేలోని వార్విక్ డిస్ట్రిక్ట్ కౌన్సిల్‌కు హేమ ఎంపిక**



**వరంగల్, మార్చి 27 (జనంసాక్షి) :** హనుమకొండకు చెందిన ప్రవాస భారతీయురాలు హేమ ఎల్లాప్రగడ అరుదైన గౌరవాన్ని సొంతం చేసుకున్నారు. యూకేలోని వార్విక్ డిస్ట్రిక్ట్ కౌన్సిల్‌కు 2023లో అధికార గ్రీన్ పార్టీ సభ్యురాలిగా ఎన్నికైన ఆమె తాజాగా క్యాబినెట్ కౌన్సిల్ మెంబర్‌గా ఎంపికయ్యారు. స్థానిక నగరాల్లో పాలన సాగించేందుకు డిస్ట్రిక్ట్ కౌన్సిల్స్ ఉంటాయి. డిస్ట్రిక్ట్ కౌన్సిల్‌లో అత్యధిక స్థానాలు గెలుపొందిన పార్టీ నేతను లీడర్ ఆఫ్ ది కౌన్సిల్‌గా పిలుస్తారు. సభ్యుల్లో కొందరిని క్యాబినెట్ కౌన్సిల్ మెంబర్‌గా ఎంపిక చేసి వివిధ పరిపాలనా విభాగాలను అప్పగిస్తారు. అలాగే హేమ ఎల్లాప్రగడకు ఇప్పుడు డీకార్బనైజేషన్ బాధ్యతలు అప్పగించారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370